veluturu telugu daily

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ | శనివారం 10.10.2026

సంపుటి : 9 | సంచిక : 118

www. veluturu.com

తెలంగాణ ఆడపడుచులకు ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు..

ఇట్లు: వెలుతురు యాజమాన్యం

ప్రజలందరూ సుఖసంతోషాలతో బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలి

సీఎం రేవంత్

రాష్ట్రంలోని ఆడ బిడ్డలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు ఆడబిడ్డలందరూ ఆటపాటలతో అత్యంత వైభవంగా ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ ప్రత్యేకత. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ఐక్యతకు బతుకమ్మ పండుగ నిలువెత్తు నిదర్శనమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ప్రజల సాంస్కృతిక వైభవాన్ని, మహిళల ఐక్యతను చాటిచెప్పే ఈ పండుగలో ఎన్నో సామాజిక అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. బతుకమ్మ సంబురాలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

- హైదరాబాద్, వెలుతురు

దేశంలోనే ప్రత్యేకమైనది ఆడబిడ్డల బతుకమ్మ పండుగ

రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే ఆటాపాటల సాంస్కృతిక వైభవం, తెలంగాణ రాష్ట్ర పండుగ, బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత, కె.చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. పువ్వులనే దేవతగా కొలుస్తూ, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల బతుకమ్మ పండుగ, దేశంలోని అన్నిసాంప్రదాయ పండుగల్లో ప్రత్యేకమైనదని కేసీఆర్ అన్నారు. తెలంగాణ జీవన విధానానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సామాజిక సంస్కృతికి దర్పణంగా నిలిచే బతుకమ్మపండుగ, తెలంగాణ ప్రజల జీవితంలో భాగమైందని తెలిపారు. తెలంగాణ తొలి ప్రభుత్వం బతుకమ్మ పండుగకు రాష్ట్ర పండుగ హోదానివ్వడమే కాకుండా, ఆడబిడ్డలకు కానుకగా బతుకమ్మ చీరలను పంపిణీ చేసే సాంప్రదాయాన్ని అమలు చేసిందని అన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్నికాపాడుతూ వారి సంక్షేమానికి పలు రకాల పటిష్ట కార్యక్రమాలను నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని కేసీఆర్ గుర్తుచేశారు. - హైదరాబాద్, వెలుతురు

హైదరాబాద్ వేదికగా

రహదారుల మహాకుంభమేళా!

నవంబర్ 19 నుంచి 22 వరకు 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్

తెలంగాణ ఖ్యాతిని చాటేలా ఏర్పాట్లు

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) జాతీయ సదస్సు ఏర్పాట్లపై శుక్రవారం డా.బీ.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఐఆర్‌సీ కార్యదర్శి జనరల్ రాహుల్ గుప్తా, ఐఆర్‌సీ డైరెక్టర్ సురేందర్ గర్గ్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ ప్రాంతీయ అధికారి కృష్ణ ప్రసాద్, సమాచార పౌర సంబంధాల కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య ఇంజనీర్లు ధర్మారెడ్డి, వసంత్ నాయక్, బి.వి.రావు, నర్సింగరావు పలువురు ఆర్ అండ్ బీ ఇంజనీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- సచివాలయం (హైదరాబాద్), వెలుతురు

- 3 వేల మంది ప్రతినిధులు.. 400 ప్రదర్శన శాలలు
- ప్రపంచస్థాయి సదస్సుల తరహాలో నిర్వహణ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలు

- వివరాలు 2 లో..

ఆరు స్థానాల్లో ఉప ఎన్నికలు.. కాంగ్రెస్‌కు సున్నా సీట్లు!

- రాహుల్ గాంధీ రాద్ధాంత రాజకీయాలను మరోసారి తిరస్కరించిన భారత్: కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి
- భారత్‌లో 'ఓట్ చోరీ' లేదు.. ఉన్నదల్లా 'ఓట్ దూరీ' మాత్రమే..
- ఏళ్ల తరబడి ప్రతికూల రాజకీయాలు, విద్వేషం, డొల్ల హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దూరమైంది..
- రాహుల్ గాంధీ రాజ్యాంగ సంస్థలపై దాడులు మానుకోవాలి...
- ప్రజాతీర్పును అవమానించడం ఆపాలి... ఓటరును గౌరవించడం నేర్చుకోవాలి..

న్యూఢిల్లీ వెలుతురు:

వివిధ రాష్ట్రాల్లో 6 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి ఖాతా తెరవలేక పోయింది. బీజేపీ-ఎన్డీయే నాలుగు స్థానాల్లో విజయం సాధించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి ఒక సూటి ప్రశ్న.. మీ రాజకీయాలను భారత ప్రజలు తిరస్కరించారని అంగీకరించడానికి ఇంకా ఎన్నిసార్లు ఓడిపోవాలనుకుంటున్నారు?

అస్సాంలోని నాగావ్ లోక్‌సభ స్థానాన్ని 2024లో కాంగ్రెస్ గెలుచుకుంది. ఇప్పుడు అదే స్థానంలో ఓట్ల శాతం రెండంకెలకు కూడా చేరక పోగా.. AIUDF కంటే వెనుకబడి మూడో స్థానానికి పడిపోయింది. దేశాన్ని పాలించాలని కలలు కంటున్న పార్టీ.. తాను గెలిచిన స్థానంలో కేవలం రెండేళ్ల వ్యవధిలోనే డిపాజిట్ కోల్పోయింది.

పశ్చిమబెంగాల్‌లోని నందిగ్రామ్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తృణమూల్ కాంగ్రెస్ తన అభ్యర్థిని ఉపసంహరించుకుని మరీ కాంగ్రెస్‌కు మద్దతిచ్చింది. అయినా బీజేపీ 1.22 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో ఆ అసెంబ్లీలో గెలిచింది. మిత్రపక్షాల మద్దతును కాంగ్రెస్ అరువు తెచ్చుకోవచ్చేమో.. కానీ ప్రజల విశ్వాసం మాత్రం కరువైంది.

రాహుల్ గాంధీ వరుసగా ఎన్నికల ఫలితాలను, కాంగ్రెస్ పార్టీ చరిత్రను ఒక్కసారి చూస్తే.. ఢిల్లీలో వరుసగా మూడు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు సున్నా. బిహార్‌లో 23 జిల్లాల్లో యాత్ర చేసినా..

- మిగతా 2 లో..

జి.ఓ. 59 దరఖాస్తుదారులకు శుభవార్త

- 500 చదరపు గజాల లోపు పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి వెరీగుడ్డు

- దాని పోషక విలువలపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- అంతర్జాతీయ ఎగ్ దినోత్సవంలో మంత్రి వాకిటి శ్రీహరి

12

రాజు గారి ఫామ్‌హౌస్‌లో కేటీఆర్‌కు రహస్య వైద్యం

12

- లండన్ వైద్యుడితో చికిత్స కోసం 5 కోట్లు ఖర్చు
- ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ సంచలన ఆరోపణలు
- డ్రగ్స్ పరీక్షకు సిద్ధమని ప్రకటించాలని డిమాండ్

ధరణి, భూభారతి భూదోపిడిపై త్వరలో పూర్తి ఆధారాలు బయటపెడతాం

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు:

రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనపై బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధరణి, భూభారతి పేరుతో జరిగిన భూదోపిడి, రాహుల్ గాంధీ రాజకీయ తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ధరణి పోర్టల్‌పై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించినప్పటికీ, ఆ నివేదికను ప్రభుత్వం ఎందుకు ప్రజలకు వెల్లడించలేదని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు.

బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో దోపిడి జరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 'భూభారతి' పేరుతో మరో వ్యవస్థను తెచ్చి ఈ ప్రభుత్వ హయాంలోనూ భూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర విమర్శలతో అసలు భూదోపిడి అంశాల నుండి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని, త్వరలోనే పార్టీలో చర్చించి పూర్తి వివరాలు, ఆధారాలను ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు.

ఎన్నికల వ్యవస్థపై రాహుల్ గాంధీ ఆరోపణల ఖండన

ఓట్ల చోరీ పేరుతో రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని మహేశ్వర్ రెడ్డి కొట్టిపారేశారు. ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, RDOలు, BLOల ద్వారా

- మిగతా 2 లో..

గౌడ, ఎస్సీ కుటుంబాల సాంఘిక బహిష్కరణ

- ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో దారుణం
- 17 రోజులు గడుస్తున్నా బాధితులకు దక్కని న్యాయం
- బాధిత కుటుంబాలకు రక్షణ, నష్టపరిహారం అందించాలి : సీపీఎం

2

'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా హైదరాబాద్

- ప్రపంచ స్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే 'ఎకో సిస్టమ్'
- గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
- ఫిన్‌టెక్ దిగ్గజం 'బ్యాక్‌బేస్' డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, వెలుతురు:

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల గమ్యస్థానంగానే కాకుండా... హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే 'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా తీర్చిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలు, సవాళ్లు, భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించే కాంప్రహెన్సివ్ ఎకో సిస్టంను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో 30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నెదర్లాండ్స్ గ్లోబల్ ఫిన్‌టెక్ దిగ్గజం 'బ్యాక్‌బేస్' డెవలప్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే టెక్నాలజీ, డిజిటల్ బ్యాంకింగ్,

- మిగతా 2 లో..

బండి సంజయ్ భవానీ దీక్ష షురూ

- శుక్రవారం ఉదయం మహాశక్తి ఆలయంలో మాలాధారణ
- 11 రోజులపాటు దీక్షలో కొనసాగనున్న కేంద్ర మంత్రి
- దసరా వరకు ఆలయంలో అమ్మవారి సేవలోనే తరించనున్న బండి

కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 09:

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ భవానీ దీక్ష చేపట్టారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ లోని శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య మాలాధారణ గావించి ఎర్రని వస్త్రాలు ధరించి అమ్మవారి దీక్ష చేపట్టారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈరోజు నుండి 11 రోజుల పాటు బండి సంజయ్ దీక్షలో కొనసాగనున్నారు. ఈ 11 రోజులు పూర్తిగా ఆలయంలోనే ఉంటూ అమ్మవారి సేవలో తరించనున్నారు. వివిధ సమస్యల నిమిత్తం కేంద్ర మంత్రిని కలిసేందుకు వచ్చే వారందరినీ ఆలయ ఆవరణలోనే కలుసుకుంటారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక టెంట్ ఏర్పాటు చేశారు.

మరోవైపు దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ మహాశక్తి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆలయ పరిసరాలన్నింటినీ దీప కాంతులతో నింపేశారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక నిర్వహించనున్న ఆధ్మాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 11 నుండి మహాశక్తి అమ్మవారు రోజుకో పూజ అందుకోనున్నారు. భారీ ఏర్పాట్ల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ సహా వివిధ జిల్లాల ప్రజల అడుగులన్నీ కరీంనగర్ లోని "మహాశక్తి అమ్మవారి ఆలయం"వైపే పడుతున్నాయి. ఈరోజు శుక్రవారం కావడంతో భవానీ దీక్షాధారులు, భక్తులతో శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయం సందడిగా మారింది. దసరా నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో కర్త, కర్మ, క్రియలా అన్నీ తానై వ్యవహరిస్తూ భక్తులకు ఏ చిన్న ఇబ్బంది లేకుండా అమ్మవార్లను ప్రశాంతమైన వాతావరణంలో మనస్ఫూర్తిగా దర్శించుకునేలా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సకల సౌకర్యాలు కల్పించారు. అంతే కాకుండా భవానీ మాలాధారణ చేసిన దీక్షాపరులకు భోజన, పూజా వసతులను కల్పించారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునే భక్తులందరికీ ఉచితంగా ప్రసాదాలను అందజేయనున్నారు. భవానీ మాలాధారులుసహా అమ్మవారిని దర్శించుకునే ప్రతి ఒక్కరికీ అల్పాహారంతోపాటు మధ్యాహ్న భోజన సౌకర్యాలను కల్పిస్తున్నారు. ప్రతిరోజు 5 నుండి 10 వేల మంది భక్తులకు భోజన, అల్పాహారాలను అందజేసేలా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. 16 ఏళ్ల క్రితం శ్రీమహాశక్తి ఆలయం ప్రతిష్టించారు. తొలిరోజుల్లో బండి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులతోపాలు కొద్ది మంది మాత్రమే నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భవానీ మాలను ధరించి దీక్ష తీసుకునే వారు. ఈ 16 ఏళ్లలో ఊహించని రీతిలో భవానీ దీక్షాపరుల సంఖ్య ఎక్కువైంది. గత రెండేళ్లలో దుర్గామాల వేసుకునే యువకుల సంఖ్య వేలల్లో ఉంది. అమ్మవారికి ఇష్టమైన ఎరుపు రంగు వస్త్రాలతో దీక్ష ధరించి అమ్మవారిని కొలుస్తున్నారు. దుర్గామాత దీక్షాపరులతో ఈ పుణ్యక్షేత్రం దసరా నవరాత్రి ఉత్సవాల్లో సందడిగా మారబోతోంది. 108 రోజుల దీక్ష... మండల దీక్ష... నవరాత్రి దీక్ష... ఎన్ని రోజులు దీక్ష చేసినా లక్ష్యం ఒక్కటే... "అమ్మవారి ఆశీస్సులు పొందాలి... అమ్మను నమ్ముకుని ముందుకు సాగాలి." అన్నదే భక్తుల సంకల్పంగా మారింది.

దసరా వేడుకలను ఘనంగా నిర్వహించాలి

రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09:

హైదరాబాద్ జిల్లాలో దసరా ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా టీజీవో హైదరాబాద్ జిల్లా 2026 బతుకమ్మ పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దసరా ఉత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అంజలా రెడ్డి వందన మమత జ్యోతి చంద్రజ్యోతి సరస్వతి సంధ్యారాణి మంజుల పార్వతి, టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబి కృష్ణ యాదవ్. కార్యదర్శి ఎంఎ ఖాదర్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

ఫిన్‌టెక్ రంగాల్లో హైదరాబాద్ ను గ్లోబల్ కంపెనీలకు ఒక ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దామన్నారు. బ్యాక్‌బేస్ లాంటి దిగ్గజ కంపెనీల విస్తరణే ఇందుకు నిదర్శనమన్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడం, పెద్ద కంపెనీలను రప్పించడమే కాకుండా... డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్ వేర్ ఇంజినీరింగ్ అండ్ ప్రొడక్ట్ డెవలప్ మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి రంగాల్లో ఉపాధి అవకాశాలను దక్కించుకునేలా తెలంగాణ యువతను సంసిద్ధం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో అడ్వాన్స్డ్ డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌ను అందుబాటులోకి తెచ్చేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు చూపే సత్తా టెక్నాలజీకి ఉందని, ఆ దిశగా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్ వేర్ ఉత్పత్తులను అందించడంలో ఈ బ్యాక్‌బేస్ డెవలప్‌మెంట్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇక్కడ కొత్తగా 300 మంది హై-స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నెదర్లాండ్స్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ యాన్ క్రెమర్స్, బ్యాక్‌బేస్ సీటీఓ గ్రెగ్ ఫాహి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రీన్‌హార్డ్ షీల్, ఇండియా సైట్ హెడ్ సురభి శర్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి ఆధారాలు బయటపెడతాం

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ ఇదే ఎన్నికల విధానం అమలవుతోందని గుర్తుచేశారు. సరైన ఆధారాలతో ఫిర్యాదు చేయకుండా ఎన్నికల వ్యవస్థపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదని అన్నారు.

జాతీయ భద్రత - ఎలన్ మస్క్ ట్వీట్ వివాదం

దేశ భద్రతకు సంబంధించిన కీలక అంశాలు విదేశీ సంస్థల చేతుల్లోకి వెళ్లే ప్రమాదంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎలన్ మస్క్ ట్వీట్‌కు రాహుల్ గాంధీ మద్దతు పలకడాన్ని తప్పుబట్టారు. జాతీయ భద్రతను పణంగా పెట్టే విధానాలకు మద్దతు ఇవ్వడం సరికాదని, బీజేపీకి ఎప్పుడూ దేశ ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

రాజకీయ ఆర్భాటాలు, నిరసన ప్రదర్శనలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని రాహుల్ గాంధీకి సూచించారు.

ప్రతిపక్ష నేతగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవిస్తూ, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హితవు పలికారు.

హైదరాబాద్ వేదికగా రహదారుల మహాకుంభమేళా!

నవంబర్ 19 నుంచి 22 వరకు 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్

- తెలంగాణ ఖ్యాతిని చాటేలా ఏర్పాట్లు
- 3 వేల మంది ప్రతినిధులు.. 400 ప్రదర్శన శాలలు
- ప్రపంచస్థాయి సదస్సుల తరహాలో నిర్వహణ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలు

సచివాలయం (హైదరాబాద్), వెలుతురు :

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) జాతీయ సదస్సు ఏర్పాట్లపై శుక్రవారం డా.బీ.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఐఆర్‌సీ కార్యదర్శి జనరల్ రాహుల్ గుప్తా, ఐఆర్‌సీ డైరెక్టర్ సురేందర్ గర్గ్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, కేంద్ర రోడ్డు రవాణా, జాతీ య రహదారుల శాఖ ప్రాంతీయ అధికారి కృష్ణ ప్రసా ద్, సమాచార పౌర సంబంధాల కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య ఇంజనీర్లు ధర్మారెడ్డి, వసంత్ నాయక్, బి.వి.రావు, నర్సింగరావు పలువురు ఆర్ అండ్ బీ ఇంజనీర్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి వచ్చే అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, రవాణా, ఆహారం, ఆతిథ్యం, పర్యాటక ప్రాంతాల సందర్శన తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. రాబోయే ప్రపంచ సదస్సు తరహాలో ఈ జాతీయ సదస్సు ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. ఐఆర్‌సీ విజయవంతం కోసం ముద్రణ, ఎలక్ట్రానిక్, డిజిటల్, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబర్‌లో నిర్వహించబోయే "ఇన్వెస్ట్ తెలంగాణ"(ప్రపంచ సదస్సు)లో పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

3 వేల మంది ప్రతినిధులు.. 400 ప్రదర్శన శాలలు

ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, కార్యదర్శులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇంజనీర్లు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి రహదారుల నిపుణులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు కలిపి సుమారు 3,000 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని మంత్రి తెలిపారు. హైటెక్స్‌లో సుమారు 400 ప్రదర్శన శాలలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, ఆధునిక సాంకేతికత, భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, నిపుణులు ఒకే వేదికపై సమావేశం కావడం వల్ల తెలంగాణకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించడంతో పాటు పెట్టుబడులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

నాలుగు రోజుల కార్యక్రమాల షెడ్యూల్

నవంబర్ 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఐఆర్‌సీ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. తాను, రాష్ట్రానికి చెందిన ఇతర మంత్రులు, ఇతర రాష్ట్రాల మంత్రులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, ప్రముఖులు కూడా పాల్గొంటారని చెప్పారు.ఆ తర్వాత రహదారుల నిర్మాణం, భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై అంతర్గత చర్చలు, నిపుణులతో సమూహ చర్చలు నిర్వహిస్తామని తెలిపారు. ఐఐటీ విద్యార్థులు, తెలంగాణలోని ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు, రహదారుల రంగ నిపుణులను కూడా ఈ చర్చల్లో భాగస్వాములను చేస్తామని చెప్పారు. నవంబర్ 19వ తేదీ రాత్రి హైటెక్స్‌లో ముఖ్యమంత్రి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అతిథులు, నిపుణులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తారని తెలిపారు. నవంబర్ 20న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో చర్చలు కొనసాగుతాయని, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, శాఖాధిపతులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. నవంబర్ 21న ముగింపు కార్యక్రమం నిర్వహించి, గవర్నర్‌ను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు. నవంబర్ 22వ తేదీ మధ్యాహ్నం ప్రతినిధుల తిరుగు ప్రయాణాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు

తెలంగాణ రాష్ట్రంలో ఐఆర్‌సీ నిర్వహించాలని తాను వ్యక్తిగతంగా, లేఖ ద్వారా చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించే అవకాశం కల్పించినందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో గతంలో ఆరు సార్లు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిర్వహించగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ కార్యక్రమం ఇక్కడ జరగడం ఇది రెండోసారి అని పేర్కొన్నారు.

త్వరలో హైదరాబాద్-విజయవాడ 6+2 వరుసల రహదారి పనులు

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65ను ఆరు ప్రధాన వరుసలు, రెండు సర్వీస్ వరుసలతో విస్తరించేందుకు రూ.12,073 కోట్లతో ఇప్పటికే ఆమోదం లభించిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సాంకేతిక కమిటీల ప్రక్రియ పూర్తయిందని, కేంద్ర మంత్రివర్గ కమిటీ ఆమోదం పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కార్యక్రమంలో, గుజరాత్‌లో జరిగిన చింతన్ శివిర్-2026లో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఈ ప్రాజెక్టును వేగవంతం చేయాలని కోరినట్లు వెల్లడించారు. తుది అనుమతులు లభించిన వెంటనే రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనుల ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగ భూసేకరణ పూర్తి

తెలంగాణ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. సంగారెడ్డి-నర్సాపూర్-తూప్రాన్-గజ్వేల్-జగదేవ్‌పూర్-భువనగిరి-చౌటుప్పల్ మార్గంలో 161.518 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే రెండుసార్లు టెండర్లు పిలిచినప్పటికీ, భూసేకరణ పూర్తికాకపోవడంతో వాటిని రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో మరోసారి టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రక్రియను కూడా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఉత్తర భాగానికి త్వరితగతిన ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదాలు లభించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు వెల్లడించారు. హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతుల అభివృద్ధికి దక్షిణ ఆర్ఆర్ఆర్ కీలకంగా మారుతుందని వివరించారు.

జాతీయ రహదారి-765పై మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి-765లోని నల్లమల అటవీ ప్రాంతంలో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని మంత్రి కోరారు. సుమారు రూ.7,600 కోట్ల అంచనా వ్యయంతో 52 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమైందని తెలిపారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఈ ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంతో పాటు నల్లమల అటవీ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని వివరించారు. ప్రాజెక్టుకు కేంద్ర స్థాయిలో అవసరమైన ఆమోదాలు త్వరగా లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ సదస్సు స్థాయిలో ఐఆర్‌సీ నిర్వహణ

ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను కేవలం ఒక సమావేశంగా కాకుండా, తెలంగాణ రహదారుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రోడ్డు భద్రత, పెట్టుబడుల ఆకర్షణకు ఉపయోగపడే వేదికగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులకు సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచివచ్చే ప్రతినిధులకు తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాన్ని చాటిచెప్పేలా ఏర్పాట్లు చేయాలని, ప్రతి విభాగం బాధ్యతతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని, తెలంగాణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

గౌడ, ఎస్సీ కుటుంబాల సాంఘిక బహిష్కరణ

- ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో దారుణం
- 17 రోజులు గడుస్తున్నా బాధితులకు దక్కని న్యాయం
- బాధిత కుటుంబాలకు రక్షణ, నష్టపరిహారం అందించాలి : సీపీఎం

నిజామాబాద్, వెలుతురు అక్టోబర్ 9:

నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో 39 గౌడ కుటుంబాలు, 11 ఎస్సీ కుటుంబాలను గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) సాంఘిక బహిష్కరణ చేయడంపై సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు ప్రాణ, ఆస్తి రక్షణ కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటన జరిగి 17 రోజులు గడుస్తున్నా బాధితులకు న్యాయం జరగలేదని ఆయన పేర్కొన్నారు. వీడీసీ సభ్యులపై నమోదైన ఏడు కేసులను విరమించుకోవాలని, రూ.6 లక్షలు వీడీసీకి చెల్లించాలని, లేనిపక్షంలో సాంఘిక బహిష్కరణ కొనసాగుతుందని హెచ్చరించడం దారుణమన్నారు. బాధిత కుటుంబాల జీవనాధారమైన ఈత వనాన్ని కాల్చివేసినందున వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బహిష్కరణకు గురైన కుటుంబాలతో గ్రామస్తులెవరూ మాట్లాడకూడదని, కిరాణా దుకాణాల్లో వారికి సరుకులు విక్రయించకూడదని వీడీసీ సభ్యులు ఆంక్షలు విధించారని జాన్ వెస్లీ తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే రూ.25 వేల జరిమానా విధిస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు. వీడీసీ సభ్యులు అడిగిన రూ.6 లక్షలు ఇవ్వనందుకే పాత కక్షలను ముందుకు తెచ్చి ఈ సాంఘిక బహిష్కరణకు పాల్పడ్డారని తెలిపారు. బాధిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేయడం ఇది రెండోసారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆయన విమర్శించారు. అధికారులు, బీసీ కమిషన్ గ్రామాన్ని సందర్శించినప్పటికీ బాధితులకు నేటికీ న్యాయం జరగలేదన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్, మెట్‌పల్లి తదితర ప్రాంతాల్లో వీడీసీల ముసుగులో జరుగుతున్న సాంఘిక బహిష్కరణలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. వీడీసీలను పూర్తిగా రద్దు చేస్తూ చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

జి.ఓ. 59 దరఖాస్తుదారులకు శుభవార్త

- 500 చదరపు గజాల లోపు పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కారం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 22ఎ పై శరవేగంగా ముఖ్యమంత్రి గారి హామీలు అమలు
- ఇప్పటివరకు ఏడు ఉత్తర్వులు జారీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ వెలుతురు:

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గత నెల 16వ తేదీన 22ఎ సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ఈరోజు మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుతో కలుపుకుంటే ఆరు ఉత్తర్వులను ఇవ్వడం జరిగిందని తాజాగా జి.ఓ. ఎంఎస్. నెం.59 కింద 500 చదరపు గజాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీవో నెంబర్లు 14,22,29,41 అనుగుణంగా మెమో నెంబర్ 48030ను జారీ చేశామని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఏమైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. జీవో 59 పరిధిలోని ఆస్తుల విషయంలో అసలు భూమి రికార్డులు, లబ్దిదారుల అర్హత, క్రమబద్ధీకరించాల్సిన విస్తీర్ణం తదితర అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి చిన్న పొరపాటుకు కూడా తావు లేకుండా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. గత ప్రభుత్వంలో 59 జీవోను అనుసరించి కొన్ని అక్రమాలు జరిగాయని తమ దృష్టికి రావడంతో జీవో అమలును నిలిపివేయడం జరిగిందని అలాంటి తప్పులు పునరావృతం కాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించబడిన కన్వేయన్స్ డీడ్స్ల జారీ అయిన కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలన్నారు. శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకువస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు.

ఆరు స్థానాల్లో ఉప ఎన్నికలు.. కాంగ్రెస్‌కు సున్నా సీట్లు!

(మొదటిపేజీ తరువాయి)

61 స్థానాల్లో పోటీచేసి.. గెలిచింది కేవలం 6 సీట్లే. బెంగాల్‌లో 294 స్థానాలకు గాను గెలిచింది రెండే. ఆంధ్రప్రదేశ్ 175 పోటీ చేస్తే గెలిచింది సున్నా. ఇలా రెండు దశాబ్దాల్లో ఇప్పటి వరకు 99 ఓటములు మూటగట్టుకున్నారు. ఓటముల సెంచరీకి రాహుల్ గాంధీ కేవలం ఒక్క అడుగు దూరంలోనే ఉన్నారు. ఈ సెంచరీ దాటడానికి ఎక్కువ రోజులు ఎదురుచూడాల్సిన పనిలేదు. కనీసం ఇప్పటికైనా కాంగ్రెస్ వాస్తవాలను గుర్తించి తన తప్పుడు చర్యలను మానుకోవాలి.

ఉత్తరప్రదేశ్‌లో 1989 నుంచి, బిహార్‌లో 1990 నుంచి, పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి, గుజరాత్‌లో 1998 నుంచి, ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి కాంగ్రెస్‌ను ప్రజలు అధికారానికి దూరంగా ఉంచారు. ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి మాత్రం ప్రజల నుంచి స్పందనే లేదు.

ఓడిపోయిన ప్రతిసారీ ఈవీఎం లదే తప్పు.. ఎన్నికల సంఘానిదే తప్పు.. ఓటర్ల జాబితాదే తప్పు.. ప్రధాన ఎన్నికల కమిషనర్‌దే తప్పు అని సాకులు వెతుక్కోవడానికే సరిపోతోంది. రాహుల్ గాంధీ అనుసరిస్తున్న దేశ, సమాజ, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు నమ్మడం లేదనే విషయాన్ని.. కాంగ్రెస్ అర్థం చేసుకోలేక రాజ్యాంగబద్ధ సంస్థలపై దుమ్మెత్తి పోస్తున్నాడు.

ఒక విషయం స్పష్టంగా చెబుతున్నాను.. భారత్‌లో 'ఓట్ చోరీ' లేనే లేదు. ఉన్నదల్లా 'ఓట్ దూరీ' మాత్రమే. అంటే.. ఏళ్ల తరబడి ప్రతికూల రాజకీయాలు, విద్వేషం, డొల్ల హామీలతో, తప్పుడు విధానాలతో, అవినీతి అసమర్థత, అహంకారం, అధికార దుర్వినియోగంతో కాంగ్రెస్ తనకు తానుగా ప్రజల నుంచి దూరమైంది.

దేశ ప్రజలు పనిచేసే నీతివంతమైన ప్రభుత్వాన్ని, ఫలితాలు చూపించే ప్రభుత్వాన్ని, సమర్థ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజలకు అందుతున్నది అదే. అభివృద్ధి, సంక్షేమం, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాలు, వికసిత్ భారత్ లక్ష్యానికి మద్దతుగానే దేశ ప్రజలు మళ్లీ మళ్లీ ఓటు వేస్తున్నారు.

రాహుల్ గాంధీ ఇప్పటికైనా రాజ్యాంగ సంస్థలపై దాడులు మానుకోవాలి. ప్రజల తీర్పును, మన ప్రజాస్వామ్యాన్ని అవమానించడం ఆపాలి. ఓటరును గౌరవించడం నేర్చుకోవాలి. విదేశాలకు వెళ్లి దేశాన్ని విమర్శిస్తూ, భారత్ వ్యతిరేక భావాలను వ్యాప్తి చేస్తే ఓట్లు రావు. చేసిన, చేస్తున్న తప్పులను సరిదిద్దుకుని వారి విశ్వాసాన్ని గెలుచుకుంటేనే ఓట్లు వస్తాయి.

రాహుల్‌కు ఒక న్యాయం..
తెలంగాణలో మరో న్యాయమా?

- తెలంగాణలో ప్రతిపక్షంపై అక్రమ కేసులు
- రాహుల్‌గాంధీకి స్వేచ్ఛ.. బీఆర్ఎస్ ఆందోళనలకు ఆంక్షలా? : గాదరి కిషోర్
- ఎమ్మెల్యేలపై లైంగిక వేధింపుల కేసులు ఉపసంహరించాలి : కూసుకుంట్ల
- సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలి: ఒంటెద్దు నరసింహారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 9, వెలుతురు : నిరసనల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం తెలం గాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఢిల్లీలో నిరస నలు చేస్తుంటే.. తెలంగాణలో ప్రతిపక్షం నిరసనలు చేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసులు పెట్టిస్తున్నా రని విమర్శించారు. రాహుల్‌గాంధీకి ఒక న్యాయం.. తెలంగాణలో ప్రతిపక్షానికి మరో న్యాయమా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే లను పోలీసులు అడ్డుకున్నారని, అసెంబ్లీ ముందు ఎమ్మెల్యేలు చేపట్టిన నిరసనలపై కావాలనే లైంగిక వేధింపుల కేసులు పెట్టారని గాదరి కిషోర్ ఆరోపిం చారు. రాహుల్‌గాంధీ ఢిల్లీలో మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, అదే తరహాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేసులు పెట్టారని అన్నారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగం గురించి నీతులు చెబుతున్నారని, తెలంగాణలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శిం చారు. కరెంట్ లేక రైతులు ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గాదరి కిషోర్ అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ డీడీని గతంలో రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచారని ఆరోపించారు. కేటీఆర్ కాలిగోటికి కూడా రేవంత్‌రెడ్డి సరిపోరని వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్‌లు, ఆస్తుల పేరుతో రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి పెట్టి డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. రాహుల్‌గాంధీ తెలంగాణలో ప్రతిపక్షం పట్ల రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని నిలదీయాలని, తాను ఢిల్లీలో స్వేచ్ఛగా నిరసనలు చేస్తున్నట్టే తెలంగాణలో బీఆర్ఎస్ ఆందోళనలు కూడా స్వేచ్ఛగా జరిగేలా చూడాలని రేవంత్‌రెడ్డిని ఆదేశించాలని కోరారు. ఎల్ఓపీ హోదాకు తగిన హుందాతనం రాహుల్‌గాంధీ ప్రదర్శించడం లేదని, ప్రియాంకగాంధీ కూడా పోలీసులపై దురుసుగా ప్రవర్తించారని అన్నారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ధర్నాలో కూర్చుని నీతులు చెబుతున్నారని, ఢిల్లీలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని అంటున్న రేవంత్‌రెడ్డి తెలంగాణలో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

స్పీకర్‌కు నోటీసులపై ప్రశ్నలు

స్పీకర్ ప్రసాద్‌కుమార్ తనకు పరువునష్టం నోటీసులు పంపారని గాదరి కిషోర్ తెలిపారు. స్పీకర్ గౌరవానికి వ్యతిరేకంగా తాను మాట్లాడలేదన్నారు. దానం నాగేందర్ విషయంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు తప్పుపట్టాయని, వాటికి కూడా స్పీకర్ నోటీసులు జారీ చేస్తారా అని ప్రశ్నించారు.

ఎమ్మెల్యేలపై కేసులు ఉపసంహరించాలి

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పెట్టిన లైంగిక వేధింపుల కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేసులు పెట్టాల్సి వస్తే రాహుల్‌గాంధీపైనే లైంగిక వేధింపుల కేసు పెట్టాలని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలు ఓటు చోరీ చేస్తుంటే రేవంత్‌రెడ్డి కరెంట్ చోరీ చేస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్‌ను చోరీ చేశారని ఆరోపిస్తూ.. రేవంత్ పాలన మొత్తం చోరీ పాలనగా మారిందని అన్నారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు జులుం చేస్తే.. రాహుల్‌గాంధీ ఢిల్లీలో పోలీసులపై జులుం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పెట్టిన అక్రమ కేసులకు రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదు

మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని ఆరోపించారు. రాహుల్‌గాంధీ చెప్పే నీతులు తెలంగాణలో అమలు కావడం లేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం చేతకాక రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కరెంట్ సరిగా లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సాగునీటి రంగంలో ప్రభుత్వ అలసత్వం రైతులకు శాపంగా మారుతోందని ఆరోపించారు. ఇకనైనా పాలనపై దృష్టి పెట్టి చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు.

సీఈసీ తీరుపై ఒంటెద్దు విమర్శలు

కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఒంటెద్దు నరసింహారెడ్డి మాట్లాడుతూ సీఈసీ బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో చాలా చోట్ల ఓట్లు తొలగిస్తున్నారని అన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసే ఫారాలు రాజ్యాంగబద్ధంగా నిర్ణయించబడ్డాయని, వాటిలో మార్పు చేయడానికి ఎన్నికల సంఘానికి కూడా అధికారం లేదని పేర్కొన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎస్ఐఆర్‌లో ఓటు కోల్పోయిన వారు కూడా ఫారం-6తో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దేశంలోని ఈఆర్‌ఓలకు ఈసీ నెట్‌తో అనుమతి లేదని, నేరుగా కేంద్ర ఎన్నికల సంఘంతోనే ఉందని అన్నారు. రోహింగ్యాల ఓట్లు తొలగించడాన్ని తాము వ్యతిరేకించబోమని, అయితే నిజమైన భారతీయ పౌరుల ఓట్లను తొలగించే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. దేశ ఎన్నికల సంఘాన్ని వెనుకేసుకురావడానికి బీజేపీ నేతలకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇతర పార్టీలపై రాజకీయంగా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని అవహేళన చేసిన పార్టీలు కాంగ్రెస్, బీజేపీలేనని విమర్శించారు. ఏ ఆర్టికల్‌ను అడ్డుపెట్టుకుని కారణాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలను బర్తరఫ్ చేశారో కాంగ్రెస్ చెప్పాలని ప్రశ్నించారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ నేతలు కంచర్ల కృష్ణారెడ్డి, రామచంద్రు నాయక్, ధర్మేందర్‌రెడ్డి, పడాల సతీష్, మహిపాల్ ముదిరాజ్ పాల్గొన్నారు.

డిజిటల్ విద్యలో మనమే
ముందు వరసులో ఉండాలి

టిసాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09: డిజిటల్ విద్య అనుసరించడంలో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు దేశంలోనే మొదటి స్థానంలో నిలవాలని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ టి-సాట్ కార్యాల యంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన పీఎం ఈ విద్య డీటీహెచ్ చానళ్ల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ముగింపు సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీఈవో బోదనపల్లి వేణు గోపాల్ రెడ్డి ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ప్రతిభ కల్గిన ఉపాధ్యాయులు రాష్ట్రంలోని సుమారు 20 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువున్న విద్యార్థులకు డిజిటల్ విద్యను నేర్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఉండే మొబైల్ ఫోన్లలో టి-సాట్ యాప్ తో పాటు పీఎంఈ-విద్య యాప్ సైతం డౌన్ లోడ్ చేసి డిజిటల్ పాఠాలపై ఆసక్తి పెరిగే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్ కు డిజిటల్ కంటెంట్ రూపొందించడంలో మెలకువలు నేర్పే లక్ష్యంతో కేంద్ర విద్యాశాఖ ఎన్సీఈఆర్టీ, సిఐఈటీ ఆధ్వర్యంలోని పీఎం ఈ విద్యా డీటీహెచ్ చానళ్ల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యపై అమితాశక్తిని చూపిస్తారని, అందుకే విద్యాశాఖను ఆయనే నిర్వహిస్తున్నారన్నారు. ఇంటిగ్రేటెడ్, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, టీచర్ల నియామకాలు కొనసాగిస్తూ విప్లవాత్మక సంస్కరణలతో విద్యారంగాన్ని దేశంలో అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఆర్. రమేశ్ కుమార్ మాట్లాడుతూ టెలివిజన్ ప్రొడక్షన్, స్క్రిప్ట్ రైటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఏఐ టూల్స్ వినియోగం వంటి అంశాలపై నాలుగు రోజులు శిక్షణ అందుకున్న ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మిగతా ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యపై అవగాహన కల్పించాలని సూచించారు. 2027 నవంబర్ లో నిర్వహించే 'పరాక్' ఎవాల్యుయేషన్ టెస్ట్ తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి 10 ర్యాంకుల్లో నిలిపే విధంగా ఉపాధ్యాయులు ప్రయత్నాలు మొదలు పెట్టాలని సూచించారు. టి-సాట్ లో నేర్చుకున్న అంశాలను రోజువారి పాఠశాల పనుల్లో ఆచరించాలని, దీర్ఘకాలం వీటిపట్ల ఆసక్తితో ఉండాలన్నారు. ఈ అంశాలను క్షేత్రస్థాయిలో ఎలా అమలుపరుస్తున్నారో చెక్ చేసేవిదంగా మూడునెలలకోసారి కెపాసిటీ బిల్డింగులో పాల్గొన్న ఉపాధ్యాయులతో జూమ్ మీటింగులు నిర్వహించి నిరంతర పర్యవేక్షణ చేస్తామన్నారు. పీఎం ఈ విద్య తెలంగాణ కో-ఆర్డినేటర్ డాక్టర్ కోమల్ ఆరోరా పాల్గొన్నారు. సమగ్ర శిక్ష అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నంద్యాల కళ్యాణి రెడ్డి కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించగా టి-సాట్ ఈడీ సాధిక్ పాషా, జీఎం లింగారెడ్డి, ఎన్సీఈఆర్టీ, సిఐఈటీ జాయింట్ డైరెక్టర్ ప్రొపెసర్ అమరేంద్ర బెహరా, పీఎం ఈ విద్య డీటీహెచ్ చానళ్ ఇంచార్జి ప్రొపెసర్ అభయ్ కుమార్, సిఐఈటీ పీఎం ఈవిద్యా ఇంచార్జి హెడ్, ఈడీ పూర్వీ చాజెద్ జూమ్ లో సందేశమివ్వగా అకడమిక్ కన్సల్టెంట్, పీఎం ఈవిద్య టీవీ ప్రొడ్యూసర్ బినితా రాయ్, అకడమిక్ కన్సల్టెంట్ డా. వైశాలి, అకడమిక్ కన్సల్టెంట్ రుచి ఎల్ ఖాత్రి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ విద్యాశాఖ ఆధ్యర్యంలో పాఠశాల విద్యా శాఖ, ఎస్సీఈఆర్టీ, సైట్ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా 100 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో
వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 09: హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని శుక్రవారం హైడ్రా ఒక ప్రకటనలో కోరింది. ఏసీబీ(యాంటీ కరప్షన్ బ్యూరో) లేదా స్థానిక పోలీసు స్టేషన్లో కూడా ఫిర్యాదు చేయాలని సూచించింది. అక్రమ కట్టడాలు, అనుమతి లేని నిర్మాణాలపై హైడ్రా ఎక్కడా నేరుగా చర్యలు తీసుకోదని స్పష్టం చేసింది. జీహెచ్ ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీల విజ్ఞప్తి మేరకే ప్రమాదకరమైన భవనాలను హైడ్రా తొలగిస్తోందని పేర్కొంది. హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడడం.. ప్రజలను భయపెట్టి డబ్బులు గుంజినట్టు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు, తమకు నేరుగా వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా ఈ ప్రకటన చేసింది. కూలిపోయే స్థితిలో ఉండి.. ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే భవనాలపై హైడ్రా చర్యలు తీసుకుంటుంది. ఇలాంటి భవనాల్లో హాస్టళ్లు నిర్వహించరాదని ఇప్పటికే హితవు పలికింది. సురక్షితమైన భవనాల్లోకి హాస్టళ్లు మార్చాలని సూచించింది. ఇందుకుగాను డిసెంబరు 31వ తేదీ వరకూ గడువు ఇచ్చిన విషయాన్ని హైడ్రా ఈ సందర్భంగా గుర్తు చేసింది. హైడ్రా పేరు చెప్పి డబ్బులు దండుకునే వారిపై నేరుగా హైడ్రా, ఏసీబీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలని సూచించింది. అలాగే స్థానిక పోలీసు స్టేషన్లో కూడా ఫిర్యాదు చేయాలని పేర్కొంది. హైడ్రా పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే వారు చెప్పిన మాటలు నమ్మి ఎలాంటి చెల్లింపులు చేయవద్దని సూచించింది.

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు:
ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరు 1064
హైడ్రా కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబరు 1070

తెలంగాణ ఆడబిడ్డలందరికీ
బతుకమ్మ శుభాకాంక్షలు

- మన సంస్కృతికి ప్రతీక బతుకమ్మ
- ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతిరూపం : మంత్రి సీతక్క

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9: తెలంగాణ ఆడబిడ్డలందరికీ, రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ అంటే మనకు పండుగ మాత్రమే కాదని.. మన బతుకుల్లోని బంధాలను, ఆప్యాయతలను, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే గొప్ప సంస్కృతీ సంప్రదాయమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రకృతిలో పూసే పూలను ప్రేమగా పేర్చి, బతుకమ్మను కొలుస్తూ ఆడిపాడే ఈ పండుగ తెలంగాణ ఆడబిడ్డల జీవితాల్లో ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో ఎక్కడ చూసినా బతుకమ్మ పాటలు వినిపిస్తుంటే మనసుకు ఎంతో సంతోషంగా ఉంటుందని.. కులమతాలకు, పేద ధనిక తేడాలకు అతీతంగా అందరూ ఒక్కచోట చేరి జరుపుకునే ఈ పండుగ మన ఐక్యతకు నిదర్శనమని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలి.. ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరియాలి.. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సీతక్క పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ, ఆర్థికంగా ఎదుగుతూ, ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చెరువులు, ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు. మన బతుకమ్మ బతుకుల పండుగ.. మన ఆడబిడ్డల ఆత్మగౌరవ పండుగ.. మన తెలంగాణ సంస్కృతికి గర్వకారణం. ఈ బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలను నింపాలని, ప్రతి ఆడబిడ్డ జీవితంలో కొత్త వెలుగులు నింపాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల ఐక్యతకు ప్రతీక బతుకమ్మ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9 : బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని ఆమె అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని గద్వాల విజయలక్ష్మి ఆకాంక్షించారు.

కేబీఆర్ పార్క్ వద్ద స్టీల్ ఫ్లైఓవర్

- రూ.1,090 కోట్లతో రెండు ప్యాకేజీల్లో నిర్మాణం
- రూ.1,200 కోట్ల వరకు ఆదా అంచనా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09 : కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా పరిశీలించారు. వన్‌వే అమలవుతున్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ పరిస్థితులు, జంక్షన్ల వద్ద రద్దీని పరిశీలించి అధికారులతో సమీక్షించారు. గతంలో కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, ఇతర గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. అయితే పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ విధానం అమలుతో ఏర్పడిన పరిస్థితులు, ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని గతంలో ప్రతిపాదించిన నిర్మాణ ప్రణాళికలను పునఃసమీక్షించి వన్‌వే విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జీహెచ్ఎంసీ చేపడుతున్న చర్యలను అధికారులు వివరించారు. చెట్ల తొలగింపునకు సంబంధించిన అనుమతులపై న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిన అంశాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రాజెక్టు రూపకల్పనను పునఃసమీక్షించారు.

రెండు ప్యాకేజీల్లో నిర్మాణం

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు విడివిడిగా అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్లు నిర్మించడానికి బదులుగా సమగ్ర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రణాళిక రూపొందించింది. ముఖ్యంగా ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి కేబీఆర్ పార్క్ ప్రవేశ మార్గం వరకు అధికంగా ఉంటున్న రద్దీని తగ్గించేలా నిరంతరాయంగా వాహనాలు ప్రయాణించే విధంగా ఈ కారిడార్‌ను రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టును ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణ విధానంలో రెండు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. ఆధునిక స్టీల్ నిర్మాణ సాంకేతికతను వినియోగించి నిర్మాణ సమయాన్ని తగ్గించడంతోపాటు ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి ప్యాకేజీలో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముగ్ధా జంక్షన్ వరకు స్టీల్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. దీనికి రూ. 580 కోట్లు అంచనా వ్యయం. రెండో ప్యాకేజీలో ముగ్ధా జంక్షన్ నుంచి ముఫఖం ఝా కాలేజీ వరకు ఫ్లైఓవర్ నిర్మించడంతోపాటు బంజారాహిల్స్ రోడ్ నంబర్--1కు ప్రత్యేక అనుసంధాన ర్యాంపు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్యాకేజీకి రూ. 510 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 1,090 కోట్లు. సుమారు 4.3 కిలోమీటర్ల పొడవున ఆరు లేన్లతో, రెండు దిశల్లో వాహనాల రాకపోకలకు అనుగుణంగా కారిడార్ నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. ఐదు ప్రధాన ట్రాఫిక్ జంక్షన్ల వద్ద సిగ్నళ్లపై ఆధారపడకుండా వాహనాల రాకపోకలు సాగించేలా ప్రణాళిక రూపొందించారు.

కేబీఆర్ పార్క్ పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతం కావడంతో అక్కడి పచ్చదనానికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రాజెక్టును అమలు చేయాలని ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. పార్క్ పరిధిలో నిర్మాణాల ప్రభావం లేకుండా, ఇప్పటికే ఉన్న పచ్చదనాన్ని కాపాడే విధంగా ఎలివేటెడ్ కారిడార్‌ను రూపొందించనున్నారు. మాడ్యులర్ స్టీల్ నిర్మాణ సాంకేతికతతో పనులను వేగంగా పూర్తి చేసి, రహదారులపై నిర్మాణ పనుల వల్ల ప్రజలకు కలిగే ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించాలని భావిస్తున్నారు.

భూసేకరణ, నిర్మాణ వ్యయాల్లో ఆదా

సమగ్ర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో అధిక విలువ కలిగిన ప్రైవేటు భూముల సేకరణ అవసరాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. భూసేకరణ వ్యయంలో సుమారు రూ. 800 కోట్లు, గతంలో ప్రతిపాదించిన అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణ ప్రణాళికతో పోలిస్తే నిర్మాణ వ్యయంలో సుమారు రూ. 400 కోట్లు ఆదా కావచ్చని భావిస్తున్నారు. మొత్తంగా రూ. 1,200 కోట్ల వరకు ఆదా చేయవచ్చని అంచనా. ఈ కారిడార్‌తో ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీ, ప్రయాణ సమయం, వాహనాల క్యూ లైన్లు తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇంధన వినియోగం, వాహన కాలుష్యం తగ్గడంతోపాటు నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ప్రవాహం మెరుగుపడుతుందని అంచనా వేస్తున్నారు. కేబీఆర్ పార్క్ పచ్చదనాన్ని పరిరక్షిస్తూ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ఆధునిక స్టీల్ నిర్మాణ సాంకేతికతతో పనులను వేగవంతం చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా వన్‌వే ట్రాఫిక్ విధానం అమలవుతున్న ప్రాంతాలను పరిశీలించి, ట్రాఫిక్ నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.

తెలంగాణలో డిజిటల్ సేవలు

- చివరి వ్యక్తి వరకు పంపిణీని బలోపేతం చేస్తున్న భారత తపాలా శాఖ ఆర్థిక సేవల విస్తరణ
- "ఒకే తపాలా వ్యవస్థ, అపరిమిత అవకాశాలు" ప్రజలకు అందుబాటులో ఉండే, సాంకేతికత ఆధారిత సేవలు అందించడమే లక్ష్యం: సీపీఎంజీ శ్రీ డీఎస్‌వీఆర్ మూర్తి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 9, 2026: అక్టోబర్ 9 ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా నేటి నుంచి ఈ నెల 15 వరకు జాతీయ తపాలా వారోత్సవాలను తపాలాశాఖ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని డాక్ సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) శ్రీ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడారు. భారత తపాలాశాఖ సాధించిన విజయాలు, సాంకేతిక పురోగతి, పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా శ్రీ మూర్తి మాట్లాడుతూ.. 1874లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) ఏర్పాటైన సందర్భంగా ప్రపంచ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది "ఒకే తపాలా వ్యవస్థ- అపరిమిత అవకాశాలు" అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. తపాలా కార్యాలయాల ద్వారా విస్తృత సేవలను కొనసాగిస్తూనే, ఆధునిక సాంకేతికతతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే సంస్థగా భారత తపాలాశాఖ అభివృద్ధి చెందుతున్న తీరును ఈ నినాదం ప్రతిబింబిస్తుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,49,385 కార్యాలయాలతో సహా మొత్తం 1,64,999 తపాలా కార్యాలయాలతో ప్రపంచంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థను ఇండియా పోస్టు నిర్వహిస్తోందని చెప్పారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో 36 ప్రధాన పోస్టాఫీసులు, 759 సబ్ పోస్టాఫీసులు, 5,424 బ్రాంచ్ పోస్టాఫీసులు పనిచేస్తున్నాయని.. ఈ వ్యవస్థలో 6,514 మంది శాఖా ఉద్యోగులు, 10,623 మంది గ్రామీణ డాక్ సేవకులు (జీడీఎస్) భాగస్వామ్యులుగా ఉంటూ.. గ్రామీణ, పట్టణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సేవలను అందిస్తున్నారని ఆయన వివరించారు. ఉపాధి కల్పన గురించి ప్రస్తావిస్తూ.. 17 విడతల రోజ్‌గార్ మేళా ద్వారా తపాలా శాఖ మొత్తం 1,86,202 నియామక ఉత్తర్వులను జారీ చేసిందని, ఇందులో 1,51,348 మంది గ్రామీణ డాక్ సేవకులు ఉన్నారని తెలిపారు. తెలంగాణ సర్కిల్‌లో 1,123 మంది గ్రామీణ డాక్ సేవకులతో సహా మొత్తం 1,272 మంది అభ్యర్థులు ఉద్యోగ నియామకాలను పొందారని ఆయన పేర్కొన్నారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా యూపీయూ అంతర్జాతీయ లేఖా రచన పోటీ 2026లో తెలంగాణ సర్కిల్ తరఫున విజేతలుగా నిలిచిన వారికి శ్రీ మూర్తి బహుమతులు అందజేశారు. తపాలా శాఖ అందిస్తున్న విభిన్న సేవలు, చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని నాయకత్వంలో తపాలా శాఖ సేవల పంపిణీని మెరుగుపరచడం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి చర్యలు చేపడుతోందని శ్రీ మూర్తి వివరించారు. అదే సమయంలో ప్రజలకు సేవలందించాలనే కీలక బాధ్యతను కూడా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఉత్తరాలు, పోస్టుకార్డుల ద్వారా ద్వారా సమాచారాన్ని చేరవేసే రోజులు ఉండేవని, ప్రస్తుతం ఎస్ఎంఎస్, వాట్సాప్, ఈ-మెయిల్ వంటి ఆధునిక మార్గాలు అందుబాటులోకి వచ్చాయని శ్రీ మూర్తి గుర్తుచేశారు. సమాచార అనుసంధానంలో సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో మార్పులు తీసుకొచ్చినప్పటికీ, వ్యక్తుల మధ్య వ్యక్తిగత అనుబంధాలకు ఉన్న విలువ మాత్రం అలాగే కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. మారుతున్న సమాచార అవసరాలకు అనుగుణంగా భారత తపాలాశాఖ తన సేవలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూనే.. ప్రజలను అనుసంధానించడం, వారికి అవసరమైన సేవలను అందించడం అనే తన దీర్ఘకాలిక లక్ష్యానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. డిజిటల్ గా వచ్చిన మార్పుల గురించి చెబుతూ... స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన సాంకేతిక వేదిక అయిన ఏపీటీ 2.0 ప్రారంభం కావడంముఖ్య విజయమని అన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు న్యాయం, రక్షణ మరింత బలోపేతం

రాజ్యాంగం కల్పించిన హామీ

-రాందాస్ అథవాలే

ప్రతి పౌరుడు గౌరవం, సమానత్వం, భద్రతతో జీవించగలడనే భరోసాపైనే న్యాయబద్ధమైన, సమ్మిళిత సమాజం నిర్మితమవుతుంది. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీలు) విషయంలో ఈ నిబద్ధతను పటిష్ఠమైన రాజ్యాంగ రక్షణలు, సమర్థవంతమైన చట్టాలు, ప్రజలకు అండగా నిలిచే సంస్థల ద్వారా ఆచరణలోకి తీసుకురావాలి. అందుకే అణచివేతలు, దౌర్జన్యాలను నిరోధించడం, బాధితులకు రక్షణ కల్పించడం, సకాలంలో న్యాయం అందేలా చూడటం కోసం భారత ప్రభుత్వం చట్టపరమైన, సంస్థాగత వ్యవస్థలను నిరంతరం బలోపేతం చేస్తోంది. ఈ వ్యవస్థకు రెండు కీలక చట్టాలు పునాదిగా నిలుస్తున్నాయి. అవి 1955 నాటి పౌర హక్కుల పరిరక్షణ చట్టం (రాజ=చాఖ్), 1989 నాటి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అఘాయిత్యాల నిరోధక చట్టం (రాజ/రు (రాశీరూ) చాఖ్). వీటిని కాలానుగుణంగా సవరిస్తూ మరింత బలోపేతం చేశారు. బాధితులకు అందించే పరిహారం, పునరావాస సదుపాయాలను మెరుగుపరచడం, ప్రత్యేక న్యాయ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను బలోపేతం చేయడం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక సాయం అందించడం వంటి చర్యలు చేపట్టారు.

న్యాయం కోసం మరింత
పటిష్ఠమైన చట్టపరమైన వ్యవస్థ

కులం ఆధారంగా జరిగే అఘాయిత్యాలను ఎదుర్కొనే విషయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సవాళ్లకు మరింత సమర్థంగా స్పందించేలా 1989 నాటి ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టంలో అనేక మార్పులు చేశారు. ఈ దిశగా 2016 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిన సవరణలు కీలక ముందడుగుగా నిలిచాయి. నేరాలపై వేగంగా విచారణ జరిపేందుకు ప్రత్యేకంగా ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయడం, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించడం వంటి నిబంధనలను ఈ సవరణలు తీసుకొచ్చాయి. అఘాయిత్యాలకు సంబంధించిన మరికొన్ని కొత్త రూపాలను కూడా చట్టంలో చేర్చారు. దీంతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు లభించే చట్టపరమైన రక్షణ పరిధి విస్తరించింది. బాధితులు, సాక్షుల హక్కుల కోసం ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చడం మరో ముఖ్యమైన చర్య. బాధితులు, వారిపై ఆధారపడినవారు, సాక్షుల పట్ల రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలను మరింత బలోపేతం చేశారు. ఒక కేసు నమోదు చేయడం, విచారణ జరపడంతోనే న్యాయం పూర్తికాదని, బాధితులకు రక్షణ కల్పించడం, వారి గౌరవాన్ని కాపాడటం, పునరావాసం అందించడం కూడా అంతే ముఖ్యమని ఈ చర్య గుర్తుచేస్తోంది. ఆ తర్వాత 1995 నాటి ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక నిబంధనలను 2016 ఏప్రిల్ 14న సవరించారు. ఈ సవరణలతో పరిహారం, పునరావాస వ్యవస్థ మరింత బలోపేతమైంది. అఘాయిత్యాలకు సంబంధించిన 47 రకాల నేరాలకు నిర్దేశించిన పరిహారాన్ని పెంచారు. బాధితులకు, వారిపై ఆధారపడినవారికి ఆర్థిక సాయం సకాలంలో అందించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

సకాలంలో న్యాయం అందేలా చర్యలు

2018 ఆగస్టు 20న ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టానికి చేసిన సవరణలతో మరిన్ని కీలక మార్పులు తీసుకొచ్చారు. ఈ చట్టం కింద కేసు నమోదు చేయడానికి ముందు ప్రాథమిక విచారణ జరపాలన్న నిబంధనను తొలగించారు. అలాగే, ఈ చట్టం కింద నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అరెస్టు చేయడానికి ముందస్తు అనుమతి తప్పనిసరి అన్న నిబంధనను కూడా తొలగించారు. దీని ఉద్దేశం స్పష్టమే. ఎస్సీలు, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తు, న్యాయ విచారణకు విధివిధానాల పేరుతో ఎలాంటి ఆటంకాలు కలగకూడదు. అదేవిధంగా, 1995 నాటి ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక నిబంధనలను 2018 జూన్ 27న కూడా సవరించారు. మరణం, గాయాలు, అత్యాచారం, సామూహిక అత్యాచారం, యాసిడ్ దాడులు, ఆస్తుల ధ్వంసం, చట్ట పరిధిలోకి వచ్చే ఇతర నేరాలకు సంబంధించిన కేసుల్లో పరిహార నిబంధనలను మరింత బలోపేతం చేశారు. చట్టం కాగితాలకే పరిమితం కాకూడదన్న కీలక సూత్రాన్ని ఈ సంస్కరణలు స్పష్టం చేస్తున్నాయి. బాధితుడు రక్షణ, న్యాయం కోరినప్పుడు చట్టం సులభంగా అందుబాటులో ఉండాలి, అతని అవసరాలకు తగిన విధంగా స్పందించాలి.

వేగవంతమైన విచారణ కోసం
ప్రత్యేక న్యాయస్థానాల బలోపేతం

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అందించిన సమాచారం ప్రకారం, 1989 నాటి ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల విచారణ కోసం 15 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 217 ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేశారు. కేసుల సంఖ్య తక్కువగా ఉన్న జిల్లాల్లో సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో సెషన్స్ కోర్టులను ప్రత్యేక న్యాయస్థానాలుగా గుర్తించేందుకు కూడా ఈ చట్టం అవకాశం కల్పిస్తోంది. ఈ ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయడం, మరింత బలోపేతం చేయడం ద్వారా కేసుల విచారణ వేగంగా పూర్తయ్యేలా చూడటంతోపాటు, సమర్థవంతంగా కేసులను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. బాధితులకు ప్రత్యేక న్యాయ వ్యవస్థల ద్వారా న్యాయం అందేలా చూడటం కూడా ఈ చర్యల ప్రధాన ఉద్దేశం. ఫిర్యాదుల పరిష్కారాన్ని ప్రజలకు చేరువ చేయడం ప్రజలకు తమ హక్కులపై అవగాహన ఉండి, అవసరమైన సహాయం సులభంగా లభించినప్పుడే చట్టపరమైన రక్షణకు నిజమైన అర్థం ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎస్సీలు, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలపై ఫిర్యాదుల కోసం జాతీయ హెల్ప్‌లైన్‌ను 2021 డిసెంబర్ 13న ప్రారంభించారు. అనంతరం దీనికి సంబల్ (నూవీదీూా) అని పేరు మార్చారు. టోల్‌ఫ్రీ నంబర్ 1800-202-1989, షార్ట్‌కోడ్ హెల్ప్‌లైన్ 14566 ద్వారా ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టంలోని నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచడం, సమాచారం అందించడం, మార్గదర్శనం చేయడం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను చేరుకునేందుకు సహకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అఘాయిత్యాల బాధితులు తమ చట్టపరమైన హక్కులు, అందుబాటులో ఉన్న పరిష్కార మార్గాల గురించి తెలుసుకునేందుకు ఈ హెల్ప్‌లైన్ ఒక ముఖ్యమైన మార్గంగా ఉపయోగపడుతోంది. ప్రజల్లో అవగాహన పెంచడం, సహాయాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ హెల్ప్‌లైన్ బాధితులకు రక్షణ, న్యాయం కల్పించే విస్తృత సంస్థాగత వ్యవస్థకు తోడ్పడుతోంది.

క్షేత్రస్థాయిలో అమలును బలోపేతం చేయడం

ఏ చట్టమైనా దాని అమలు సమర్థంగా ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు లభిస్తాయి. అందుకే 1955 నాటి పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1989 నాటి ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టాలను సమర్థంగా అమలు చేసేందుకు సంబంధిత వర్గాలు, మంత్రిత్వ శాఖలు, విభాగాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం పథకం మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సహాయం అందించడం, అఘాయిత్యాల నిరోధం, బాధితుల రక్షణ, పరిహారం, పునరావాసం, అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన చర్యలను బలోపేతం చేయడం కోసం ఈ మార్గదర్శకాలు ఒక క్రమబద్ధమైన వ్యవస్థను అందిస్తున్నాయి. అమలు సమయంలో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఉదాహరణకు, ఒక రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లిన బాధితులకు లేదా వారిపై ఆధారపడినవారికి పరిహారం అందించాల్సిన బాధ్యత ఏ రాష్ట్రానికి లేదా కేంద్రపాలిత ప్రాంతానికి ఉంటుందనే అంశంపై సందేహాలు తలెత్తాయి. ఈ విషయంలో స్పష్టత, ఏకరూపత తీసుకొచ్చేందుకు 2025 జూన్ 20న వివరణ జారీ చేశారు. చట్టం కింద ఎక్కడ ఎఫ్ఐఆర్ నమోదైతే, ఆ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతమే ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక నిబంధనల ప్రకారం నిర్దేశించిన పరిహారాన్ని అందించాలని ఈ వివరణలో స్పష్టం చేశారు. బాధితులు లేదా వారిపై ఆధారపడినవారు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి లేదా కేంద్రపాలిత ప్రాంతానికి వెళ్లినా చట్టం కల్పించే రక్షణ సమర్థంగా కొనసాగాలి. ఈ చర్యలు అందుకే కీలకం. పరిహారం సకాలంలో అందేందుకు, చట్టం అమలులో అన్ని ప్రాంతాల్లో ఒకే విధమైన విధానాన్ని పాటించేందుకు ఈ స్పష్టత దోహదపడుతుంది.

బాధితులు, సామాజిక సమ్మిళితత్వానికి
ప్రాధాన్యమిస్తూ కేంద్ర సాయం

1955 నాటి పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1989 నాటి ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టాల అమలు కోసం కేంద్ర ప్రాయోజిత పథకం ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. చట్ట అమలు వ్యవస్థలను బలోపేతం చేయడం, బాధితులకు పరిహారం, పునరావాసం కల్పించడం, సమాజంలో సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు. 2014--15 నుంచి ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ. 5,012.17 కోట్ల ఆర్థిక సాయం విడుదల చేసింది. ఈ కాలంలో అఘాయిత్యాల బాధితులుగా ఉన్న సుమారు 7,26,588 మందికి పరిహారం అందించారు. కులాంతర వివాహాలు చేసుకున్న 2,21,716 జంటలకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ గణాంకాలు కేవలం ఆర్థిక కేటాయింపులు, లబ్ధిదారుల సంఖ్యను మాత్రమే సూచించడం లేదు. బాధితులకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, సమానత్వం, సామాజిక సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించే చర్యల ద్వారా సామాజిక సామరస్యాన్ని పెంపొందించడం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఇవి తెలియజేస్తున్నాయి.

న్యాయం, గౌరవం, సమానత్వమే కేంద్రబిందువు

ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం, నిబంధనలను బలోపేతం చేయడం, ప్రత్యేక న్యాయ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, పరిహారం, పునరావాస సదుపాయాలను మెరుగుపరచడం, జాతీయ హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకురావడం, అమలు మార్గదర్శకాలను జారీ చేయడం, కేంద్రం నుంచి నిరంతర ఆర్థిక సాయం అందించడం వంటి చర్యలన్నీ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రక్షణ కల్పించే సమగ్ర విధానంలో భాగం. అఘాయిత్యాలు జరిగిన తర్వాత స్పందించడానికే మా నిబద్ధత పరిమితం కాదు. వాటిని ముందుగానే నిరోధించడం, అవగాహన పెంచడం, సంస్థల జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం, సకాలంలో పరిహారం అందించడం, పునరావాసం కల్పించడం, ప్రతి పౌరుడు గౌరవంగా, భయం లేకుండా జీవించగల పరిస్థితులను సృష్టించడం కూడా అంతే ముఖ్యం. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమానత్వం, గౌరవం, న్యాయం కల్పిస్తుందని హామీ ఇస్తోంది. ఈ విలువలను కాపాడేందుకు నిరంతర అప్రమత్తత, సమర్థవంతమైన అమలు, కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సన్నిహిత సహకారం అవసరం. ఈ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, అమలులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం, చట్టపరమైన రక్షణలు క్షేత్రస్థాయిలో బాధితులకు నిజమైన అండగా నిలిచేలా చూడటం కోసం ప్రభుత్వం తన కృషిని కొనసాగిస్తుంది. ఎస్సీలు, ఎస్టీల విషయంలో న్యాయం అనేది రాజ్యాంగం ఇచ్చిన హామీగా మాత్రమే మిగిలిపోకూడదు. గౌరవం, భద్రత, సమానత్వం, అవకాశాలతో కూడిన జీవితంలో ఆ న్యాయం వారికి అనుభవంలోకి రావాలి.

-రచయిత కేంద్ర సామాజిక న్యాయం,
సాధికారత శాఖ సహాయ మంత్రి

నా మనసులోని మాట

మనసుకు దగ్గరైన మనుషులు మనల్ని బాధపెట్టినప్పుడు, ఆ బాధ మాటల్లో చెప్పలేనంత లోతుగా ఉంటుంది. ఎందుకంటే మనం వాళ్లకు ఇచ్చింది కేవలం సమయం మాత్రమే కాదు... మన ప్రేమను, నమ్మకాన్ని, మన జీవితంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కూడా ఇచ్చాం. అలాంటి వాళ్లు దూరమైనప్పుడు, వాళ్లతో కలిసి ఊహించుకున్న భవిష్యత్తు కూడా చెదిరిపోయినట్టుగా అనిపిస్తుంది. ప్రేమించిన వాళ్లు మారిపోవడం, నమ్మిన వాళ్లు మాట తప్పడం, మనసును అర్థం చేసుకుంటారనుకున్న వాళ్లే మన భావాలను పట్టించుకోకపోవడం... ఇవన్నీ మనలో ఎన్నో ప్రశ్నలను మిగిలిస్తాయి. "నేను చేసిన తప్పేమిటి? నా ప్రేమలో లోపముందా? నాకు విలువ లేదా?" అని మనల్ని మనమే ప్రశ్నించుకుంటాం. కానీ ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటుంది. ఎదుటివారు మనల్ని గౌరవించకపోయినంత మాత్రాన మన విలువ తగ్గిపోదు. వాళ్లు మన ప్రేమను అర్థం చేసుకోలేకపోవచ్చు. మన నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోవచ్చు. వారి ప్రవర్తనను మన విలువకు కొలమానంగా చేసుకుంటే, మనల్ని మనమే అన్యాయంగా తక్కువ చేసుకున్నట్టవుతుంది. మనలో మార్పు రావడానికి గాయపడటం తప్పనిసరి కాదు. ప్రేమ, ప్రోత్సాహం, మంచి అనుభవాలు కూడా మనల్ని ఎదిగిస్తాయి. అయితే ఎదురైన బాధను మార్చలేని సందర్భంలో, ఆ బాధ నుంచి మనం ఏం నేర్చుకోవాలో ఎంచుకోవచ్చు. మనకు ఎలాంటి బంధాలు కావాలి, ఎక్కడ హద్దులు పెట్టుకోవాలి, ఎవరికి ఎంత స్థానం ఇవ్వాలి అనే విషయాల్లో మరింత స్పష్టత పొందవచ్చు. ఒకప్పుడు చిన్న మాటకే కన్నీళ్లు పెట్టుకున్న మనసు, అనుభవాల తర్వాత ప్రతి మాటకు వెంటనే స్పందించకుండా ఆలోచించడం నేర్చుకుంటుంది. ఎవరి మాటలను పట్టించుకోవాలో, ఎవరి తీర్పులను వదిలేయాలో తెలుసుకుంటుంది. ప్రతి ఒక్కరినీ ఒప్పించడానికి ప్రయత్నిస్తూ తన ప్రశాంతతను కోల్పోవాల్సిన అవసరం లేదని అర్థం చేసుకుంటుంది. అయితే మౌనంగా ఉండటానికీ, బాధను లోపలే అణచిపెట్టుకోవడానికీ తేడా ఉంది. అవసరం లేని వాదన నుంచి తప్పుకోవడం ప్రశాంతతను కాపాడవచ్చు. కానీ మనల్ని పదేపదే గాయపరిచే ప్రవర్తనను భరిస్తూ ఉండటం మనసుపై భారాన్ని పెంచుతుంది. అందుకే అవసరమైనప్పుడు "ఈ మాట నాకు బాధ కలిగించింది", "ఇలా ప్రవర్తించడం నాకు అంగీకారం కాదు" అని చెప్పడం కూడా నేర్చుకోవాలి. కన్నీళ్లు పెట్టుకోవడం, మన బాధను చెప్పుకోవడం, తోడు కోరుకోవడం కూడా ధైర్యంలో భాగమే. ఎప్పుడూ నవ్వుతూ కనిపించాల్సిన బాధ్యత ఎవరికీ లేదు. మనసు అలసిపోయినప్పుడు విశ్రాంతి తీసుకోవచ్చు. నమ్మకమైన వ్యక్తితో మాట్లాడవచ్చు. మనకు అవసరమైన సహాయాన్ని స్వీకరించవచ్చు. ముఖ్యంగా ఒక అమ్మాయి మనసు గాయపడినప్పుడు, ఆమె అనుభవించే బాధను బయటివారు పూర్తిగా అర్థం చేసుకోలేకపోవచ్చు. ఆమె ప్రేమించిన బంధంతో పాటు తన కలలను, ఆశలను, భవిష్యత్తును కూడా దానితో ముడిపెట్టుకుని ఉండవచ్చు. ఆ బంధం దెబ్బతింటే, తిరిగి తన జీవితాన్ని నిర్మించుకోవడానికి ఆమెకు సమయం అవసరం కావచ్చు. కొంతకాలం ఆమెకు బలహీనంగా అనిపించవచ్చు. ఒంటరితనం వేధించవచ్చు. తన నిర్ణయాలపై సందేహం రావచ్చు. అలాంటి రోజుల్లో ఆమెను తొందరగా కోలుకోవాలని ఒత్తిడి చేయకుండా, ఆమె మాటను వినడం, ఆమె భావాలను గౌరవించడం అవసరం. ఆమెకూ తన పట్ల ఓపిక ఉండాలి. ఒక్క రోజులో అన్ని బాధలూ మాయమవ్వాలని ఆశించాల్సిన అవసరం లేదు. క్రమంగా ఆమె తనను తాను మళ్లీ తెలుసుకోవడం మొదలుపెడుతుంది. "నాకు ఏం కావాలి? నేను ఏం సాధించాలనుకుంటున్నాను? నా జీవితంలో ఏ విషయాలు నాకు ఆనందాన్ని ఇస్తాయి?" అని ఆలోచిస్తుంది. పక్కన పెట్టిన చదువును కొనసాగించవచ్చు. తనకు ఇష్టమైన పనిని మొదలుపెట్టవచ్చు. తన ప్రతిభను పెంచుకోవచ్చు. ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేయవచ్చు. ఆమె నిర్మించుకునే కొత్త ప్రపంచం ఇలా మొదలవుతుంది--
--తన అభిప్రాయానికి స్థానం ఇచ్చుకోవడంతో, తన సమయాన్ని గౌరవించుకోవడంతో, తన ఆరోగ్యాన్ని చూసుకోవడంతో, తన కలలకు మళ్లీ అవకాశం ఇవ్వడంతో. తనను ప్రేమించే కుటుంబ సభ్యులు, స్నేహితులు, మంచి మనుషుల తోడును కూడా ఆ ప్రపంచంలో భాగం చేసుకోవచ్చు. గతంలో ఎదురైన చేదు అనుభవం వల్ల అందరినీ అనుమానిస్తూ జీవించాల్సిన అవసరం లేదు. కొత్త పరిచయాలకు సమయం ఇవ్వవచ్చు. మాటలతో పాటు ప్రవర్తనను గమనించవచ్చు. గౌరవం, నిజాయితీ, పరస్పర బాధ్యత ఉన్న బంధాలకు స్థానం ఇవ్వవచ్చు. తనను తాను కాపాడుకుంటూనే ప్రేమించగలగడం కూడా ఎదుగుదలే. ప్రతి గాయానికి వెంటనే ఒక పాఠం వెతకాల్సిన అవసరం లేదు. కొన్ని బాధలను ముందుగా అంగీకరించాలి. కొన్ని కోల్పోయిన విషయాల కోసం ఏడవాలి. కొన్ని జ్ఞాపకాల నుంచి దూరం కావడానికి సమయం తీసుకోవాలి. ఆ ప్రయాణంలో మళ్లీ బాధ కలిగిన రోజులు వచ్చినా, అప్పటివరకు వేసిన అడుగుల విలువ తగ్గిపోదు.

ఒక రోజు ఆమె వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, తన ప్రయాణంలో ఎన్నో చిన్న విజయాలు కనిపిస్తాయి. తన బాధను చెప్పగలిగిన రోజు, తన కోసం ఒక నిర్ణయం తీసుకున్న రోజు, తన పనిని తిరిగి మొదలుపెట్టిన రోజు, మనస్ఫూర్తిగా నవ్విన రోజు... ఇవన్నీ ఆమె తిరిగి నిలబడుతున్నదానికి గుర్తులు. మనసుకు గాయం చేసిన సంఘటన మన జీవితంలో ఒక భాగం. మన జీవితం ఇంకా ఎన్నో అవకాశాలతో ముందుంది. మనకు ప్రేమ పొందే హక్కు ఉంది. గౌరవంగా జీవించే హక్కు ఉంది. ప్రశాంతతను కోరుకునే హక్కు ఉంది. మన కోసం కొత్త దారిని ఎంచుకునే హక్కు ఉంది.

గాయపడిన మనసుకు సమయం ఇవ్వు...
కన్నీళ్లకు చోటివ్వు...
నీ కలలకు మరో అవకాశం ఇవ్వు...
నీ కోసం నువ్వు వేసే చిన్న అడుగును గౌరవించు.
నీ విలువను గుర్తించే ప్ర యాణం
నీతో నువ్వు ప్రేమగా మాట్లాడుకోవడం నుంచే మొదలవుతుంది.

మీ నక్క యాదగిరి

వాస్తవం

ప్రపంచం సులభమైంది, సాంకేతికత దగ్గరైంది, దూరాలు మాయమయ్యాయి, సౌకర్యాలు పెరిగాయి, అవకాశాలు విస్తరించాయి... అయినా మనిషి "సమయం లేదు" అని చెబుతూనే తన నుంచి తానే దూరమయ్యాడు.

మనము మర్చిపోతున్నది:
నిశ్శబ్దంగా కూర్చోవడం
మనతో మనం మాట్లాడుకోవడం
మనల్ని మనం అర్థం చేసుకోవడం
కొన్ని స్వచ్ఛమైన క్షణాల్లో మనస్ఫూర్తిగా నవ్వడం
కానీ ఇవేవీ చేయలేడు - ఎందుకంటే అతనికి సమయం లేదు.
చివరి సత్యం
ఒక రోజు... సమయమే అతని చేతుల నుంచి జారిపోతుంది.

ఈద శేఖర్
7036997589

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి

వ్యాధులను నిర్మూలిద్దాం

బయాలజిస్ట్ సూర్యకుమార్

విజయవాడ, వెలుతురు : నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం మల్లికార్జున పేట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు. సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు. నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు మాజీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్యామ్, హెల్త్ సూపర్ వైజర్స్ సిహెచ్ పిచ్చేశ్వరరావు, శివ శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీ శృంగేరి శ్రీ శారదాంబ

శరన్నవరాత్రి మహోత్సవాల ఆధ్యాత్మిక వైభవం

జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామివారి ఆశీస్సులతో జగజ్జనని శ్రీ శారదాంబ అమ్మవారి అనుగ్రహంతో జ్ఞానం, భక్తి, ఐశ్వర్యం, శాంతి, సద్బుద్ధి సమస్త మానవాళికి కలగాలని ఆకాంక్షిస్తూ... భారతీయ సనాతన ధర్మ సంప్రదాయంలో శరన్నవరాత్రులకు అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రంలోని తుంగానది తీరాన వెలసిన దక్షిణామ్నాయ శ్రీశృంగేరి శారదా పీఠంలో నిర్వహించే శ్రీ శారదాంబ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తి, జ్ఞానం, వేద సంప్రదాయం, ఆధ్యాత్మిక వైభవాలకు ప్రతీకగా నిలుస్తాయి. జగద్గురు శ్రీ ఆదిశంకర భగవత్పాదులచే ప్రతిష్ఠితమైన ఈ పవిత్ర పీఠంలో కొలువై ఉన్న జగజ్జనని శ్రీ శారదాంబ అమ్మవారు జ్ఞానప్రదాయిని, వాగ్దేవత, భక్తుల పాలిట కల్పవల్లి. పరమపూజ్య జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామివారి దివ్య మార్గదర్శకత్వంలో జరిగే ఈ మహోత్సవాలు దేశవిదేశాల్లోని లక్షలాది భక్తులకు ఆధ్యాత్మిక ప్రేరణను అందిస్తాయి. మహాలయ పక్షం పితృదేవతల స్మరణకు, అమావాస్య పుణ్యకాలం ఆధ్యాత్మిక సాధనకు విశిష్టమైనవి. అనంతరం ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శ్రీశృంగేరిలో నవరాత్రులకు ముందు అమ్మవారికి విశేష మహాభిషేకం నిర్వహించి, జగత్ప్రసూతికా అలంకారంతో దర్శనమివ్వడం ఒక ప్రత్యేక సంప్రదాయం.

అమ్మవారి నిత్య అలంకారాలు -- అంతరార్థం

శరన్నవరాత్రులలో ప్రతిరోజూ శ్రీ శారదాంబ అమ్మవారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి అలంకారం అమ్మవారి అనంత శక్తికి, సృష్టి స్థితి లయకారిణి అయిన ఆదిపరాశక్తి తత్త్వానికి ప్రతీక.

1. హంసవాహన అలంకారం -- బ్రాహ్మీ:
హంసవాహనంపై దర్శనమిచ్చే అమ్మవారు జ్ఞానం, వివేకం, విద్యలకు ప్రతీక. విద్యార్థులు, అధ్యాపకులు, జ్ఞానసాధకులు అమ్మవారిని ఆరాధించడం విశేష ఫలప్రదమని భక్తుల విశ్వాసం.

2. వృషభవాహన అలంకారం -- మాహేశ్వరీ:
పరమేశ్వరుని శక్తిస్వరూపిణిగా దర్శనమిచ్చే అమ్మవారు ధైర్యం, స్థిరత్వం, ధర్మనిష్ఠలకు ప్రతీక. మనస్సులోని అశాంతిని తొలగించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఆమె అనుగ్రహాన్ని భక్తులు ప్రార్థిస్తారు.

3. మయూరవాహన అలంకారం -- కౌమారీ:
కుమారస్వామి శక్తిస్వరూపిణిగా నెమలివాహనంపై దర్శనమిచ్చే అమ్మవారు శౌర్యం, శక్తి, విజయానికి ప్రతీక. సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం, కార్యసిద్ధి కోసం భక్తులు ప్రార్థిస్తారు.

4. గరుడవాహన అలంకారం -- వైష్ణవీ:
శ్రీమహావిష్ణువు శక్తిగా శంఖం, చక్రం, గద ధరించి దర్శనమిచ్చే అమ్మవారు ధర్మరక్షణకు, లోకక్షేమానికి ప్రతీక. కుటుంబ శ్రేయస్సు, సుఖశాంతుల కోసం భక్తులు అమ్మవారిని కొలుస్తారు.

5. ఐరావతవాహన అలంకారం -- ఇంద్రాణీ:
దేవేంద్రుని శక్తిగా దర్శనమిచ్చే అమ్మవారు పరాక్రమం, ఆధిపత్యం, దుష్టశక్తులపై విజయానికి ప్రతీక. భయాలను అధిగమించి ధర్మమార్గంలో నడిచే శక్తిని ప్రసాదించాలని భక్తులు వేడుకుంటారు.

6. వీణా శారదా అలంకారం:
వీణాధారిణిగా దర్శనమిచ్చే అమ్మవారు సంగీతం, సాహిత్యం, కళలు, విద్యలకు అధిదేవత. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించే తల్లిగా శ్రీ శారదాంబను ఆరాధిస్తారు.

7. మోహినీ అలంకారం:
అమృత కలశధారిణిగా దర్శనమిచ్చే అమ్మవారు దైవిక సౌందర్యం, మాయాశక్తి, వివేకానికి ప్రతీక. మోహం, అహంకారం, దురాలోచనలను అధిగమించి సత్యాన్ని గ్రహించే శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తారు.

8. రాజరాజేశ్వరీ అలంకారం:
పాశం, అంకుశం, పుష్పబాణాలు, చాపం ధరించి సర్వాలంకార భూషితగా దర్శనమిచ్చే అమ్మవారు సర్వశక్తిమయి. ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని, జీవితంలో సమతుల్యత, శాంతి నెలకొనాలని భక్తులు ప్రార్థిస్తారు.

9. సింహవాహన అలంకారం -- చాముండా:
సింహవాహనంపై త్రిశూలధారిణిగా దర్శనమిచ్చే అమ్మవారు దుష్టశక్తుల సంహారిణి. మహిషాసురమర్దిని ఆదిపరాశక్తి పరాక్రమాన్ని స్మరింపజేస్తూ, అధర్మంపై ధర్మం సాధించే విజయానికి ప్రతీకగా నిలుస్తారు.

10. గజలక్ష్మీ అలంకారం: పద్మాసీనురాలై ఇరువైపులా గజాలు అభిషేకం చేస్తున్నట్లు దర్శనమిచ్చే అమ్మవారు సంపద, ధాన్యం, సౌభాగ్యం, సంతోషాలకు ప్రతీక. సమస్త జీవుల శ్రేయస్సు, కుటుంబ సౌఖ్యం, లోకక్షేమం కోసం భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తారు. ఈ అలంకారాల క్రమం, రోజువారీ ప్రత్యేకత లు సంవత్సరానికీ, పీఠం నిర్ణయించే ఉత్సవ ప్రణాళికకీ అనుగుణంగా ఉండవచ్చు.

శరన్నవరాత్రులలో జరిగే విశేష పూజా కార్యక్రమాలు

శ్రీశృంగేరి క్షేత్రంలో శరన్నవరాత్రుల సందర్భంగా వేదపారాయణాలు, దేవీ మహాత్మ్యం, దుర్గా సప్తశతి పారాయణం, శ్రీ సూక్త జపం, దుర్గా జపం, లలితా త్రిపురసుందరి ఉపాసన వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీ శారదాంబ అమ్మవారికి జగద్గురువులచే విశేష పూజలు జరుగుతాయి. శ్రీచక్రానికి నవావరణ పూజ, శ్రీ చంద్రశేఖర స్వామివారికి శతరుద్రాభిషేకం, సువాసినీ పూజ, కుమారీ పూజ వంటి వైదిక సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. ప్రతిరోజూ సాయంత్రం శ్రీ శారదాంబ అమ్మవారి ఉత్సవమూర్తికి రథోత్సవం నిర్వహించడం, వేదఘోషలు, మంగళవాద్యాల మధ్య అమ్మవారి దివ్య వైభవాన్ని దర్శించుకోవడం భక్తులకు అపూర్వమైన అనుభూతిని కలిగిస్తుంది. ఉత్సవాల్లో భాగంగా జగద్గురువుల దర్బారు సంప్రదాయం కూడా విశేష ఆకర్షణగా నిలుస్తుంది. సంగీత కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత శోభాయమానం చేస్తాయి.

అమ్మవారిని ఆరాధించడం వల్ల కలిగే ఆధ్యాత్మిక ఫలితాలు

శరన్నవరాత్రులలో భక్తిశ్రద్ధలతో శ్రీ శారదాంబ అమ్మవారిని ఆరాధించడం వల్ల జ్ఞానం, వివేకం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని భక్తుల విశ్వాసం. దేవీ మహాత్మ్య పారాయణం, మంత్రజపం, ధ్యానం, దానం, అన్నదానం వంటి సత్కార్యాలు మనలో కరుణ, క్రమశిక్షణ, సేవాభావం, ధర్మనిష్ఠలను పెంపొందిస్తాయి. అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకోవడం అంటే కేవలం కోరికల నెరవేర్పును ఆశించడం మాత్రమే కాదు; మనలోని అజ్ఞానాన్ని తొలగించుకొని జ్ఞానమార్గంలో పయనించడం కూడా. "సర్వే భవంతు సుఖినః -- సర్వే సంతు నిరామయాః" అనే సనాతన ధర్మ సందేశానికి అనుగుణంగా, అమ్మవారి ఆరాధన వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు సమాజ శాంతి, సర్వజన హితం వైపు మనల్ని నడిపించాలి.

ముగింపు

శ్రీశృంగేరి శ్రీ శారదా పీఠంలో జరిగే శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తి, జ్ఞానం, ధర్మం, సంప్రదాయం కలగలిసిన పవిత్ర ఆధ్యాత్మిక పర్వదినాలు. జగద్గురు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామివారి దివ్య ఆశీస్సులతో శ్రీ శారదాంబ అమ్మవారి కరుణాకటాక్షాలు సమస్త భక్తజనులపై ప్రసరించాలని, ప్రతి ఇంటా జ్ఞానజ్యోతి వెలగాలని, ప్రతి హృదయంలో ధర్మబుద్ధి వికసించాలని, మన దేశం సుఖశాంతులతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థిద్దాం.

జయ జయ శంకర! హర హర శంకర!
శ్రీ శారదాంబ అమ్మవారి దివ్య చరణాలకు శతకోటి ప్రణామాలతో...
పి. ప్రసన్న కుమార్ శర్మ జనరల్ సెక్రటరీ, టీపీసీసీ అటాచ్డ్ టు పీసీసీ అధ్యక్షుల కార్యాలయం

సదా స్వామివారి భక్తితో

క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి మూడు విడతల్లో 10 లక్షల విలువ గల ఎల్వోసీ మంజూరు...

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 09: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో 130 - సుభాష్ నగర్ డివిజన్ సూరారం కు చెందిన కొడవాటి లక్ష్మీ నర్సింహ తండ్రి కె.శ్రీనివాస్ రావు గత కొన్నేళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బాధితుడికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మొదటి విడతగా రూ. 3,00,000/- లక్షలు, రెండవ విడతగా రూ. 4,00,000/- లక్షలు మంజూరు కాగా తాజాగా మూడవ విడతగా రూ. 3,00,000/- లక్షల రూపాయలను మంజూరు చేయించారు. కాగా శుక్రవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య రక్షకులు, ప్రజల బాగోగుల కోసం ప్రతీ క్షణం పనిచేసే నాయకులు మన ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, కట్టా సుందర్, సుకుమార్, విజయ్, ప్రభాకర్, శివ గౌడ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి అక్టోబర్ 09: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకొని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దమ్ము ధైర్యం ఉంటే నిజమైన రాజకీయం చేయాలి

- ఆడబిడ్డల మీద రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదు
- మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి

మంచాల వెలుతురు అక్టోబర్ 09: మంచాల మండలం కేంద్రంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత ప్రియతమ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందో మహిళల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్ లోబస్సు ఎక్కిఇంజాపూర్ వరకు బస్సుప్రయాణం చేశారు బస్సు ఎక్కగానే మహిళలని ఆప్యాయంగా పలకరిస్తూ ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందమ్మా అని అడిగి తెలుసుకుంటూ ఒక బిడ్డ లాంటి విద్యార్థిని చెయ్యి పట్టుకొని ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది అని అడిగి తెలుసుకుంటున్న స మయంలో కొంతమంది పోకిరీలు వీడియోలు తీసి ఆవీడియోలను తప్పుగా వక్రీకరించి కావాలని మహిళా చెయ్యి పట్టుకున్నాడని విషప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు ప్రియతమా నాయకుడు మల్ రెడ్డి రంగారెడ్డి రంగన్న నియోజకవర్గానికి తండ్రి ఒక పెద్దన్న లాంటివాడు అనిఅ న్నారు అలాంటి గొప్ప నాయకుడు గొప్ప ఎమ్మెల్యేపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు గత రెండు రో జులుగా విషప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు అన్నారు ఆడపిల్లలు అంటే గౌరవం లేదా బిఆర్ఎస్ పార్టీ నాయకులకు అని ఆగ్రహంవ్యక్తం చేశారు నియోజకవర్గంలో ప్రతిఒక్క కార్యకర్త నాయకుడు మాప్రియతమ ఎమ్మెల్యే గారిని ఆప్యాయంగా రంగన్న అన్న అని ప్రేమతో పలకరి స్తూ ఉంటారు అలాంటి గొప్ప నాయకుడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు అదే మీ బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి గారినిమీపార్టీ నాయకులు ఎవరైనా అన్న అనిపిలిస్తే ఆగ్రహంతో చూస్తాడు మీనాయకుడికి మానాయకుడికి ఉన్నతేడా ఏమిటో తెలుసు కోవాలి అని అన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి ప నులు చూసి ఓర్వలేకనే ఇలాంటి విషప్రచారాలు చేస్తున్నారు అని అన్నారు ఒక నియోజకవర్గా నికి ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే ప్రతి సమస్య తెలుసుకునే హక్కుఎమ్మెల్యేకు ఉంటుంది ఆహక్కుతో నే మహిళలను కలిసి సమస్యలు తెలుసుకున్నాడు తెలుసుకోవడం తప్ప అని అన్నారు దమ్ము ధైర్యం ఉంటే నిజమైన రాజకీయం చేయాలి విమర్శలకు ప్రతివిమర్శ చేసుకోవాలి గానీ ఒకఆడ పిల్లను అడ్డం పెట్టుకొని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదు అన్నారు సొంత బంధువులైన ఆడపిల్లలని గౌరవించని సంస్కృతి బిఆర్ఎస్ పార్టీ నాయకులది మహిళలతో పేకాట ఆడుతూ అడ్డంగా దొరికిన సంస్కృతి బిఅర్ఎస్ పార్టీ నాయకులది ఇబ్ర హీంపట్నం నియోజకవర్గంలో సమయానికి వర్షాలు కురవకరైతులు ఆందోళన చెందుతున్నారు అని తెలుసుకున్న మాఎమ్మెల్యే ప్రతిగ్రామానికి వెళ్లి రైతులను ఎలా ఆదుకోవాలి ప్రణాళికలు సి ద్ధం చేస్తూనే గ్రామాలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు చేస్తున్నాడు ప్రజాసేవకుడుఇబ్రహీం పట్నం డైనమిక్ ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి అనిఅన్నారు బిఆర్ఎస్ పార్టీ నాయకులుఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రంగారెడ్డి గారిపై విషప్రచారాలు చేయడం మానుకోవాలి లేని పక్షంలో రాబోయే సరైన రీతిలో సరైన బుద్ధిచెప్పుతాం అని హెచ్చరించారు

సంస్కృతి పాఠశాలలో సంబురంగా బతుకమ్మ పండుగ

జగద్గిరిగుట్ట వెలుతురు అక్టోబర్ 09: జగద్గిరిగుట్ట లోని సంస్కృతి పాఠశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. తిరొక్క పువ్వులతో బతుకమ్మ పేర్చి చిన్నారులు ఆడిపాడారు. బతుకమ్మ పాటలతో, కోలాటలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం బతుకమ్మలను బతుకమ్మ కుంటలో వేసి పోయిరావమ్మా గౌరమ్మ లాంటి పాటలతో సాగనంపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం మానుకోవాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొర్ర శ్రీనివాస్ నాయక్

మంచాల వెలుతురు అక్టోబర్ 09: మంచాల మండలం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం గిరిజనబిడ్డ మంచాల మండలం మాజీ ఎం పీపీ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొర్రశ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంఎమ్మె ల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి గారు అన్నివిధాల అబివృద్ధి చేస్తుంటే ఓర్వలేని బిఅర్ఎస్ పార్టీనాయ కులు బొగ్గులుర్ ఔటర్ రింగ్ రోడ్ దగర ఒక ఇబ్రాహీంపట్నం ఆర్టీసీ బస్సుఎక్కి బస్సులోఎమ్మె ల్యే రంగన్న గారు బస్సులో ఇంజాపూర్ వరకు బస్సు ప్రయాణం చేసి బస్సులోఉన్న అక్కలు అ మ్మలకు ఇంజనీరింగ్ అమ్మాయితోమాట్లాడుడుతూ తండ్రి తరువాత తండ్రి లాంటి దేవుడులాం టి మనిషినీ ఈతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ఎలాఉందిబిడ్డ మీకు ఫ్రీబస్సు సౌకర్యం ఉంది అన్ని ఆడుతు క్షేమలాభాల గురించి మాట్లాడు మన ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి వారి తో మాట్లాడుతుం టే కావాలని ఎమ్మెల్యే గారిపై బిఆ ర్ఎస్ పార్టీ నాయకులు సోషల్ మీడియా లో వారికి పచ్చ కామెర్లు వస్తెలోకమంత పచ్చగా అవుపడుతునట్లు వారికి ఉంది కాబట్టి వారు మా ఎమ్మెల్యే మాల్ రెడ్డి రం గారెడ్డి రంగన్న గారిపై తప్పుడు ప్రచారం మానుకోవాలని హెచ్చరి స్తున్నాను అన్నారు బిఅర్ఎస్ పార్టీ నాయకులకు నేను అడుగుతున్నాను మీరు పది సంవత్సరాలు అధికారంలో ఉండి మీరు ఏంచేశారో చెప్పాలని10 సంవత్సరాలు మీరు అధికారంలోఉం డి ఏంచేశారో నెమరు యేసుకోవాలి కోరిన్నారు.మీరు చేసింది ఒకటే పేదల భూముల. పైపడి దో చుకోవడం దాచుకోవడం తప్ప మీరు ఏమి చేయలేదు కాబట్టి మీరు మాఎమ్మెల్యేరంగారెడ్డి గా రు ఇబ్రాహీంపట్నం అన్నిరకాల అబివృద్ధి చేస్తుంటే ఆది ఓర్వలేక ఒక దేవుడులాంటి వ్యక్తినీ,ఒక నియోజక వర్గానికే ఒక తండ్రి లాంటి మంచి మనిషి పై తప్పుడు ధోరణితో ప్రచారం చేయడం మాట్లాడం బిఅర్ఎస్ నాయకులకు సిగ్గుచేటు మన ఇబ్రహీంపట్నం అన్ని రంగాలలో అభివృద్ధి చేసే నాయకుడు మల్ రెడ్డి రంగారెడ్డి ఇబ్రాహీంపట్నంలో 100 పడకల ప్రభుత్వం ఏరియా హాస్పిటల్, చెరువు కట్ట సుందరి కరణ, సి సి రోడ్లుఅండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఆరుట్ల గ్రామంలో తెలం గాణ పబ్లిక్ స్కూల్ అన్ని మండలలలో సిసి రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఐమాక్స్ లైట్ల ఎల్ ఈ డి,లైట్లు అంగన్వాడీ బిల్డింగ్ లు నియోజకవర్గం అన్ని తండాలకు బిటి లింకు రోడ్డు ఇంటిగ్రేట్ స్కూల్ ఇలా చెప్పుకుంటూఅన్ని రకాల అబివృద్ధి ప్రదాత మాల్ రెడ్డి రంగారెడ్డి రంగన్న మీరు ఆత్మపరిశోధన చేసుకొని మా ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి రంగన్న గారికి బేషరతుగా క్షేమ ప ణ చెప్పాలని తప్పుడు ఆరోపణ చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకుల. పై చట్టపరమైన చర్యలు తీ సుకోవాలని డిమాండ్ చేశారు

ప్రైవేటు ఉపాధ్యాయులకూ దసరా సెలవులు అమలు చేయాలి

- పాఠశాల విద్యాశాఖ సంచాలకుడికి టీపీటీఎల్ఎఫ్ వినతి
- ఆన్‌లైన్, ప్రత్యేక తరగతులు నిర్వహించకుండా ఆదేశాలివ్వాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09 తెలంగాణ ప్రభుత్వం విద్యాసంస్థలకు ప్రకటించిన దసరా సెలవులను ప్రైవేటు పాఠశాలల్లోనూ పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్, ఐఏఎస్‌కు ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు ఇస్తామని, ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు కూడా పంపిస్తామని తెలిపినట్లు ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన అనంతరం టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించిందని తెలిపారు. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సెలవులను అమలు చేయడం లేదని, ఆన్‌లైన్ తరగతుల పేరుతో, పదో తరగతి ప్రత్యేక తరగతుల పేరుతో బోధన కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ తరగతులు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కూడా సెలవులు తప్పనిసరిగా అమలు చేయాలని విజయ్‌కుమార్ కోరారు. కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులకు సెలవులు ప్రకటించి ఉపాధ్యాయులకు మాత్రం ఇవ్వడం లేదని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందికి 13 రోజుల పాటు సెలవులు అమలు చేసేలా విద్యాసంస్థలు, యాజమాన్యాలకు ఆదేశాలు ఇవ్వాలని, క్షేత్రస్థాయి అధికారుల ద్వారా వాటి అమలును పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ము విజయ్, రాష్ట్ర నాయకుడు చందు ఉన్నారు.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలి

- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ
- ప్రతి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్ ఎన్నికలకు సిద్ధం కావాలి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 09: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా నియమితులైన శ్రీమతి పారిజాత నర్సింహారెడ్డి గారు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ ను తన కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శర్మ ఆమెను శాలువతో సత్కరించారు.

జిల్లా రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, రాబోయే ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పి. ప్రసన్న కుమార్ శర్మ మాట్లాడుతూ, సమైక్య ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి నేటి తెలంగాణ రాష్ట్రం వం-కు రాష్ట్ర రాజకీయాల్లో రంగారెడ్డి జిల్లాకు అత్యంత కీలకమైన స్థానం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర విస్తరణ, పారిశ్రామికాభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగం, విద్యా సంస్థలు, ఐటీ రంగం, పట్టణీకరణతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రత్యేకతల కారణంగా రంగారెడ్డి జిల్లా రాష్ట్ర రాజకీయ, ఆర్థిక పరిణామాల్లో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి బలమైన రాజకీయ పునాదులు ఏర్పరచడం, ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసాన్ని మరింత పెంపొందించడం, ప్రతి నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులను సమన్వయంతో ముందుకు నడిపించడం అత్యంత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

మహిళా నాయకత్వానికి ప్రాధాన్యత

- కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలను శ్రీమతి పారిజాత నర్సింహారెడ్డి గారికి అప్పగించడం మహిళా నాయకత్వానికి ప్రాధాన్యతనిచ్చే కాంగ్రెస్ పార్టీ సంప్రదాయానికి నిదర్శనమని పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ అధ్యక్షురాలిగా మహిళకు ఈ బాధ్యతలు అప్పగించడం ఒక ముఖ్యమైన పరిణామమని, ఆమె నాయకత్వంలో పార్టీ మరింత చురుకుగా ప్రజల్లోకి వెళ్లేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. శ్రీమతి పారిజాత నర్సింహారెడ్డి గారిపై విశ్వాసం ఉంచి ఈ కీలకమైన బాధ్యతలను అప్పగించిన ఏఐసీసీ నాయకత్వానికి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారికి, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల మరియు బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థాయి కార్యకర్తలను కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా అధ్యక్షురాలి బాధ్యత అనేది కేవలం పార్టీ కార్యక్రమాలను నిర్వహించడానికే పరిమితం కాకుండా, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా నిలవడం, స్థానిక సమస్యలపై స్పందించడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, నాయకత్వానికి మరియు క్షేత్రస్థాయి కార్యకర్తలకు మధ్య సమర్థవంతమైన అనుసంధానాన్ని ఏర్పరచడం కూడా అని ఆయన పేర్కొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

రంగారెడ్డి జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని సమీక్షిస్తూ, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కార్యాచరణ రూపొందించాలని పి. ప్రసన్నకుమార్ శర్మ సూచించారు. పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న పాత తరం నాయకులతో పాటు యువత, మహిళలు, విద్యార్థులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యతనిస్తూ పార్టీ నిర్మాణాన్ని మరింత విస్తరించాలని అన్నారు.

గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలను చురుకుగా పనిచేయించే విధంగా చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సంబంధిత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పార్టీ ప్రజలకు మరింత చేరువ కావాలని పేర్కొన్నారు.

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తలకు తగిన గుర్తింపు, పార్టీ కార్యక్రమాల్లో అందరి భాగస్వామ్యం కీలకమని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా పార్టీ ప్రయోజనాలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకొని పనిచేసినప్పుడే సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు.

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు కార్యాచరణ

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే ఇతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.

ఎన్నికలు సమీపించినప్పుడు మాత్రమే పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం కాకుండా, నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సహకరించడం, యువతకు ఉపాధి, విద్యార్థుల సమస్యలు, మహిళల సంక్షేమం, రైతుల అవసరాలు, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులను గుర్తించడం, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడం, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయి పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయడం, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధించి పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ బలాన్ని పెంచే కార్యక్రమాలను రూపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఎన్నికను ఒక ప్రత్యేక బాధ్యతగా తీసుకొని, ఆయా ప్రాంతాల్లో పార్టీ బలాబలాలను సమీక్షిస్తూ, స్థానిక సమస్యల ఆధారంగా కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు. ఎన్నికల విజయానికి నాయకుల సమన్వయం, కార్యకర్తల కృషి, ప్రజలతో నిరంతర సంబంధాలు, పటిష్ఠమైన సంస్థాగత నిర్మాణం ప్రధానమని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి కార్యక్రమాలు, ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై చర్చ

ఈ సందర్భంగా రాష్ట్ర పీసీసీ కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ, జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి పారిజాత నర్సింహారెడ్డి గారితో రాబోయే జిల్లా స్థాయి పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల సమన్వయం, జిల్లాలో చేపట్టాల్సిన సంస్థాగత కార్యక్రమాలపై చర్చించారు.

అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఆమె బాధ్యతల స్వీకరణకు సంబంధించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణ, కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల భాగస్వామ్యం, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా చర్చించినట్లు తెలిపారు.

జిల్లా అధ్యక్షురాలి బాధ్యతల స్వీకారం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపేలా ఉండాలని, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీమతి పారిజాత నర్సింహారెడ్డి గారి నాయకత్వంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమై, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ, రాబోయే ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ముందుకు సాగాలని పి. ప్రసన్న కుమార్ శర్మ ఆకాంక్షించారు. పార్టీ అధిష్ఠానం ఆశయాలకు అనుగుణంగా, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి మార్గదర్శకత్వంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఐక్యతతో, సమష్టి కృషితో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (యుటిఏసి) సిఎం రేవంత్ రెడ్డి కి విన్నపం
- లేని పక్షంలో సమ్మెకు దిగుతాం -యుటిఏసి రాష్ట్ర అధ్యక్షులు డా.ఎ.పరశురామ్

వెలుతురు హైదరాబాద్ అక్టోబర్ 09: శుక్రవారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో యుటిఎసి రాష్ట్ర అధ్యక్షులు డా.ఎ.పరశురామ్ ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు అధ్యాపకులకు యుజిసి పే స్కేల్స్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ తర్వాతనే మిగిలిన ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 30లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు డా.విజయేందర్ రెడ్డి, డా.శ్రీనివాస్ రెడ్డి, డా.వెంకన్న, డా.రామకృష్ణ, డా.అనితశ్రీ , డా. మోడం రవి, డా. తిరుపతి, డా. కృష్ణయ్య, డా. మోహన్, డా వెంకటేశ్వర్లు తదితరులు పాలుగోన్నారు

కాంగ్రెస్ నోట ఓటు చోరీ మాట అనేది హాస్యాస్పదం

ఓబీసీ మోర్చా జనగాం జిల్లా ఇన్చార్జి పోచం సోమయ్య

మోత్కూర్, అక్టోబర్ 9,వెలుతురు న్యూస్ :
కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షాలు ఎన్నికల్లో ఓటమిపాలై రాజ్యాంగబద్ధంగా ఏర్పడ్డ ఎస్. ఐ. ఆర్ ప్రక్రియను అడ్డం పెట్టుకొని ఎన్నికల వ్యవస్థపై రాజకీయాలు చేయడం హాస్యాస్పదమని ఓబీసీ మోర్చా జనగాం జిల్లా ఇన్చార్జి పోచం సోమయ్య అన్నారు. శుక్రవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ హయాంలో దేశంలో మొట్టమొదటిసారి ప్రధానమంత్రి ఎంపికలో ఓటు చోరీకి పాల్పడి ఆ ఓటుకు చోరీ కార్యక్రమం పేటెంట్ రైట్స్ ను కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుందని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ద్వారా దేశంలో వివిధ రాష్ట్రాల్లో అక్రమ వరుసదారులు, రోహింగ్యాలు, చనిపోయిన వారు, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు, ఓటర్ ఫామ్ లో సరియైన సమాధానాలు ఇవ్వని వారిని మాత్రమే ఓటర్ జాబితా నుండి బూత్ స్థాయిలోఅన్నిపార్టీల నాయకుల అంగీకారంతోనే తీసివేయడం జరుగుతుందని

తెలిపారు. ఎస్. ఐ ఆర్ ప్రక్రియను కాంగ్రెస్ హయాంలో కూడా చాలా సార్లు నిర్వహించారని కొత్తగా బీజేపీ ఏమి నిర్వహిస్తలేదని అన్నారు. అక్రమ వరుసదారులు, రోహింగ్యాలు, బోగస్ ఓటర్లను చేర్చి గతంలో అధికారము పొంది ఇప్పుడు ఆ పార్టీలు దేశవ్యాప్తంగా ప్రాబల్యం తగ్గి ఓడిపోవడంతో తన రాజకీయ పార్టీ ఉనికి కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్ష పార్టీలు రాజ్యాంగబద్ధ గా ఏర్పడ్డ ఎన్నికల ప్రక్రియ ఎస్. ఐ. ఆర్ ను తప్పుపడుతూ దానిని నిర్వహిస్తున్న ఈసీ పై నిందలు వేసి తప్పుడు ప్రచారం చేయడం కాంగ్రెస్ పార్టీ దివాలా కోరు తనానికి నిదర్శనమని అన్నారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలు ఈవీఎం లోను బ్యాలెట్ పేపర్ తో జరిగిన స్థానిక ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీ ఘోరమైన ఓటమి చూసిందని దేశంలో కాంగ్రెస్ పాలనపై కుటుంబ వారసత్వ అవినీతి రాజకీయాలను ప్రజలు కోరుకుంటలేరని, బ్రతకడానికి అభివృద్ధికి కావాల్సిన సిద్ధాంత గల పార్టీలను మాత్రమే ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. భారత దేశం ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి చెందడం ఓర్వలేని దేశంలోని కొన్నిపార్టీలు అసాంఘిక శక్తులతో దేశాన్ని అస్థిరపరచడానికి పన్నుతున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా దేశ అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని లేకపోతే భవిష్యత్తులో ఆ పార్టీలకు ఓటమి తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు చేకూరి మల్లేశం, పట్టణ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి తీగల శ్రీధర్ గౌడ్, నిలిగొండ మచ్చ గిరి ఉన్నారు

పిక్సెల్లెన్స్ 6వ వార్షికోత్సవం

అంకితభావం, సృజనాత్మకతే విజయ రహస్యం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09
ప్రముఖ క్రియేటివ్ అండ్ ప్రొడక్షన్ సంస్థ పిక్సెల్లెన్స్ విజయవంతంగా 6వ వసంతంలోకి అడుగుపెట్టింది. గత ఆరేళ్లుగా సంస్థ కనబరుస్తున్న అంకితభావం, వినూత్న సృజనాత్మకత. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు ఈ మైలురాయిని చేరుకోవడంలో కీలక పాత్ర పోషించాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు గోవింద్, విశాల్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మాట్లాడుతూ.. "గత ఆరేళ్లుగా మా బృందం ప్రదర్శించిన అంకితభావం, సృజనాత్మక ఆలోచనలు, నాణ్యమైన పనితీరుతో సాధించిన ఈ మైలురాయి మాకెంతో గర్వకారణం, స్ఫూర్తిదాయకం. పిక్సెల్లెన్స్ 6వ వార్షికోత్సవం సందర్భంగా మా సంస్థ ప్రతినిధులకు, ఉద్యోగులకు, మాపై నమ్మకం ఉంచిన క్లయింట్లకు హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు. భవిష్యత్తులో మరింత సాంకేతికతను, వైవిధ్యాన్ని జోడించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మేము నిరంతరం కృషి చేస్తాము" అని పేర్కొన్నారు. నాణ్యత, సమయపాలన, వినూత్న కాన్సెప్ట్లతో పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన పిక్సెల్లెన్స్, రాబోయే రోజుల్లో మరిన్ని నూతన సేవలను విస్తరించనున్నట్లు సంస్థ యాజమాన్యం వెల్లడించింది.

స్వచ్ఛతాహి సేవలో చెత్త బుట్టలు, మొక్కల పంపిణీ

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 09:
చౌటుప్పల్ పురపాలక సంఘం కార్యాలయంలో గౌరవ చైర్పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ గారి అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ గారి ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులతో చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు, సంఘాల మొదటి మరియు రెండవ స్థాయి లీడర్లకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, చెత్తను సరైన పద్ధతిలో నిర్వహించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌరవ చైర్పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ గారు మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. ప్రజలందరూ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, చౌటుప్పల్ పట్టణాన్ని స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ గారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించుకోవాలని సూచించారు. పరిశుభ్రతను పాటిస్తూ, మొక్కలను పెంచుకుంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల సభ్యులు, ప్రజల్లో పారిశుధ్యం, చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీ గోశిక వినయ్ కుమార్

శ్రీ కొండనం రాకేష్ రెడ్డి
శ్రీమతి పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య
శ్రీమతి పల్లె లావణ్య సురేందర్ రెడ్డి
శ్రీ ఉడుతల యాదయ్య
శ్రీ కొయ్యడ శేఖర్
శ్రీమతి ఆలా శ్రీలత చిరంజీవి
శ్రీమతి కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి
శ్రీ బొల్లి గాలయ్య
శ్రీమతి దేప రమ్య రాజు
శ్రీ పాక చిరంజీవి
శ్రీమతి భత్తుల వాణి విప్లవ కుమార్
శ్రీమతి ఉడుగు జ్యోతి రమేష్
శ్రీమతి గడ్డం ఇందిరా రాజరత్నం
శ్రీమతి భత్తుల జయమ్మ దాసు
శ్రీమతి చింతల ఉమామహేశ్వరి సాయిలు
శ్రీ బుడ్డ సురేష్
శ్రీ పిల్లలమర్రి మధుసూదన్
శ్రీ హన్ను మహమ్మద్

శ్రీ పస్తం గంగారాములు
శ్రీమతి సందగళ్ల విజయ సతీష్
శ్రీ మహమ్మద్ బాబా షరీఫ్
శ్రీమతి షేక్ నాబీబి జానీ బాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, మొదలైన వారు పాల్గొనడం జరిగింది.

శ్రీ సోమనాథ క్షేత్రంలో అఖండ మృత్యుంజయ యాగం

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 09:
చౌటుప్పల్ లోని శ్రీ సోమనాథ క్షేత్రాన్ని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మి సందర్శించారు. మాస శివరాత్రి సందర్భంగా ఈ క్షేత్రంలో అఖండ మృత్యుంజయ యాగం నిర్వహించిన సందర్భంగా ఆమె మహర్షి విగ్రహానికి హారతి సమర్పించారు. సోమనాథ మహర్షి క్షేత్రం స్థానిక అధ్యక్షుడు బడుగు నరసింహ మాట్లాడుతూ, తపశక్తితో సోమనాథ్ మహర్షి లోక కళ్యాణానికి చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. క్షేత్రంలో ప్రతినెలా నిర్వహించే మహా మృత్యుంజయ యాగం, మనోయోగసాధన ఎంతో శక్తివంతమైనవని తెలిపారు. యాగంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, లక్ష్మి దంపతులు పాల్గొని వారి మనోభీష్టాన్ని నెరవేర్చుకోవాలని కోరారు. పురపాలక చైర్ పర్సన్ మోగుదాల పావని, వైస్ చైర్మన్ గోశిక వినయ్, క్షేత్ర కమిటీ ప్రతినిధులు ప్రభాకర్, సుభాష్ చంద్ర చారి, రామ్ రెడ్డి, నరసింహ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

సాయి చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

మోత్కూర్, అక్టోబర్ 9,వెలుతురు న్యూస్ :
స్థానిక సాయి చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అనేక రకాల పూలను సేకరించి బ్రతకమ్మలను అందంగా తీర్చిదిద్దుకొని పాఠశాలకు తీసుకొచ్చారు. ఆటపాటలతో చిన్నారులు ఎంతో సంతోషంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ బి. రవీందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ కూడా పూలను మొక్కే సంస్కృతి లేదని అది ఒక తెలంగాణలోనే ఉన్నదని, అంత గొప్ప మన సంస్కృతి సంప్రదాయాలను ఎప్పటికీ మరిచి పోవద్దని, బతుకమ్మను పేర్చే పూలలో తంగడి పూలు, సామంచ పూలు, గుమ్మడి పూలు వంటివి చెరువు నీటిని శుద్ధి చేయడానికి ఉపయోగపడే

సైన్స్ కూడా దాగి ఉందని అన్నారు. ఈ పూల జాతరను ముందు తరాల వారికి అందించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామని తెలియజేశారు. ఇందులో పాఠశాల కరస్పాండెంట్ బి కవిత రవీందర్ రెడ్డి గారు విద్యా కమిటీ చైర్మన్ చేతరాసి అంజయ్య, ఉపాధ్యాయులు ఎన్ సైదులు, ఎండి పాషా, వసీమా, లక్ష్మి, వసంత, నికిత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసం చౌకబారు డ్రామాలు

- **ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ నేతలకు పెంబళ్ల జానయ్య**
- **బిజెపి పార్టీ మునుగోడు మండల అధ్యక్షులు గట్టి హెచ్చరిక..,**

మునుగోడు వెలుతురు అక్టోబర్ 09:
కేంద్ర ఎన్నికల సంఘం . ఈసీఐ. నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో బోగస్. డూప్లికేట్ ఓట్లను తొలగించి పారదర్శకత తీసుకురావడానికి చట్టబద్ధంగా చేపట్టిన .ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ. ఎస్ఐఆర్. ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం సిగ్గుచేటు. రాజకీయ లాభం కోసం. దేశ ప్రధాని గౌరవనీయులు నరేంద్ర మోడీ గారిపై. కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడమే ధ్యేయంగా కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఈ పిచ్చి ధర్నాలను చౌకబారు నాటకాలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి మరియు కాంగ్రెస్ నేతలకు మా సూటి ప్రశ్నలు... సమాధానం చెప్పే దమ్ముందా... 1. బాధితులను చూపించే దమ్ముందా. . మునుగోడు మండలంలోని 28 గ్రామపంచాయతీలో గాను 47 బూతులలో అర్హులైన ఏ ఒక్కరి ఓటునైన ఈ ప్రభుత్వం గానీ ఎన్నికల సంఘం గాని అక్రమంగా తొలగించిందా. చేతనైతే దమ్ముంటే ఒక్క అర్హులైన వారి ఓటు పోయిందని కాంగ్రెస్ నాయకులు రోడ్డుమీదకు తీసుకు రాగలరా అలా నిరుపిస్తే మేమే స్వయంగా ముందుండి వారికి ఓటు హక్కు కల్పిస్తాం. .2 మీ ఎల్ఏ లు ఆ సమయంలో ఏం చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతి రాజకీయ పార్టీకి బూతు స్థాయిలో. బిఎల్ఎ. బూత్ లెవెల్ ఏజెంట్. ఉంటారు ప్రతి గ్రామంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరిగినప్పుడు ఈ బి ఎల్ ఏ లు ప్రభుత్వ బిఎల్ఓ. బూత్ లెవెల్ ఆఫీసర్. లతో కలిసి స్వయంగా దగ్గరుండి పరిశీలిస్తారు నిబంధనల ప్రకారం అభ్యంతరాలు ఉంటే తెలియజేయడానికి ఎన్నికల సంఘం సమయం కూడా ఇచ్చింది క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేయడం చేతకాక. ఇప్పుడు ఏ పని పాట లేకుండా రోడ్డు మీదికి వచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించడం మీ చేతకానితనానికి నిదర్శనం కాదా. .3. అధికారులను కోర్టులను ఎందుకు ఆశ్రయించరు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు ఉన్నాయి ఒకవేళ ఎక్కడైనా నిజంగానే పొరపాట్లు జరిగితే బూతు స్థాయి బిఎల్ఓ లను గాని తాసిల్దార్ గారిని. ఆర్డీవో గారిని ఉన్నతికారులను గాని కలిసి నిలదీసే ధైర్యం లేదా నిజంగానే అన్యాయం జరిగితే కోర్టులను ఆశ్రయించే చట్టపరమైన మార్గాలు ఉండగా ఆ పనులేమీ చేయకుండా కేవలం ఢిల్లీలో ఇక్కడ రోడ్లపై ఎందుకు డ్రామాలు ఆడుతున్నారు. .4. ప్రజా ఆటంకాలకు భంగం కలిగిస్తే అరెస్టు చేయరా. ఏ తప్పు జరిగిందో చెప్పకుండా సామాన్య ప్రజలకు వాహనదారులకు అటంకం కలిగిస్తుంటే శాంతి భద్రతలను కాపాడడానికి పోలీసులు అరెస్టులు చేయకుండా హారతులు ఇస్తారా నిషేధాజ్ఞలను ఉల్లంఘించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే అరెస్టులు కాక సత్కారాలు చేస్తారా అక్రమ ఓట్ల రాజకీయం. ఇంకా సాగదు మునుగోడు నియోజకవర్గంలో గాని. దేశంలో ఎక్కడైనా కానీ అర్హత అయిన ఓటర్లు ఓట్లు తొలగించబడవు. ఒకే వ్యక్తికి రెండు మూడు ఓట్లు ఉండడం. మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. అటువంటి డూప్లికేట్ మరియు బోగస్ ఓట్లను చట్ట ప్రకారం తొలగిస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు అంత భయం. ఢిల్లీలో మీ అగ్రనేతలు చట్టాన్ని ఉల్లంఘించి అరెస్ట్ అయితే. తెలంగాణ ముఖ్యమంత్రి అయినటువంటి రేవంత్ రెడ్డి గారు అధిష్టానం మెప్పుకోసం అంగామ చేయడం మీ దివాలా కోరుతనానికి నిదర్శనం. కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్య వ్యవస్థల మీద. చట్టాల మీద గౌరవం ఉంటే ఇటువంటి పిచ్చి ధర్నాలు ఆపి చట్టబద్ధమైన మార్గాల్లో మాట్లాడాలి ఉనికి కోసం చేసే ఇటువంటి పిచ్చి ధర్నాలు ఆపి చట్టబద్ధమైన మార్గాల్లో మాట్లాడాలి ఉనికి కోసం చేసే ఇలాంటి చౌకబారు నాటకాలను దేశ ప్రజలు మరియు తెలంగాణ ప్రజలు .మునుగోడు మండల ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో మీకు తగిన బుద్ధి చెప్తారని మునుగోడు భారతీయ జనతా పార్టీ మండల శాఖ తరపున హెచ్చరిస్తున్నాం.

డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల నుంచే నీరు ఇవ్వాలి!

- **పాలమూరు--రంగారెడ్డి కాలువతో సమాన లెవల్లో డిండి కాలువను నిర్మించాలి!**
- **జిల్లా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలి**
- **డిండి ఎత్తిపోతల పథక సాధన సమితి డిమాండ్**

మునుగోడు,అక్టోబర్ 9 (వెలుతురు)
:మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో కీలకమైన డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల (వీరాంజనేయ) జలాశయం నుంచే నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అంబేద్కర్ సెంటర్ లో రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన కాలువతో పాటు డిండి ఎత్తిపోతల పథకం కాలువను కూడా ఒకే లెవల్లో,436 అడుగుల ఎత్తులో తీసుకెళ్లాలని డిండి ఎత్తిపోతల పథక సాధన సమితి డిమాండ్ చేసింది. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఏదుల వీరాంజనేయ జలాశయం నుంచి 436 అడుగుల ఎత్తులో నీటిని తీసుకునేలా నిర్ణయించిన నేపథ్యంలో, డిండి ఎత్తిపోతల పథకానికి కూడా అదే ఎత్తులో నీటిని అందించేలా నిర్ణయం తీసుకోవాలని సమితి కోరింది. డిండి కాలువకు 440 అడుగుల ఎత్తును ప్రతిపాదించడం వల్ల భవిష్యత్తులో ప్రాజెక్టు నీటి సరఫరాపై సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. దశాబ్దాలుగా సాగునీటి వసతులు లేక, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మునుగోడు, దేవరకొండ ప్రాంతాల ప్రజలకు డిండి ఎత్తిపోతల పథకం ఎంతో కీలకమని సమితి పేర్కొంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు సాగునీరు అందడంతో పాటు, ప్రజలకు, పశువులకు నీటి లభ్యత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న పాలమూరు--రంగారెడ్డి,డిండి ఎత్తిపోతల పథకాల సమీక్ష సమావేశంలో నల్గొండ జిల్లా ప్రజల నీటి అవసరాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిండి ఎత్తిపోతల పథక సాధన సమితి డిమాండ్ చేసింది. లేని పక్షంలో ఉధృతం చేస్తామని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు మారగోని అంజయ్య గౌడ్,మేకల శ్రీనివాస్ రెడ్డి,పోలగోని సైదులు గౌడ్,ఐతగోని విజయ్,నకిరేకంటి మురళీకృష్ణ,గజ్జల బాలరాజు గౌడ్,గురిజా సునీల్,గుర్రాల సురేష్, జిల్లా సుఖేందర్, జిట్టగోని మల్లేష్, ఎంపల్ల పరమేష్, కొమ్ము మల్లేష్,సురిగి రవి,బొడిగె స్వామి, గురజాల శ్రవణ్,దాం నరసింహ,బైరు నరేష్, ఇరిగి యాదయ్య,పులకరం శివ తదితరులు పాల్గొన్నారు

ట్రినిటీ విద్యాలయంలో బతుకమ్మ వేడుకలు

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 09:
ప్రకృతిని పూలను పూజించే తెలంగాణ సంప్రదాయం ఎంతో గొప్పదని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ లోని ట్రినిటీ విద్యాలయాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ మైదానంలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతిని వెలిగించి గౌరీదేవిని పూజించి బతకమ్మ ఉత్సవాలను ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. 31 అడుగుల ఎత్తుతో వందల కిలోల పూలతో తయారుచేసిన భారీ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ పాటలు పాడుతూ ఆమె బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న విద్యార్థులను మహిళలను ఉత్సాహపరిచారు. ట్రినిటీ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జని మంజుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పురపాలిక చైర్ పర్సన్ ముగుదాల పావని, వైస్ చైర్మన్ గోశిక వినయ్, మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, గాంధీ గ్లోబల్ మండల అధ్యక్షురాలు సంధ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మస్తాన్ బాబు వైస్ చైర్మన్ శివారెడ్డి, పురపాలక కౌన్సిలర్లు, ట్రినిటీ చైర్మన్ కేవీపీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, అక్టోబర్ 9 వెలుతురు
తెలంగాణ విశిష్ట సంస్కృతి, ఆచార సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని, అలాంటి గొప్ప సంస్కృతిని భావితరాలకు అందిస్తూ పరిరక్షించడంలో శ్రీవిద్యానికేతన (ఎస్వీఎన్) డిజిటల్ స్కూల్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని రాష్ట్రప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కొనియాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్వీఎన్ డిజిటల్ స్కూల్ ప్రాంగణంలో కరస్పాండెంట్ గొట్టిపర్తి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో.. గురువారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు పాఠశాల ఆవరణలో రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. ప్రపంచమంతా దేవుడికి పూలతో పూజలు చేస్తే, ఒక్క తెలంగాణలో మాత్రమే ప్రకృతి సిద్ధమైన తీరొక్క పూలనే దైవంగా భావించి పూజించే మహోన్నత సంస్కృతి తెలంగాణ సొంతమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం నాడు సాగిన పోరాటాల చరిత్రను, మహిళల కష్టసుఖాలను పాటల రూపంలో పంచుకునే గొప్ప వేదిక బతుకమ్మ అని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడంతో పాటు, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఆర్థికంగా బలోపేతం చేసే పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే అయిలయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గొట్టిపర్తి భాస్కర్ గౌడ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత 31 సంవత్సరాలుగా శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థ తనవంతుగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విశేష కృషి చేస్తోందని తెలిపారు. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేయడమే కాకుండా, నేడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సైతం ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. భావితరాలైన చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసి, గ్రామీణ జానపద కళలు, పాటల హోరు, సాంస్కృతిక విలువలపై స్పష్టమైన అవగాహన కల్పించడమే తమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పురపాలక చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చీర శ్రీశైలం, ఆలేరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్ రాజ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగు బాలరాజు గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బూడిద మధు, బిట్టు సరోజ హరీష్, కాంగ్రెస్ టౌన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ సలాం, ఆలేరు మాజీ ఎంపీపీ అశోక్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందినది మునుగోటి ధనుజయ న్యూరో సమస్య అనారోగ్యం తో నిమ్స్ ఆసుపత్రి లో చేరగా చికిత్స నిమిత్తం అనంత చంద్రశేఖర్ గౌడ్ సహకారం తో మునుగోడు శాసన సభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశ్రయించగా 3,00,000 రూపాయిలు లక్షలు గాజ అందించడం జరిగింది

మునుగోడు వెలుతురు అక్టోబర్ 09:

దుర్గాభవాని అమ్మవారికి ఘన స్వాగతం

దప్పు చప్పుళ్లు.. మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:
దసరా నవరాత్రి ఉత్సవాల సందడి ప్రారంభమైంది. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దీపూర్‌లోని భవాని దేవస్థానం వద్ద దుర్గాభవాని అమ్మవారి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భవాని సేన ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు ప్రతిష్ఠించనున్న అమ్మవారి విగ్రహానికి గ్రామస్తులు, మహిళలు భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం పలికారు. దప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకురాగా, మహిళలు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి నీరాజనాలు సమర్పించారు.

తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు
అక్టోబర్ 11 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాల కోసం నిర్వాహకులు ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తొమ్మిది రోజులపాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కోలాటం, భజనలు, సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

విజయదశమికి ప్రత్యేక కార్యక్రమాలు
ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా విజయదశమి సందర్భంగా రావణాసుర దహనం, జమ్మి పూజ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు ఆకాంక్షిస్తున్నారు.

బహుజన చైతన్యానికి బాటలు వేసిన కాన్షీరామ్

- జహీరాబాద్‌లో భీమ్ ఆర్మీ పట్టణ అధ్యక్షుడు ఎండీ అలీమ్ ఆధ్వర్యంలో ఘనంగా కాన్షీరామ్ వర్ధంతి...
- పాల్గొన్న భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధు రావణ్...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:
బహుజనుల రాజకీయ చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడు కాన్షీరామ్ అని తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) అధ్యక్షుడు సిద్ధు రావణ్ అన్నారు. బహుజన సమాజంలో ఆత్మగౌరవం, సమానత్వం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాన్షీరామ్ 20వ వర్ధంతిని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో భీమ్ ఆర్మీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అలీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్ధు రావణ్ మాటాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, అణగారిన వర్గాల్లో రాజకీయ చైతన్యం నింపేందుకు కాన్షీరామ్ విశేషంగా కృషి చేశారని తెలిపారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ, బహుజనులకు సమాన అవకాశాలు కల్పించాలని ఉద్యమించారని పేర్కొన్నారు. అధికారం ద్వారానే సామాజిక మార్పు సాధ్యమనే సందేశాన్ని బహుజనుల్లోకి తీసుకెళ్లిన దార్శనికుడని కొనియాడారు.

కాన్షీరామ్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు నేటికీ స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. బహుజన ఐక్యతను బలోపేతం చేయడం, సామాజిక న్యాయం సాధించడం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ద్వారా ఆయనకు నిజమైన నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుభాష్, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ధనరాజ్, బాబ్రాజ్, విజయ్‌కుమార్, అనంతరం, రాకేష్ మామయ్య, నరసింహులు ముదిరాజ్, ప్రేమ్‌కుమార్, పండరి, రాచన్న, చంద్రయ్య, బలరాం, గోపాల్, గౌతమ్ కృష్ణ, జైపాల్, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న మల్లేష్ గంగ్వార్

- ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా జహీరాబాద్‌లో బీజేవైఎం రక్తదాన శిబిరం...



జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:
రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ పిలుపునిచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్‌లో భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ గంగ్వార్ మాట్లాడుతూ.. రక్తదానం ఒక సామాజిక బాధ్యత అని, మనం ఇచ్చే రక్తం అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించవచ్చని తెలిపారు.

రక్తదాతకు ధ్రువీకరణ పత్రం అందజేత
రక్తదానం చేసిన మల్లేష్ గంగ్వార్‌కు బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నౌబాద్ జగన్, రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు గొల్ల భాస్కర్ తదితరులు రక్తదాన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రెండో పట్టణ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, జహీరాబాద్ మండల అధ్యక్షుడు దుర్గయ్య, సీనియర్ నాయకులు సుధీర్ బండారి, శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు నరేన్ దేశ్‌పాండే, నాయకులు సోమ అనిల్, నరేష్ పాటిల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు. రక్తదానం మహాదానం.. ప్రాణదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి అనే సందేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో మల్లేష్ గంగ్వార్ రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

అనేగుంట పాఠశాలలో ఘనంగా వేడుకలు...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను జహీరాబాద్ మండలం అనేగుంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం పండుగ ఉత్సాహంతో వేడుకల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటారు. విద్యార్థుల్లో పండుగల పట్ల అవగాహన పెంపొందించడంతోపాటు, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఎస్‌టియుటిఎస్ 80 వసంతాల కార్యక్రమంలో జెడ్పిహెచ్‌ఎస్ జిహెచ్‌ఎం కొండవీటి ఆరోగ్యం సత్కారం

పాపనన్న పేటవెలుతురు అక్టోబర్ 9:
ఎస్ టి యు టి ఎస్80 వసంతాలలి కార్యక్రమం లో భాగంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు . కొండవీటి ఆరోగ్యం మరియు భుజాత ఎస్ టి యు టి ఎస్ మెదక్ జిల్లా మరియు పాపన్నపేట మండల శాఖలి పక్షాన చిరు జ్ఞాపిక ను అదించడం జరిగింది ఈ కార్యక్రమం లో మండలం అధ్యక్షులు బి. ఎల్లం, ప్రధాన కార్యదర్శి సి. హెచ్. బాల మల్లేష్, ఆర్థిక కార్యదర్శి ఎన్. రాజు, జిల్లా నాయకులు కె. వేణుగోపాల్, శర్వన్ లు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

- మోడీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా నెలరోజులపాటు సేవా కార్యక్రమాలు
- తెలంగాణ రాష్ట్ర బిజెపి ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్

వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 09 :
సంగారెడ్డి :- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు సాగుతుందని తెలంగాణ రాష్ట్ర బిజెపి ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. శుక్రవారం ప్రధాని మోడీ పుట్టినరోజు.. ప్రజా జీవితంలో నిర్వహి సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవ సంకల్పం అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విట్టల్ ఆధ్వర్యంలో అవయవ దాన ప్రమాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాలు ప్రజా జీవితంలో పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా

సంకల్ప అభియాన్ పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఓబీసీ ఆధ్వర్యంలో అవయవ దాన ప్రమాణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీని పట్టణాలలో గ్రామాలలో పటిష్టం చేసేందుకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం మోడీ నాయకత్వంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం

అందిస్తున్న పథకాలను గ్రామీణ స్థాయిలో ప్రతి ఇంటి వరకు బిజెపి కార్యకర్తలు నాయకులు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి. సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షులు కోణం విట్టల్. ఓబీసీ జిల్లా ఇన్చార్జి రమన్ సింగ్. మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి మాణిక్ రావు. జోనల్ ఇంచార్జ్ నరసింహ. శ్రీనివాస్ మల్లేశం. సగణాకర్ పండరి బిజెపి జిల్లా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

మోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

బీజేవైఎం నాయకులు నరేష్ పాటిల్, సోమ అనిల్, అనిరుద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్‌లో బీజేవైఎం నాయకులు నరేష్ పాటిల్, సోమ అనిల్, అనిరుద్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రజాసేవ, సామాజిక బాధ్యతే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నౌబాద్ జగన్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.

ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాసేవకు ప్రాధాన్యమిస్తూ దేశాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధాని స్ఫూర్తితో యువత సామాజిక సేవలో భాగస్వాములు కావాలని సూచించారు.

రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాల అందజేత
శిబిరంలో రక్తదానం చేసిన దాతలకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నౌబాద్ జగన్, రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నరేన్ దేశ్‌పాండే తదితర నాయకులు ధ్రువీకరణ పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, జహీరాబాద్ మండల అధ్యక్షుడు దుర్గయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గొల్ల భాస్కర్, శ్రీనివాస్ గౌడ్, సుధీర్ బండారి, బీజేవైఎం నాయకులు సోమ అనిల్, నరేష్ పాటిల్, హరీష్, కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రవణ్, మండల నాయకులు మల్లేష్, దుర్గన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని వెలికితీయాలి

- 100 శాతం హాజరుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- ఎంపీపీ ఎస్ హెచ్ఎం పి. జగదీశ్వరయ్య...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:
విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాల ఆధారంగా పరీక్షలు నిర్వహించి, వారిలోని విషయ పరిజ్ఞానం, అభ్యసన సామర్థ్యాలను వెలికితీయాలని రంజోల్ ఎంపీపీ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. జగదీశ్వరయ్య అన్నారు. శుక్రవారం రంజోల్‌లోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో ఎఫ్ఏ-1 పరీక్షల అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టికను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. 100 శాతం హాజరు సాధించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. 2025--26 విద్యా సంవత్సరంలో 31 మంది

విద్యార్థులు ఐదో తరగతి పూర్తి చేసుకుని పైచదువుల కోసం ఉన్నత పాఠశాలలకు వెళ్లారని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలలో కొత్తగా 42 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా, మొత్తం విద్యార్థుల సంఖ్య 152కు చేరిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని ప్రవేశాలు వచ్చేలా పాఠశాలలో అవసరమైన సౌకర్యాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు శకుంతల, స్వప్నజ్యోతి (బాబానగర్), మంజుల, అఖిల్ అహ్మద్, సయ్యద్ హాఫిజ్, షహిస్తా రూహి, సబిహా బేగం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల తీరుపై కరీంనగర్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తీవ్ర ఆగ్రహం!

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 09:
పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు సర్వస్వం గులాబీమయం చేసుకున్న బీఆర్ఎస్ నేతలకు... ఇప్పుడు కాషాయ రంగును చూస్తే ఎందుకు కడుపుమంట వస్తోందని కరీంనగర్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకుల ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపుతూ ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ భవనాలు, పథకాలు, రోడ్లు, చివరికి ప్రతి ప్రభుత్వ చిహ్నాన్ని గులాబీ రంగుతో నింపేసినప్పుడు లేని తప్పు... ఇప్పుడు కాషాయ రంగు కనిపిస్తేనే ఎందుకు వస్తోందని నిలదీశారు. ప్రజలు ఎవరి నమ్మకాల ప్రకారం వారు రంగులను వాడుకుంటే,

దానికి కూడా రాజకీయ రంగు పులిమి బీఆర్ఎస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల అహంకార పాలనలో రంగుల రాజకీయాలు చేసిన ఆ పార్టీ నేతలకు, ఇప్పుడు ప్రజల్లో వస్తున్న మార్పును, ఆధ్యాత్మిక భావాలను చూసి ఓర్వలేకనే ఇటువంటి విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. "పదేళ్లు రాష్ట్రాన్ని గులాబీ మయం చేసినప్పుడు లేని అభ్యంతరం, ఇప్పుడు కిసాన్ నగర్ లోని జమ్మి గద్దె వద్ద కాషాయ రంగు కనిపిస్తేనే బీఆర్ఎస్ నాయకులకు, ఇక్కడి నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ కు ఎందుకు వణుకు పుడుతుందని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నేతల కడుపుమంటకు కారణం కాలం చెల్లిన వారి రాజకీయ భయమే అని ఇకనైనా సంకుచిత రాజకీయాలు మానుకుని, ప్రజల మనసులను గెలుచుకునే మార్గం చూసుకోవాలని ఆయన బీఆర్ఎస్ నాయతత్వానికి హితవు పలికారు.

అలుగునూర్ 2 అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 09:
తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ పరిధిలోని అలుగునూర్ 2 అంగన్వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులు, ఉపాధ్యాయులు, స్థానిక మహిళలు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను కేంద్రం మధ్యలో ఏర్పాటు చేశారు. మహిళలుచిన్నారులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ సాంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. పండుగ వాతావరణం అంగన్వాడీ కేంద్రంలో నెలకొంది. చిన్ననాటి నుంచే పిల్లలకు మన రాష్ట్ర సాంస్కృతిక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించేలా ఈ వేడుకలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లత ఆయాలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు

ఆర్కండ్ల ఉపసర్పంచ్ తిరుపతి కుటుంబానికి పరామర్శ

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 09:
ఇటీవల కరీంనగర్ జిల్లా, శంకరపట్నం మండలం, అర్కండ్ల గ్రామ ఉపసర్పంచ్ చిలువేరు తిరుపతి గారి తండ్రి చిలువేరు చంద్రయ్య గారు మరణించారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఆకుబత్తిని విజయ్ కుమార్, శంకరపట్నం మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సింగిరెడ్డి సుభాష్ రెడ్డి అర్కండ్ల గ్రామానికి వెళ్లి ఉపసర్పంచ్ తిరుపతి గారిని పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రయ్య గారి మృతికి సంతాపం తెలియజేస్తూ, తిరుపతి గారికి మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్కండ్ల గ్రామ సర్పంచ్ నెదురు పవన్ పాల్గొన్నారు. దివంగత చిలువేరు చంద్రయ్య గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఓం శాంతి!

టిఆర్ఎస్ నేత సోహన్ సింగ్ మున్సిపల్ కార్పొరేషన్‌పై విమర్శలు సరికాదు

బీజేపీ మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 09:
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై బీఆర్ఎస్ నేత సోహాన్‌సింగ్ చేసిన విమర్శలు, వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ తెలిపారు. బతుకమ్మ, విజయదశమి ఏర్పాట్లు, తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, వీధి దీపాల సమస్యలపై సోహన్ సింగ్ మున్సిపల్ యంత్రాంగాన్ని విమర్శించడం సరికాదన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగిరిన తర్వాత , కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ సహాయ సహకారాలతో , మేయర్ కోలగాని శ్రీనివాస్ సారథ్యంలో నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం గా కొనసాగుతున్నాయని తెలిపారు. నగర ప్రజలకు, ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు అభివృద్ధి పనులు జరుగుతున్న, రాజకీయ ఉనికి కోసం సోహన్ సింగ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా రాబోయే పండుగ ఏర్పాట్లలో మున్సిపల్ కార్పొరేషన్ విఫలమైందన్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు., బతుకమ్మ ,దసరా పండుగల కోసం మున్సిపల్ దాదాపు మూడు కోట్లు వెచ్చించి, నగరానికి పండుగ శోభ తెచ్చే పనులు కొనసాగుతున్నాయని, ఆ విధంగా మున్సిపల్ యంత్రాంగం కూడా పకడ్బందీ చర్యలు తీసుకుందన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూడడం సరికాదని , సోహన్ సింగ్ ఇకనైనా తన పద్ధతి మార్చుకొని, విమర్శలకు బదులు గా నగరాభివృద్ధికి తగిన సూచనలు, సలహాలు ఇస్తే స్వీకరిస్తామని ముజీబ్ తెలిపారు.

స్పీకర్ బృందం యూరప్ స్టడీ టూర్ విజయవంతం

- నేతలు, అభిమానుల ఘన స్వాగతం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9:
తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ యూరప్ పర్యటన విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్ కు చేరుకున్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన స్టడీ టూర్ ను విజయవంతంగా ముగించుకుని శుక్రవారం ఉదయం 9 గంటలకు శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న స్పీకర్ ప్రసాద్ కుమార్ కి వికారాబాద్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఘన స్వాగతం పలికారు. యూరప్ పర్యటనలో భాగంగా జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ దేశాల్లో పలు అధ్యయన కార్యక్రమాల్లో స్పీకర్ బృందం పాల్గొంది. స్టడీ టూర్ లో భాగంగా ఆయా దేశాల పార్లమెంటరీ వ్యవస్థలు, శాసనసభల పనితీరు, ప్రజాస్వామ్య ప్రక్రియలు, చట్టాల రూపకల్పన విధానాలు, శాసనసభల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం,
చట్టాల రూపకల్పన విధానాలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు వంటి అనేక కీలక అంశాలపై స్పీకర్ బృందం అధ్యయనం చేసింది. తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి స్పీకర్ బృందం

యూరప్ పర్యటనలో విదేశీ ప్రతినిధులకు, పెట్టుబడిదారులకు వివరించింది. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి, తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అందిస్తున్న సహాయ, సహకారాలు, భద్రత, పారదర్శక విధానాల గురించి వివరించి, వారిలో భరోసా కల్పించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా చేపట్టిన యూరప్ పర్యటన విజయవంతమైందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. స్పీకర్ తో పాటు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు కూడా విదేశీ పర్యటన పూర్తి చేసుకుని, హైదరాబాద్ కు చేరుకున్నారు. వీరందరికీ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా స్పీకర్ ప్రసాద్ కుమార్ చేపట్టే కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని నాయకులు, అభిమానులు ఆకాంక్షించారు.

బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించండి

- దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు అవసరమైన అన్ని రకాల మందులు అందించాలి
- సీజనల్గా వచ్చే వ్యాధులు వ్యాపించకుండా నియంత్రించాలి
- బస్తీ దవఖానాలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నవి
- డా. పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి హైదరాబాద్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:
శుక్రవారం రోజున నాంపల్లి క్లస్టర్ పరిధిలోని ఖైరతాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రశీ పరిధిలోని పూల్బాగ్ బస్తీ దవాఖాన ను సందర్శించారు ఈ సందర్భంగా DM&HO హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, వివిధ రికార్డులు మరియు పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. బస్తీ దవాఖాన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి నాణ్యమైన ఆరోగ్య సేవలు ప్రజలకు అందించాలి అనీ సూచించారు. అన్ని రకాల మందులను బస్తీ దవాఖానలో నిల్వ ఉంచుకోవాలని కోరారు. అనంతరం గర్భిణీల స్త్రీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులు నియంత్రణ, మలేరియా, డెంగీ, చికున్‌గునియా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించి, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారూ. వైద్యాధికారీ,మరియు సిబ్బంది హాజరైనారు.

బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లపై సమీక్ష

- తార్నాక డివిజన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగ ఏర్పాట్లు చేపట్టాలి
- మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా తార్నాక డివిజన్‌లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తార్నాక డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ పండుగ నిర్వహణ కోసం అవసరమైన బతుకమ్మ పాండ్లు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే పండుగల సందర్భంగా వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, రహదారుల పరిశుభ్రత, చెత్త తొలగింపు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పండుగల సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె సూచించారు. ప్రజల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పండుగ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, బతుకమ్మ, దసరా పండుగలు తార్నాక డివిజన్‌లో ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య జరిగేలా చర్యలు తీసుకోవాలని మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మానవత్వానికి ప్రతిరూపం ముజీబ్

రోగులకు, వారి సహాయకులకు నిరంతరాయ సేవలు

హైదరాబాద్, వెలుతురు : అక్టోబర్ 09
తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టి.ఎన్.జి.ఓ.ఎస్) సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ట్రెజరర్ అసద్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి వెంట ఉన్న సహాయకులకు డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్, తన స్వహస్తాలతో భోజనాన్ని పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులైన స్వర్గీయ ఆసదుద్దీన్, అన్వరున్నీసా స్మారకార్థం ఏర్పాటు చేసిన అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ ప్రతి వారం ఆసుపత్రిలోని రోగులకు భోజన సౌకర్యం కల్పిస్తూ మానవతా సేవలను అందిస్తున్నారు. చికిత్స నిమిత్తం దూర ప్రాంతాల నుంచి వచ్చి, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రోగులకు, వారి సహాయకులకు ఈ అన్నదాన కార్యక్రమం ఎంతో ఆసరాగా నిలుస్తోంది. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ మాట్లాడుతూ, "నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు

కడుపునిండా భోజనం పెట్టడం కంటే గొప్ప తృప్తి మరొకటి లేదు. సమాజం నుంచి మనం పొందిన దానిలో కొంతైనా తిరిగి సమాజానికి అందించాలనే సంకల్పంతోనే ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు మన వంతు సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. యూనియన్ నాయకులు, సభ్యులు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఎంతో సంతోషాన్ని, మరింత సేవ చేయాలనే ఉత్సాహాన్ని కలిగిస్తోంది" అని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఇతర సౌకర్యాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన సహాయ సహకారాలను యూనియన్ తరఫున అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓ.ఎస్. యూనియన్ సెంట్రల్ అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేష్, టి.ఎన్.జి.ఓ.ఎస్. యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్‌కుమార్, పబ్లిక్ సెక్రటరీ వైదిక శాస్త్ర, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ముకీద్ ఖురేషీ, హైదరాబాద్ జిల్లా ఏ.పి.ఆర్.ఓ. మహ్మద్ వహీద్ పాల్గొన్నారు. అదేవిధంగా, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రి యూనిట్ కార్యదర్శి చంద్రశేఖర్, సత్యనారాయణ రెడ్డి, షామ్, యోగి, నవీన్, మహ్మద్ ముస్తఫా, మహ్మద్ హబీబ్ చావుష్‌తో పాటు ఇతర యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రోగులకు ఆహారం అందించడమే కాకుండా, వారి కష్టసమయంలో అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుతున్న డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ సేవలను పలువురు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని నాయకులు ఆకాంక్షించారు.

రాజ్యాంగాన్ని సవరించైనా సరే బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలి

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్

న్యూఢిల్లీ వెలుతురు అక్టోబర్ 09:
రాజ్యాంగాన్ని సవరించైనా బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ,దేశ జనాభాలో సగానికి పైన జనాభా కలిగిన బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు రాజ్యాంగ స్ఫూర్తిలో అంతర్భాగమని పేర్కొన్నారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే విద్య, ఉద్యోగ రాజకీయ ప్రాతినిధ్యంలో తగిన అవకాశాలు కల్పించాలన్నారు. ప్రస్తుత రిజర్వేషన్ పరిమితుల కారణంగా బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా అవకాశాలు కల్పించడంలో అడ్డంకులు ఎదురవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు సామాజిక న్యాయం కల్పించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, బీసీల హక్కులు సాధించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని జాజుల లింగం గౌడ్ స్పష్టం చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి, సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు భాస్కర్ నరసింహ చారి బండి గారి రాజు నరసింహ నాయక్ బ్రహ్మ చారి తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయ ఆవిష్కరణలకు జాతీయ గుర్తింపు

- శ్రీ యువ బయోటెక్‌కు ఉత్తమ హరిత సాంకేతికత అవార్డు
- శ్రీ జీపీ అవెన్స్ లైఫ్ సైన్సెస్‌కు ఉత్తమ వ్యవసాయ ఆవిష్కరణ అవార్డు
- ఉస్మానియా పూర్వ విద్యార్థుల పరిశోధనలకు గుర్తింపు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 8
పర్యావరణహిత సాంకేతికత, వ్యవసాయ ఆవిష్కరణల రంగాల్లో కృషి చేస్తున్న శ్రీ యువ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ జీపీ అవెన్స్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు జాతీయ వ్యాపార అత్యుత్తమ పురస్కారాలు లభించాయి. శ్రీ యువ బయోటెక్‌కు 'ఉత్తమ హరిత సాంకేతికత పురస్కారం', శ్రీ జీపీ అవెన్స్ లైఫ్ సైన్సెస్‌కు 'ఉత్తమ వ్యవసాయ ఆవిష్కరణ పురస్కారం' దక్కాయి. భారత సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వాణిజ్య, పారిశ్రామిక మండలి ఆధ్వర్యంలో అక్టోబర్ 7, 2026న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన మూడవ జాతీయ వ్యాపార అత్యుత్తమ పురస్కారాలు--2026, నాయకత్వ సదస్సు--2026 కార్యక్రమంలో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. శ్రీ యువ బయోటెక్ వ్యవస్థాపకుడు, నిర్వహణ సంచాలకుడు డాక్టర్ నరేంద్ర కుమార్ పాపతోటి, రెండు సంస్థల ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె. బాల హనుమత్ శ్రీరామ్ కలిసి అవార్డులను స్వీకరించారు. భారత సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వాణిజ్య, పారిశ్రామిక మండలి చైర్మన్ ఇంద్రజిత్ ఘోష్,

ప్రత్యేక అతిథి, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాజీ పార్లమెంట్ సభ్యుడు, భాజపా నాయకుడు ప్రదీప్ గాంధీ, కాడిలా ఫార్మా మాజీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్లిమెడ్ పరిశోధన పరిష్కారాల సంస్థ గౌరవ సంచాలకుడు, అంతర్జాతీయ ఔషధ వ్యాపార నాయకుడు డాక్టర్ పి.కె. రాజ్‌పుత్, పర్యావరణ విద్యా కేంద్రంలో వలయాకార ఆర్థిక వ్యవస్థ విభాగం సీనియర్ కార్యక్రమ సంచాలకుడు ప్రభ్‌జోత్ సోధి చేతుల మీదుగా సంస్థల ప్రతినిధులు ఈ పురస్కారాలను అందుకున్నారు.

పరిశోధనలతో రైతులకు ఉపయోగపడే ఉత్పత్తులు

ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి డాక్టర్ నరేంద్ర కుమార్ పాపతోటి, డాక్టర్ హమీదా బీ పర్యవేక్షణలో సూక్ష్మజీవ శాస్త్రంలో పరిశోధనాత్మక డాక్టరేట్ పూర్తి చేశారు. అనంతరం థాయ్‌లాండ్‌లోని సురనారీ విశ్వవిద్యాలయంలో ఉన్నత పరిశోధనలు పూర్తి చేశారు. తన పరిశోధనా అనుభవాన్ని పర్యావరణహిత సాంకేతికతలు, రైతులకు ఉపయోగపడే వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధికి వినియోగిస్తున్నారు.
ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి, వృక్షశాస్త్రంలో పరిశోధనాత్మక డాక్టరేట్ చేసిన డాక్టర్ గాజుల ప్రభాకర్‌తో కలిసి డాక్టర్ నరేంద్ర కుమార్ పాపతోటి మరో నూతన సంస్థగా శ్రీ జీపీ అవెన్స్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించారు. ఈ సంస్థకు డాక్టర్ గాజుల ప్రభాకర్ వ్యవస్థాపకుడు, నిర్వహణ సంచాలకుడిగా, డాక్టర్ నరేంద్ర కుమార్ పాపతోటి సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నారు.
మిరప పంటలో తీవ్ర నష్టాన్ని కలిగించే నల్ల తామర పురుగు నియంత్రణకు శ్రీ జీపీ అవెన్స్ లైఫ్ సైన్సెస్ సంస్థ వినూత్న సేంద్రీయ పురుగుమందును అభివృద్ధి చేసి, 'థ్రిప్ క్లియర్' పేరుతో విడుదల చేసింది. ఈ ఆవిష్కరణకు భారత ప్రభుత్వ జీవసాంకేతిక విభాగం నుంచి రూ. 50 లక్షలు, తెలంగాణ ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం లభించింది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ ఆవిష్కరణల కేంద్రం ఆమోదం కూడా లభించింది. ఈ పరిశోధనల కొనసాగింపుగా, నల్ల తామర పురుగు నియంత్రణ లక్ష్యంగా అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన 'థ్రిప్ క్లియర్ అల్ట్రా'ను విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీనితోపాటు రెండు సంస్థల ద్వారా పర్యావరణహిత కలుపు నివారణ ఉత్పత్తి, ఇతర పంట హానికర పురుగుల నియంత్రణకు ఉపయోగపడే పలు నూతన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నారు.

పర్యావరణహిత వ్యవసాయ పరిష్కారాలే లక్ష్యం

డాక్టర్ నరేంద్ర కుమార్ పాపతోటి, డాక్టర్ గాజుల ప్రభాకర్, కె. బాల హనుమత్ శ్రీరామ్, డాక్టర్ వినీలా సాయి మేగావత్, బి. శ్వేత, కృష్ణ, నవదీప్, దేవికలతో కూడిన బృందం ఈ రెండు సంస్థల ద్వారా పర్యావరణహిత, వినూత్న వ్యవసాయ పరిష్కారాల అభివృద్ధికి కృషి చేస్తోంది. పంటల్లో హానికర పురుగులు, కలుపు మొక్కల నియంత్రణకు ఉపయోగపడే ఉత్పత్తులను రూపొందించడం, రసాయన పురుగుమందులపై ఆధారపడటాన్ని తగ్గించడం, రైతులకు నూతన సాంకేతిక పరిష్కారాలను అందించడం బృందం ప్రధాన లక్ష్యాలు. ఈ జాతీయ పురస్కారాలు రెండు సంస్థల పరిశోధన, ఆవిష్కరణల కృషికి గుర్తింపుగా నిలిచాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు తమ పరిశోధనలను రైతులకు ఉపయోగపడే ఉత్పత్తులుగా తీర్చిదిద్దుతూ సాధించిన ఈ విజయం తెలంగాణ పరిశోధన, పారిశ్రామిక సామర్థ్యాన్ని జాతీయ వేదికపై చాటింది.

విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బిబి రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనర్సింహ్మా రెడ్డి

మోత్కూరు, అక్టోబర్ 9, వెలుతురు న్యూస్ :
దాతలు ఇచ్చే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహ్మా రెడ్డి కోరారు. శుక్రవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మోత్కూరు ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు స్టడీ కుర్చీలను రెడ్ క్రాస్ సొసైటీ పక్షాన 10 కుర్చీలను, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 54 కుర్చీలను పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పోచం నారాయణ ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ. .తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి మౌళిక వసతులు కల్పనకు పూర్వ విద్యార్థులు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పటికప్పుడు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు పోచం నారాయణ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకొని దేశ, విదేశాలల్లో ఉన్నత స్థాయిలో ఎదిగామని ఈ పాఠశాల ఋణం తీర్చుకోవడానికి ఏ చిన్న అవకాశం వచ్చినా పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవింద నాయుడు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు స్టడీ కుర్చీలను అందజేసిన పూర్వ విద్యార్థులకు,రెడ్ క్రాస్ సొసైటీ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాజీ సర్పంచి బయ్యని పిచ్చయ్య, పూర్వ ప్రధానోపాధ్యాయులు ఎం.సోమయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు బయ్యని వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు అంజయ్య, రాంప్రసాద్,కే శ్రీనివాస్, సుధీర్ కుమార్,లలిత కుమారి, తొర్ర ఉప్పలయ్య, మంజుల, రామకృష్ణ,రవి,కవిత, వెంకటాచారి, లింగయ్య, ఆర్ వెంకటాచారి, మర్రి జయశ్రీ, విమలమ్మ ,వెంకటరమణ శశికుమార్, వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తమను బెదిరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

యాదగిరిగుట్ట , అక్టోబర్ 9 వెలుతురు
అమాయకులైన రైతుల భూమిపై తప్పుడు పత్రాలు సృష్టించి అమ్ముకునేందుకు ప్రయత్నించడంతోపాటు ఆ రైతులను తమను బెదిరిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పెద్ద కందుకూరు మాజీ సర్పంచ్ భీమ గాని రాములు గౌడ్, బాదిత రైతులు కాలే స్వామి కాలే వెంకటేష్‌లు కోరారు. యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు పెద్ద కందుకూరు గ్రామ మాజీ సర్పంచ్ భీమ గాని రాములు గౌడ్ ఆ గ్రామానికి చెందిన బాధిత రైతులు కాలే స్వామి వెంకటేశులు శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట మీడియా సమావేశంలో తమ సమస్యపై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ఒక నాయకుడు కొంతమందితో కలిసి తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ తమ ఇళ్లపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రామాజీపేట రెవెన్యూ పరిధిలో తమకు వారసత్వంగా వచ్చిన భూమిపై ఆ నాయకుడు మరికొందరితో కలిసి గతంలో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని తెలిపారు . ఆ డాక్యుమెంట్లతో యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రయత్నించారని అన్నారు. కానీ చివరి సమయంలో సబ్ రిజిస్టర్ అవి తప్పుడు పత్రాలు అని గుర్తించి స్థానిక తహసిల్దార్ కు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయిందని అన్నారు. ఈ విషయంపై తాము అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు తమకు న్యాయం చేయాలని

కోరామని అన్నారు. వివాదంలో అప్పట్లో వారిపై పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదయిందని తెలిపారు. ఈ విషయమై కోర్టుకు వెళ్ళగా ఇటీవల తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని అన్నారు. న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. తమ భూమికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రయత్నించిన పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ఆ నాయకుడు మరికొందరి పైన గతంలోనూ అనేక వివాదాలు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. వారు తరచుగా తమ భూమిపైకి రావడంతో పాటు తమ ఇళ్ళమీదికి కూడా వచ్చి బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు . ఈ విషయమై తాము సంబంధిత అధికారులకు , పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వారిని గతంలో ఒకసారి స్థానిక పోలీసు అధికారులు తీవ్రంగా మందలించి తహసిల్దార్ ముందు బైండోవర్ చేసినప్పటికీ వారి వైఖరిలో మార్పు రాలేదని అన్నారు. న్యాయంగా తమదైన భూమిని అమ్ముకోవాలని రైతులు ప్రయత్నిస్తుండగా ఆ నాయకుడు భూమి కొనుగోలు చేయాలని అనుకునే వారిని సైతం బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ భూమి కోర్టు కేసులో ఉందని మీరు ఈ భూమిని కొనుగోలు చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కొనుగోలు చేసే వారిని కూడా బెదిరిస్తున్నారని ఆరోపించారు. కోర్టు కూడా ఆ నాయకుడు సృష్టించిన తప్పుడు డాక్యుమెంట్లపై తీవ్రంగా మందలించిందని న్యాయంగా అన్ని ఆధారాలు ఉన్న తమ వైపే కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని వారు వివరించారు . ఇప్పటికైనా అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయబద్ధంగా ఉన్న తమకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని వారు కోరారు. తమ ఇంటి పైనే ఐదారుసార్లు ఆ వ్యక్తి దాడులకు పాల్పడ్డారని పెద్ద కందుకూరు మాజీ సర్పంచ్ భీమ గాని రాములు గౌడ్ తెలిపారు . తనతోపాటు బాధిత రైతుల ఇళ్లపై కూడా వారు దాడులకు పాల్పడుతూ తీవ్రంగా బెదిరిస్తున్నారని అన్నారు. దీనిపై అధికారులు స్పందించి తమను బెదిరిస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట నమిలే నాగేష్ ,కాల్నే పెద్ద స్వామి. కాల్నే చిన్న స్వామి గంగాపురం లక్ష్మీ నారాయణ కాల్నే సతీష్, వెంకటేష్ , రాములు తదితరులు ఉన్నారు.

14న ఉప్పల్ స్టేడియంలో భారత్-వెస్టిండీస్ మధ్య నాలుగో టీ20 మ్యాచ్

హెచ్‌సీఏ సెక్రెటరీ జీవన్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు అక్టోబరు 9: మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా మ్యాచ్ టికెట్లు భారత సైనిక సిబ్బంది కోసం 250 ఉచిత టికెట్లు కేటాయింపు అంతరాజతీయ ప్రమాణాలకు అనుగుణంగా స్టేడియంలో సదుపాయాల అభివృద్ధిడ్రెస్సింగ్ రూమ్‌లు, సీటింగ్, వ్యూయింగ్ గ్యాలరీల ఆధునికీ కరణ వైద్య అత్యవసర సేవల కోసం అపోలో హాస్పిటల్స్‌తో హెచ్‌సీఏ భాగస్వామ్యం అత్యవసర పరిస్థితుల్లో స్ట్రెచర్ల తరలింపునకు ప్రత్యేక ర్యాంప్ నిర్మాణం గ్రీన్ క్రికెట్‌లో భాగంగా యూఎన్‌ఈపీతో హెచ్‌సీఏ భాగస్వామ్యం. ప్లాస్టిక్ వ్యర్థాల వేరు చేయడం, పర్యావరణహిత పద్ధతులకు ప్రాధాన్యం పార్కింగ్ సామర్థ్యం 4 వేల నుంచి 4,500 కార్లకు పెంపు. భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు మల్కాజ్‌గిరి పోలీసులతో సమన్వయం

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు

ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు మెట్రోలో రావాలని ప్రేక్షకులకు విజ్ఞప్తి. మ్యాచ్ రోజు రాత్రి ఒంటి గంట వరకు మెట్రో సేవలు పొడిగించాలని విజ్ఞప్తి. మ్యాచ్ ప్రారంభానికి రెండు గంటల ముందే స్టేడియానికి చేరుకోవాలని సూచన. మ్యాచ్ కోసం సుమారు 34 వేల టికెట్లు విక్రయానికి అందుబాటులోకి. బ్లాక్ మార్కెటింగ్ నివారణకు ఒక లాగిన్‌తో గరిష్ఠంగా నాలుగు టికెట్ల కొనుగోలుకు పరిమితి. టికెట్ జీనీ ద్వారా ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్ టికెట్ల విక్రయం టికెట్లను మరో మొబైల్‌కు బదిలీ చేసుకునే సదుపాయం కనిష్ఠ టికెట్ ధర రూ. 750.. గరిష్ఠ ధర రూ. 20 వేలుగా నిర్ణయం. టీమిండియా, వెస్టిండీస్ జట్లకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు. మ్యాచ్ నిర్వహణకు సహకరిస్తున్న బీసీసీఐ, పోలీసు శాఖ, తెలంగాణ ప్రభుత్వానికి హెచ్‌సీఏ కృతజ్ఞతలు తెలిపారు.

సారస్ మేళాకు సందర్శకుల తాకిడి

- మూడో రోజు 20 వేల మందికి పైగా సందర్శకులు
- రూ.10 లక్షలకు పైగా విక్రయాలు
  మహిళా సంఘాల ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ
- వ్యాపార అనుభవాలను పంచుకున్న మహిళా వ్యాపారవేత్తలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9: గ్రామీణ మహిళల ఉత్పత్తులకు పట్టణ మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తోంది. గ్రామీణ మహిళా సంఘాల సభ్యులు, చేతివృత్తుల కళాకారులు, మహిళా వ్యాపారవేత్తలకు అండగా నిలుస్తున్న సారస్ గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళాకు రోజురోజుకూ సందర్శకుల తాకిడి పెరుగుతోంది. హైదరాబాద్‌లోని ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ మైదానంలో జరుగుతున్న సారస్ మేళా మూడో రోజు సందర్శకులతో సందడిగా మారింది. శుక్రవారం ఒక్కరోజే 20 వేల మందికి పైగా సందర్శకులు మేళాను సందర్శించారు. రూ. 10 లక్షలకు పైగా విలువైన ఉత్పత్తుల విక్రయాలు జరిగాయి. మహిళా సంఘాల సభ్యులు స్వయంగా తయారుచేసిన ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు పరిచయం చేసేందుకు, తమ వ్యాపారాలను విస్తరించుకునేందుకు సారస్ మేళా చక్కటి వేదికగా నిలుస్తోంది. మేళాకు వస్తున్న వారిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం. మహిళలు పెద్ద సంఖ్యలో స్టాళ్లను సందర్శిస్తూ గ్రామీణ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ఆసక్తిగా పరిశీలించి కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ ఉత్పత్తులు, హస్తకళలు, ఆహార పదార్థాలు, చిరుతిళ్లు, చేనేత వస్త్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మహిళా సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను కల్పించడం, మధ్యవర్తులపై ఆధారపడకుండా మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం ఈ మేళా ద్వారా లభిస్తోంది. ఉత్పత్తుల నాణ్యత, ధరలు, ప్యాకేజింగ్, వినియోగదా రుల అభిరుచులపై ప్రత్యక్ష అవగాహన పొందేందుకు కూడా ఇది దోహదపడుతోంది. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాళ్లలో విభిన్న రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. తమ ప్రాంతాల ప్రత్యేకతను చాటిచెప్పే ఉత్పత్తులను మహిళలు ఉత్సాహంగా విక్రయిస్తున్నారు. సందర్శకుల ఆదరణ, పెరుగుతున్న విక్రయాలు మహిళా పారిశ్రామికవేత్తల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నాయి.

వ్యాపార అనుభవాలపై మహిళా సంఘాల సభ్యుల చర్చ

సారస్ మేళా సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా సంఘాల సభ్యులు తమ వ్యాపార అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. వ్యాపారాలను నిర్వహించే క్రమంలో తమ జిల్లాల్లో ఎదురవుతున్న సమస్యలు, ఉత్పత్తుల విక్రయాల్లో ఎదురవుతున్న సవాళ్లు, మార్కెటింగ్ అవకాశాలు, ఉత్పత్తులకు మరింత విస్తృత గుర్తింపు తీసుకురావాల్సిన అంశాలను సెర్ప్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మహిళా సంఘాల వ్యాపారాలను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మార్కెట్ అనుసంధానం, ఉత్పత్తుల విక్రయాలను పెంచుకునే మార్గాలు, వ్యాపార నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలపై చర్చించారు. మహిళలు తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా ఒకరి నుంచి మరొకరు నేర్చుకునేందుకు, కొత్త ఆలోచనలను స్వీకరించేందుకు ఈ సమావేశం ఉపయోగపడింది.

సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా మేళా

మూడో రోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. కళాకారుల ప్రదర్శనలు, సాంప్రదాయ కళారూపాలు మేళాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామీణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు సందర్శకుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఉత్పత్తుల కొనుగోళ్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు కూడా ప్రజలు ఆసక్తి చూపడంతో మేళా ప్రాంగణం సందడిగా మారింది.

సేవా స్ఫూర్తితో.. ప్రజల గుండెల్లో పిల్లుట్ల రఘు

- పుట్టిన గడ్డ నుంచి ఢిల్లీ వరకు..
  మఠంపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సత్కారం
- సామాజిక సేవతో హుజూర్‌నగర్‌కు గుర్తింపు

మఠంపల్లి, వెలుతురు, అక్టోబర్ 09 : సామాజిక సేవే లక్ష్యంగా, ప్రజలే బలంగా ముందుకు సాగుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘును మఠంపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. సొంత గ్రామం, సొంత మండలం పేరును యావత్ భారతదేశానికి పరిచయం చేసే స్థాయికి పిల్లుట్ల రఘు ఎదగడం గర్వకారణమని పేర్కొన్నారు. నేటి రోజుల్లో పక్కవారి సమస్యలను పట్టించుకోని పరిస్థితులు ఉన్నప్పటికీ, పుట్టిన గడ్డకు సేవ చేయాలనే సంకల్పంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటిస్తూ పేదలకు, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. గత కొన్నేళ్లుగా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న రఘు ఢిల్లీలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం హుజూర్‌నగర్ నియోజకవర్గానికి గర్వకారణమని తెలిపారు. ఆయనకు నిర్వహించిన సన్మానం తమ అభిమానానికి, గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు.

ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యం

ఈ సందర్భంగా పిల్లుట్ల రఘు మాట్లాడుతూ.. పుట్టిన భూమి రుణం తీర్చుకోవడం కంటే గొప్ప విషయం మరొకటి లేదన్నారు. తన సొంత గ్రామానికి, మండలానికి, నియోజకవర్గానికి సేవ చేయాలనే సంకల్పంతోనే ప్రజల మధ్యకు వచ్చానని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తానున్నాననే భరోసా కల్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటానని, రైతులకు, యువతకు, పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై రఘు విమర్శలు

గతంలో తెరాస ప్రభుత్వ హయాంలో ప్రజలకు అనేక సంక్షేమ, సేవా కార్యక్రమాలు అందాయని రఘు పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. హెలికాప్టర్ ప్రయాణాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవాలని సూచించారు. పులిచింతల నుంచి అప్పన్నపేట వరకు, అప్పన్నపేట నుంచి కోదాడ వరకు ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

పలువురు నాయకులు, కార్యకర్తల హాజరు

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జగన్ నాయక్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణంరాజు, వీరారెడ్డి, ఇస్మాయిల్, మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, రామారావు, కిరణ్, పిల్లుట్ల కొండల్, సర్పంచులు కుక్కల వెంకన్న, హరిచంద్రు, భేత వెంకట్ రెడ్డి, నియోజకవర్గ సీనియర్ ఉద్యమ నాయకులు అడ్వకేట్ నగేష్ రాథోడ్, నాగయ్య, శివశంకర్, రామాంజి, గోవింద్, దాసరి వెంకటరమణ, లక్ష్మీనరసింహరాజు, రహీం, కృష్ణయ్య, రాముడు, సైదా నాయక్, టిక్యా నాయక్, భరత్, రంగా, నవీన్, శ్రీను, రాజీవ్, సోమయ్య, బాణావత్ బాబు, శోభన్ బాబుతో పాటు పలువురు నాయకులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉస్మానియాలో బతుకమ్మ

వేడుకల్లో పాల్గొన్న కోమటిరెడ్డి లక్ష్మి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 09: ఉద్యమాల పురిటి గడ్డ ఉస్మానియా యూనివర్సిటీలోని చారిత్రక ఆర్ట్స్ కాలేజ్ ముందు ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు కోమటిరెడ్డి సుశీల మ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మి ప్రతి విద్యార్థి పిడికిలి బిగించి జై తెలంగాణ అని నినదించిన ప్రదేశంలో తెలంగాణాకే సొంతమై, తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మను విద్యార్థినులతో కలిసి ఆడారు.. తెలంగాణ ఉద్యమం లో సాంస్కృతిక కెరటమై నిలిచిన బతుకమ్మ ను తెలంగాణ నినాదాన్ని నలదిక్కుల ప్రజ్వలింప చేసిన నేలపై ఆడడం ఎంతో సంతోషాన్నిచ్చింద న్నారు..మన ఈ ప్రత్యేక సంస్కృతి ని ఉన్నత విద్యను అభసిస్తున్న విద్యార్థినులు ఆడుతూ ముందుకు తీసుకె ళుతుండడం మన సంస్కృతి సంప్రదా యాల పట్ల నేటి తరానికి ఉన్న నిబద్ధతను చాటి చెబు తుం దని ఇది చాలా శుభ సూచక మన్నారు.

పువ్వులను దేవతల లాగా

పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణకే ప్రత్యేకం

- బతుకమ్మ వేడుకల ద్వారా ఈ తరం పిల్లలకు మన పండుగల గొప్పతనాన్ని సాంప్రదాయాలను సంస్కృతులను తెలియజేయడం మంచి పరిణామం
- చౌటుప్పల్ బ్రతుకమ్మ వేడుకల్లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి

చౌటుప్పల్ వెలుతురు, అక్టోబర్ 09 : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 30 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సతీమణి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మి గారు హాజరై విద్యార్థులతో కలిసి ఆడి పాడారు, మహిళలందరూ ఒకచోట చేరి భక్తిశ్రద్ధలతో బతుకమ్మను సెలబ్రేట్ చేసుకోవడం, పూలను దేవతలా భావించి పూజించడం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమన్నారు... మన పూర్వీకులు మనకు ఇచ్చిన సంస్కృతి సాంప్రదాయాలను ఈ తరం తెలియజేసేలా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు.. ప్రతి ఒక్కరూ ఈ దసరా సెలవుల్లో గ్రామాలకు వెళ్లి నానమ్మ అమ్మమ్మలు చెప్పే ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని విద్యార్థినులను ఉద్దేశించి అన్నారు. దేవుడిచ్చిన శక్తితో మా ఊపిరి ఉన్నంతవరకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా సమాజానికి పేద ప్రజలకు సహాయం చేస్తూనే ఉంటామని పునరుద్ఘాటించారు. ఈ బతుకమ్మ వేడుకల్లో కోమటిరెడ్డి లక్ష్మి గారితో పాటు చౌటుప్పల్ మున్సిపల్ పాలకవర్గ మహిళలు, పుర మహిళలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

బతుకమ్మ విశిష్టతను

విశ్వవ్యాప్తం చేస్తాం: మంత్రి జూపల్లి

- ఈ నెల 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజుల పాటు వేడుకలు
- బతుకమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి
- రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యానికి, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను విశ్వవ్యాప్తంగా చాటేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైటెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. బతుకమ్మ తెలంగాణకే ప్రత్యేకమైన పండుగ అని జూపల్లి కృష్ణారావు అన్నారు. బతుకునే తల్లిగా భావించే తెలంగాణ ప్రజల జీవన సంస్కృతికి బతుకమ్మ నిలువుటద్దమని పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలను దేవతగా కొలుస్తూ, పూజించే అపురూపమైన సంప్రదాయం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనను ప్రతిబింబించేలా సంబరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలోనూ బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటే ఇలాంటి పండుగలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా రాష్ట్ర సంప్రదాయాలను భావితరాలకు అందించడంతోపాటు, ప్రపంచానికి తెలంగాణ ప్రత్యేకతను పరిచయం చేయవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డలందరికీ మంత్రి జూపల్లి కృష్ణారావు.. బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆడపడుచులందరూ కలిసి సంతోషంగా చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలే జీవితానికి పునాది

- అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకోవాలి
- క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎం టోర్నమెంట్లు దోహదం
- మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9: క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్ మండలం రంగారెడ్డి గూడెంలో నిర్వహించిన అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గత ప్రభుత్వం క్రీడలను విస్మరించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రీడలను కాలక్షేపంగా కాకుండా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునే మార్గంగా భావించాలని సూచించారు. క్రీడలు ఎవరి సొత్తు కాదని, కష్టపడి సాధన చేసే ప్రతి ఒక్కరికీ విజయావకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు క్రీడారంగంలో మెరుగైన అవకాశాలు లభిస్తాయని, ఎంసెట్‌లోనూ క్రీడాకారులకు రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన చికితా రావు వంటి క్రీడాకారుల ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకొచ్చే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. క్రీడలపై అంకితభావంతో సాధన చేస్తే ప్రపంచస్థాయిలో గుర్తింపు సాధించవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని, ఈ టోర్నమెంట్ ద్వారా ప్రతి భావంతులైన క్రీడాకారులను గుర్తించి ఉన్నతస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

సర్‌పై బీఆర్ఎస్ మౌనమెందుకు?

-బీజేపీతో లోపాయికారీ ఒప్పందం ఉందనే అనుమానం: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

గాంధీ భవన్, వెలుతురు అక్టోబర్ 9: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు పోరాటం చేస్తుంటే, తెలంగాణలో బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉంటోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే తమ నేతలు ఇబ్బందుల్లో పడతారనే భయంతోనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఈ అంశంపై స్పందించడం లేదని విమర్శించారు. బీజేపీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో బీఆర్ఎస్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందనే అనుమానం తమకు ఉందన్నారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. దేశంలో అర్హత కలిగిన ప్రతి ఓటు హక్కును కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో దళితులు, మైనారిటీలు, గిరిజనుల ఓట్లు తొలగిస్తున్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో దురుద్దేశపూర్వకంగా ఈ ప్రక్రియ జరుగుతోందని ఆరోపించారు. వివిధ కారణాలతో రాష్ట్రంలో 90 లక్షల ఓట్లు తొలగించే పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ నేతలపై విమర్శలు

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వయసుతో సంబంధం లేకుండా పోరాటం చేస్తుంటే, తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు కనీసం నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టడం లేదని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఫార్ములా-ఈ కేసులో అరెస్టు చేస్తారనే భయం, కాళేశ్వరం వ్యవహారంలో సీబీఐ చర్యలు తీసుకుంటుందనే ఆందోళనతోనే బీఆర్ఎస్ నేతలు మౌనంగా ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ ఆస్తులపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఉండటానికి ఇల్లు లేదని చెప్పిన కేటీఆర్‌కు ఫైవ్‌స్టార్ హోటళ్లలో వసతులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతల ఆస్తులపై ప్రజలకు అనేక ప్రశ్నలు ఉన్నాయని, తమ వ్యవహారాలు బయటపడతాయనే భయంతోనే ఎస్ఐఆర్‌పై మాట్లాడటం లేదని ఆరోపించారు.

ఓటు హక్కును కాపాడాలి

ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ ఏడాది కాలంగా తీవ్రంగా కసరత్తు చేస్తోందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గతంలో టీఎన్ శేషన్, లింగ్డో, కృష్ణమూర్తి వంటి ఎన్నికల కమిషనర్ల హయాంలో న్యాయబద్ధంగా ఎన్నికల ప్రక్రియలు జరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) వ్యవహారశైలిపై దేశవ్యాప్తంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రోహింగ్యాల అంశాన్ని ప్రస్తావిస్తూ మమతా బెనర్జీ విజయాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని, బిహార్‌లో ఆర్జేడీ గెలుపును అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ తదుపరి లక్ష్యాలు తెలంగాణ, పంజాబ్ కావచ్చని అభిప్రాయపడ్డారు.

నిరసనలు కొనసాగిస్తాం

ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు నిరసన ర్యాలీలు కొనసాగిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రకటించారు. రాష్ట్రంలో బీఎల్ఓలకు సంబంధించిన ఫారాలు, ఓటర్ల వివరాల నమోదులో తప్పిదాలు జరిగాయని, రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం పొరపాట్లను అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రశ్నించే ఏ రాజకీయ పార్టీకి అయినా కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాక్షేత్రంలో నిరసనలు తెలియజేయడం తప్పు కాదని, ఓటు హక్కు పరిరక్షణ కోసం అన్ని పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు,
యువత చరిత్రను తెలుసుకోవాలి

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 9: ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ ఒకప్పుడు బెంగాల్ ఆలోచిస్తే దేశం ఆచరిస్తుంది అనేవారు నేడు తెలంగాణ ఏం చేస్తే దేశం అది అనుసరిస్తుంది అనే స్థాయికి ఎదిగాం. పంజాబ్‌ను తలదన్ని వరి ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్.. 33 మెడికల్ కాలేజీలు, 10 వేల ఎంబీబీఎస్ సీట్లతో డాక్టర్ల ఉత్పత్తిలోనూ దేశానికే నంబర్ వన్ తెలంగాణ. 1983లో ఎన్టీఆర్‌కు ఏ చేత్తోనైతే దరఖాస్తు ఇచ్చారో ముఖ్యమంత్రి అయ్యాక అదే చేత్తో సంతకం పెట్టి సిద్దిపేట జిల్లాను సాకారం చేసిన కేసీఆర్. ఎన్నికల గోడ రాతలుగా మిగిలిపోయిన సిద్దిపేట జిల్లా, రైలు మార్గం, గోదావరి జలాల దశాబ్దాల కలలను కేసీఆర్ హయాంలోనే నిజం చేసుకున్నాం. పదవుల కంటే తెలంగాణే ముఖ్యమని ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్షతో రాష్ట్రాన్ని సాధించిన నేత కేసీఆర్. పదేళ్లలోనే సాగునీరు, తాగునీరు, విద్యుత్ రంగాల్లో సంపూర్ణ మార్పు తెచ్చి దేశ జీఎస్‌డీపీ వృద్ధిలో తెలంగాణను దిక్సూచిగా నిలిపాం. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన యువజన సదస్సులో మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు, యువత చరిత్ర తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని, స్వరాష్ట్రంలో సాధించిన ప్రగతితో పాటు సిద్దిపేట సమగ్ర అభివృద్ధిపై ఆయన మాట్లాడారు. హరీష్‌రావు గారి కామెంట్స్: విద్యార్థులు, యువత చరిత్ర గురించి తప్పక తెలుసుకోవాలి.. అప్పుడే గతానికి ఉన్న విలువ, పోరాటాల త్యాగాలు అర్థమవుతాయి. భారత దేశ చరిత్ర, తెలంగాణ చరిత్ర, మన ప్రాంత చరిత్రలకు దేనికదే ప్రత్యేక విశిష్టత ఉంది. తెలంగాణ కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కాదు. 1956 వరకు బూర్గుల రామకృష్ణారావు తొలి ముఖ్యమంత్రిత్వంలో హైదరాబాద్ రాష్ట్రంగా విలసిల్లిన ఘనమైన ప్రాంతం మనది. కొన్ని షరతులు, ఒప్పందాలతో పెద్ద మనుషులు మన రాష్ట్రాన్ని ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేశారు. కలిసిన మరుసటి రోజు నుంచే నిధులు, నీళ్లు, ఉద్యోగాల్లో వివక్ష మొదలైంది. గైర్ ముల్కీ గో బ్యాక్ నినాదంతో ప్రారంభమైన పోరాటం 1969లో మహా ఉద్యమంగా మారింది. ఆ ఉద్యమంలో 396 మంది విద్యార్థులు పోలీసుల తూటాలకు అమరులయ్యారు. ఒక విద్యా సంవత్సరమే స్తంభించిపోయింది. అసెంబ్లీ వద్ద, సిద్దిపేట రంగధాంపల్లి వద్ద, వరంగల్‌లో ఉన్న అమరవీరుల స్తూపాలకు కింద కనిపించే బుల్లెట్ గుర్తులు 1969 అమరవీరుల జ్ఞాపకార్థం శిల్పి ఎక్కా యాదగిరి పొందుపరిచిన చారిత్రక చిహ్నాలు. ప్రొఫె. సర్ జయశంకర్ తెలంగాణ ఆకాంక్షను సజీవంగా ఉంచారు. చెన్నారెడ్డి, ఇంద్రారెడ్డి లాంటి నేతలు పోరాటాలు చేసినా రాష్ట్రం రాలేదు. 2001లో కేసీఆర్ పదవులన్నింటినీ గడ్డిపోచలా విడిచిపెట్టి ఉద్యమాన్ని ప్రారంభించి, ఆమరణ నిరాహార దీక్షతో కొట్లాడి జూన్ 2, 2014న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. తెలంగాణ వచ్చిన తొలినాళ్లలో పల్లెలు, పట్నాల్లో కరెంట్ కోతలు, సాగునీరు లేక నెర్రలు బారిన నేలలు ఉండేవి. కానీ కేసీఆర్ పదేళ్ల పాలనలో జీఎస్‌డీపీ వృద్ధిలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచింది.

ఒంటెద్దు పోకడలతో
పార్టీకి తీవ్ర నష్టం

దేవీపట్నం వెలుతురు అక్టోబర్ 9: రంపచోడవరం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేసుకోకుండా మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్నారని దేవీపట్నం మాజీ ఎంపీటీసీ, మండల యూత్ ప్రెసిడెంట్ తుర్రం జగదీష్ దొర తీవ్రంగా ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న క్షేత్రస్థాయి కార్యకర్తలను పట్టించుకోకుండా, కనీసం మండల స్థాయి సమావేశాలు నిర్వహించే సమయంలో కూడా సంబంధిత నాయకులు, కార్యకర్తలతో ముందస్తుగా సమన్వయం చేసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. నాయకత్వం అంటే కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు వెళ్లడమే తప్ప, కొంతమందితో మాత్రమే సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకోవడం కాదని జగదీష్ దొర స్పష్టం చేశారు. కార్యకర్తల అభిప్రాయాలను, స్థానిక పరిస్థితులను పరిగణన లోకి తీసుకోకుండా వ్యవహరించడం వల్ల ఇప్పటికే పార్టీ క్షేత్రస్థాయిలో తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. "పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలను విస్మరిస్తే పార్టీ ఎలా బలోపేతం అవుతుంది? ప్రతి మండలంలో ఉన్న నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని వారి అభిప్రాయాలను గౌరవించాలి. లేకపోతే ఏకపక్ష నిర్ణయాల వల్ల పార్టీకి మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంది" అని తుర్రం జగదీష్ దొర అన్నారు. రంపచోడవరం నియోజక వర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలంటే వ్యక్తిగత ఆధిపత్య ధోరణులను పక్కనపెట్టి, ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం కల్పిస్తూ సమిష్టి నాయకత్వంతో ముందుకు సాగాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యకర్తల మధ్య సమన్వయం పెంచి, పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని తుర్రం జగదీష్ దొర పేర్కొన్నారు.

పథకం పేరు మారినా.... అవినీతి తీరు మారలేదు

తుగ్గలి, వెలుతురు అక్టోబర్ 9: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసపోకుండా ఉన్న గ్రామంలోనే వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. పథకం అమలులోకి వచ్చినప్పటి నుండి అధికారులు, నాయకులు అవినీతికి పాల్పడుతూ కోట్లాది రూపాయలు ప్రజల ప్రభుత్వ సొమ్మును కొల్లగొడుతున్నారు. మస్టర్ల ద్వారా జరిగే అవినీతిని అంతం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నడుం బిగించింది. ఉపాధి పనులలో మస్టర్లకు రాం రాం చెప్పింది. మస్టర్లకు బదులు సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్న ఫేస్ యాప్‌ను తీసుకువచ్చింది. విబి జి రాం జీ పేరుతో నూతన పథకానికి 2026 జులై 1 వతేది ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించాడు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో పని మొదలు పెట్టినప్పుడు, మధ్యలో ఒకసారి, పని ముగించుకొన్నప్పుడు మరొకసారి ఫీల్డ్ అసిస్టెంట్లు ఆండ్రాయిడ్ సెల్ ఫోన్ తొ ప్రత్యేక యాప్ ద్వారా కూలీ ఫోటో తీసి అప్లోడ్ చేస్తాడు. ఇలా మూడు సార్లు ఫోటో తీసి అప్లోడ్ చేయాలనే నిబంధనలు ఉండడంతో అవినీతికి చోటు ఉండదని కేంద్రం ఉద్దేశం. ఐతే కొందరు అవినీతి అధికారులు అడ్డదారులు కనుక్కొని, విబి జి రాం జీ పథకంలో కూడా అవినీతికి తెరలేపారు. పథకం పేరు మారిందే గాని అవినీతిలో తీరు మారలేదు. అవినీతి పరులకు నాటికంటే నేడు సులభకరమైంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏ విధంగా అవినీతిలో కూరుకుపోయిందో అదే విధంగా కూడా విబి జీ రాం జీ పథకం కూడా భారీ అవినీతిలో కూరుకుపోయింది. గతంలో పనులు చేసే వారికే మాస్టర్లు వేస్తూ కొంతమందికి మాత్రమే మాస్టర్లు వేసి అవినీతికి పాల్పడేవారు. అందుకు విరుద్ధంగా విబి జీ రాం జీ పథకంలో పనులు చేయకుండానే మస్టర్లు వేస్తూ భారీ స్థాయిలో అవినీతికి తెరలేపారు.

పథకం ఏదైనా సరే అవినీతిలో మేము ముందు ఉంటామని తుగ్గలి మండలం మరోసారి రుజువు చేసుకుంది. తుగ్గలి మండలంలోని అన్ని గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు ఉపాధి కూలీలతొ కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారు. ఫేస్ యాప్ ద్వారా మస్టర్లు వేస్తాము, వచ్చిన డబ్బులలో మాకు సగం, మీకు సగం ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములా అమలు చేశారు. ప్రభుత్వ శాఖలలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు, ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్లకు, చిరు వ్యాపారులకు, హోటల్ యజమానులకు, కిరాణా షాప్ యజమానులకు, ఆటో డ్రైవర్లకు, ట్రాక్టర్ యజమానులకు, మెడికల్ షాప్ యజమానులకు, రైలు బండ్లలో టీ కాఫీలు, సమోసాలు, వడలు, బిస్కె ట్లు, చిప్స్, పూలు, పండ్లు అమ్ముకునే వారికి, ప్రైవేట్ కంపెనీలలో పనిచేసే వారికి, ఇతర ప్రాంతాలలోని కాలేజీలలో చదువుకునే వారికి, పెళ్లై మెట్టినింటికి వెళ్లిన వారికి, ఇతర జిల్లాలలో వారికి కూడా ఫేస్ యాప్ లో మాస్టర్లు వేస్తూ కొట్లాది రూపాయలు లూటి చేస్తున్నారు. కొసమెరుపు....ఇతర రాష్ట్రాలలో ఉన్నవారికి, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, ఉద్యోగస్తులకు కూడా మస్టర్లు వేస్తున్నారంటే అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో మరి. ఇంత అవినీతి జరుగుతున్న జిల్లా అధికారులు పట్టించుకో వడం లేదు. ముందు ముందు ఏం జరుగుతుందో వేచి చూడాలి మరి...!

పండుగ వేడుకలు
సురక్షితంగా జరుపుకోవాలి

సీపీ ముఖ్య సూచనలు మార్గదర్శకాలు

సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 9: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ రష్మి పెరుమాళ్ నిర్వాహకు లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగ వాతావరణంలో వేడుకలు ప్రశాంతంగా సురక్షితంగా జరుపుకునేలా పలు కీలక సూచనలు మరియు మార్గదర్శకాలను జారీ చేశారు. నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలి. అనుమతించిన సమయాన్ని మాత్రమే పాటిస్తూ, నియమావళికి లోబడి వేడుకలు నిర్వహించాలి. కార్యక్రమానికి వచ్చే ప్రజల రద్దీని తగిన విధంగా నియంత్రించేందుకు ముందస్తు ప్రణా ళిక రూపొందించుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో ముగించాలి. సామాజిక విద్రోహ శక్తులను లేదా అల్లరి మూకలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఈవెంట్ సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ జనరేటర్ ఏర్పాట్లు చేసుకోవాలి. అలాగే అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పక చేపట్టాలి. ఈవెంట్ స్థలంలోకి వచ్చే మరియు వెళ్లే మార్గాల్లో రద్దీ ఏర్పడకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద మరియు పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాలంటీర్లు ట్రాఫిక్‌ను నియంత్రించాలి. వాలంటీర్లు సులభంగా గుర్తింపు పొందేలా ప్రత్యేక యూనిఫాం లేదా ఐడెంటిటీ ట్యాగ్‌లు తప్పనిసరిగా ధరించాలి. వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తిస్తూ సహకరించాలి. ఈవెంట్ ముగిసే వరకు నిర్వాహకులు అక్కడే అందుబాటులో ఉండాలి. పబ్లిక్‌కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు వీలుగా అత్యవసర ఫోన్ నంబర్లను నిర్వాహకులు దగ్గర ఉంచుకోవాలి. కార్యక్రమాలు ప్రారంభమయ్యే ముందే నిర్వాహకులు వాలంటీర్లకు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలి. సమాజ శ్రేయస్సు, ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖకు నిర్వాహకులు, ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని సీపీ రష్మి పెరుమాళ్ పిలుపునిచ్చారు.

ఏపీలో స్థానిక ఎన్నికలకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్

రిజర్వేషన్లపై తలంటిన సుప్రీం

విజయవాడ, వెలుతురు అక్టోబర్ 9: ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నానికి సుప్రీంకోర్టులోనూ అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి న్యాయపరమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి. గతంలో ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ప్రస్తుతానికి అడ్డంకి ఏర్పడింది. ఈ రిజర్వేషన్లను అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతాయని హైకోర్టు గతంలో పేర్కొంది. ఆ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. వెనకబడిన తరగతులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్న ఉద్దేశంతో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 20న గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించి జీవో 105 జారీ చేసింది. పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆగస్టు 19న మరో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిర్ణయాలపై న్యాయస్థానాల్లో సవాళ్లు ఎదురయ్యాయి. 2020లోనూ 34 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం.. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి రిజర్వేషన్లు సాధారణంగా 50 శాతం మించకూడదు. అంత కంటే ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలంటే వెనుకబాటుతనంపై సమగ్ర అధ్యయనం, విశ్వసనీయ గణాంకాలు అవసరమని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టు తాజా నిర్ణయం రాష్ట్రంలో రాజకీ యం గా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించు కుంది.

లైన్ క్లియర్

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితా, వార్డుల పునర్విభజన అంశాలపై కీలక స్పష్టత ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడినట్లయింది. ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసీపీ వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం. వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది.

కోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా రిజర్వేషన్లు

అమరావతి, వెలుతురు అక్టోబర్ 9: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతు లకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ అంశంపై రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈ రోజు కొట్టివేసింది. మొత్తం రిజర్వే షన్లు 50 శాతానికి మించరాదంటూ గతంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం కోటా 50 శాతం మించకూడదన్న నిబంధనను హైకోర్టు గుర్తుచేయడం సమంజసమేనని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. న్యాయస్థానాల తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం బీసీలకు పూర్తిస్థాయిలో రాజకీయంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ తరఫున అధిక శాతం సీట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కడాన్ని వైసీపీ సహించలేకపోయిందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కోర్టులకు వెళ్లి, బీసీల రాజకీయ వాటాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల కోటాను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు సుమారు 16,800 పదవులు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.

ప్లాన్ బీ తో ఎన్నికలు

తాజా తీర్పుతో ప్రభుత్వం ప్లాన్ బీ ని ఫాలో కానుందని తెలుస్తోంది. సుప్రీంకోర్టు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుమతించకపోయినా స్థానిక ఎన్నికలు నిర్వహణకు కూటమి ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. పార్టీ పరంగా బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి ఇచ్చిన మాటను నిరూపించుకుంటామని కూటమి నేతలు చెబుతున్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న నిబంధనతో బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యం కావడం లేదు. భారత్‌లో బీసీ (వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్లను పెంచాలన్నా, లేదా మొత్తం రిజర్వేషన్ల కోటాను పెంచాలన్నా 1992 నాటి 'ఇందిరా సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు విధించిన 50 శాతం గరిష్ట పరిమితి ప్రధాన అడ్డంకిగా మారుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఛాలెంజ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగుల ధర్మాసనం ఈ పిటిషన్ విచారించగా.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్‌ను సమర్థించేందుకు ఉపయోగించిన డేటా చట్టబద్ధతను జస్టిస్ దీపాంకర్ దత్తా ప్రశ్నించారు. అదే విధంగా రిజర్వేషన్‌ను నిర్ణయించడానికి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ద్వారా సేకరించిన డేటాపై రాష్ట్ర ప్రభుత్వం ఆధారపడటాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముందుగా ఈ ఫ్యామిలీ సర్వే ఏ చట్టం కింద చేశారో మాకు చూపించండని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది. అయితే అందుకు ఏపీ ప్రభుత్వం ఆధారపడిన డేటా రిజర్వేషన్‌ను నిర్ణయించ డానికి ప్రాతిపదిక కాదని హైకోర్టు తెలిపిన కారణాలను సుప్రీంకోర్టు సైతం పరిశీలించింది. రిజర్వేషన్ల పెంపు కోసం ఆ డేటాను ఎందుకు పరిగణించవచ్చో నిరూపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జస్టిస్ దత్తా కోరారు. తమకు సమర్పించినట్లు చెబుతున్న కమిషన్ నివేదికను ఏపీ ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదని, అది పెండింగ్‌లో ఉందని కూడా ధర్మాసనం ప్రస్తావించింది.

రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి



సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 9: : సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారుశుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో రైల్వే ప్రాజెక్టు ముఖ్య అధికారులు, రెవెన్యూ, అర్ అండ్ బి, పిఆర్ అధికారులతో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎన్. నవ్య శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో రైల్వే లైన్ నిర్మాణంలో పెండింగ్ లో సమస్యలు, బ్రిడ్జి నిర్మించే ప్రాంతాల్లో భూ సేకరణ వివరాలు గూర్చి రైల్వే అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. చిన్నకోడూరు మండలంలో చిన్నకోడూరు మాచాపూర్, గంగాపూర్ విఠలాపూర్, నారాయణరావు పేట మండలం లో గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్ సమస్యల గూర్చి అధికారులతో క్లుప్తంగా చర్చించారు. పెండింగ్ లో ఉన్న ప్రాంతాలను రైల్వే, రెవెన్యూ, అర్ అండ్ బి, పిఆర్, అందరూ కలిసి పర్యవేక్షణ చేసి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టే దగ్గర డైవర్షన్ బీటీ రోడ్ ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, భూ సేకరణ పెండింగ్ తదితర పూర్తి సమాచారాన్ని జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రైల్వే పనుల వల్ల పక్కన రైతులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చెయ్యాలని, బ్రిడ్జి నిర్మాణాలు వేగంగా పూర్తి చెయ్యాలని రైల్వే అధికారులను ఆదేశించారు. రైల్వే పనులు అయ్యేంత వరకు స్థానిక శాఖల అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ సదానందం, రైల్వేస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూర్తి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ అవసరాలకు తగినట్లు ప్రజా రవాణా...

- ఆధునిక సాంకేతికతకు పెద్ద పీట వేయాలి
- కేబీఆర్ చుట్టూ మరింత సజావుగా రాకపోకలు
- రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై పూర్తి స్థాయి అధ్యయనం
- క్యూర్ పరిధిలో పనుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:

భవిష్యత్ అవసరాలకు తగినట్లు క్యూర్ పరిధిలో ప్రజా రవాణా సదుపాయాలు మెరుగుపర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. క్యూర్ పరిధిలో ప్రజా రవాణా మెరుగు, వివిధ రహదారుల అనుసంధానత, రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో విపరీతమైన రద్దీ ఉన్న ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుకు అవసరమైన అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది ప్రజలు రవాణా సాగించే ప్రదేశాలతో పాటు వివిధ కర్మాగారాల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు రాకపోకలు సాగించే ప్రదేశాల నుంచి మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానించేలా పీఆర్టీ ఉండేలా డిజైన్ చేయాలని సీఎం సూచించారు. ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్టీలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో ముఖ్యమైన కాలనీల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు పెద్ద పీట వేయాలన్నారు. క్యూర్ పరిధిలో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరిగేలా, రహదారుల్లో సజావుగా రాకపోకలు సాగించేలా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వేతో రాకపోకలు మరింత సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వేకు వివిధ కాలనీలు, రహదారుల నుంచి వచ్చే రహదారులు కలిసే చోటుతో పాటు ఫ్రీ లెఫ్ట్, యూటర్న్‌ల విషయంలో తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. యూటిలిటీస్ తరలింపును వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్ పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంబయి వంటి నగరాల్లో ఏడాదిలోపే పనులు పూర్తవుతున్నాయని, అక్కడి వినియోగిస్తున్న సాంకేతికత, పనుల తీరుపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ప్రారంభించిన పనులు ఏడాదిలోపు పూర్తయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్-ముంబయి బుల్లెట్ ట్రైన్ మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మాణంపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శంకర్‌పల్లి-చేవెళ్ల మధ్య ఇప్పుడు ఉన్న రహదారుల విస్తరణతో పాటు నూతన రోడ్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు.

రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. 500 ఎంఎల్‌డీ రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వల్లి, ఆలూరులోని డాటా సెంటర్లు, ఇతర పరిశ్రమలు రీసైకిల్డ్ వాటర్ వినియోగించుకునేందుకు వీలుగా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైరైజ్ బిల్డింగుల నిర్మాణం, ల్యాండ్ స్కేప్స్, పార్కుల్లో రీసైకిల్డ్ వాటర్ వాడేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

క్యూర్ చట్టం అమలుకు సంబంధించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, వాటర్ బోర్డు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కార్యాలయాల పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు.

సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసి ప్రజావాణిని సందర్శించిన సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యే

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:

రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యం ప్రవాసి ప్రజావాణిని శుక్రవారం సందర్శించారు. సీఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ ఉక్రెయిన్ యుద్ధంలో 39 రోజుల క్రితం సెప్టెంబర్ 1న మృతి చెందగా... మృతదేహం తరలింపు కోసం, రూ. 6 లక్షలు చెల్లించాలని ఉక్రెయిన్ ఎంబసీ సూచించిన నేపథ్యంలో సహాయం కోసం మృతుని భార్య భార్గవి, తల్లి గంగు, గ్రామ సర్పంచ్ బత్తుల గంగాధర్‌తో కలిసి శుక్రవారం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించారు. సీఎంఓ అధికారులతో మాట్లాడి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు,స్వదేశ్ పరికిపండ్ల,తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణిలో 127 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన 260వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 16 గ్రూపులు, 591 మంది ద్వారా 127 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 47, విద్యుత్ శాఖకు 15, హోం శాఖకు 14, ఇతర శాఖలకు 51 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారీ పెట్టుబడులే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

- పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి
- పారిశ్రామికవేత్తలకు మంత్రి జూపల్లి ఆహ్వానం
- 24వ ట్రావెల్ టూరిజం ఫెయిర్-2026లో మంత్రి జూపల్లి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9:

తెలంగాణ పర్యాటక రంగాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా ప్రోత్సహించేందుకు ట్రావెల్ టూరిజం ఫెయిర్ వంటి వేదికలు దోహదపడతాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక సంస్థలు, ట్రావెల్ కంపెనీలు, ఆతిథ్య రంగ సంస్థలు, పర్యాటక పరిశ్రమ ప్రతినిధులు ఒకే వేదిక పైకి రావడం ద్వారా కొత్త వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, ఉపాధి మార్గాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన 24వ ట్రావెల్ టూరిజం ఫెయిర్-2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ప్రదర్శనలో 16 రాష్ట్రాలు, 7 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.... ఈ ప్రదర్శన ద్వారా దేశీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ కొనుగోలుదారులు, సేవలందించే సంస్థల మధ్య అనుసంధానం పెరిగి, కొత్త భాగస్వామ్యాలు, మార్కెట్ విస్తరణకు అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ట్రావెల్ ఇండస్ట్రీ కూడా కొత్త ప్యాకేజీలను ప్రకటించి, పర్యాటకులు తెలంగాణకు వచ్చేలా చూడాలని కోరారు.

ట్రావెల్ టూరిజం ఫెయిర్ నిర్వహించడం తెలంగాణ టూరిజం ప్రమోషన్ కు గొప్ప అవకాశం లభించిందని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌లో హైదరాబాద్ వేదికగా గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ జరగనుందని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు నాసిర్ అస్లాం వానీ, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఫెయిర్ ఫెస్ట్ ఎండీ ఇంబ్రహీంలు పాల్గొన్నారు.

భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

- ఏడాదిన్నరలో సమగ్ర భూసర్వే పూర్తి చేస్తాం
- సర్వే పర్యవేక్షణకు 7 జోన్లకు 14 మంది అధికారుల నియామకం
- ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 09:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర రీ--సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వేలో వేగం ,నాణ్యతతో పాటు ప్రతి దశలో నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు లభించిన ఈ అవకాశాన్ని అధికారులు అత్యంత బాధ్యతతో వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

రీ-సర్వేను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు 7 జోన్లకు ఒక్కో జోన్‌కు రెవెన్యూ , సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించినట్లు మంత్రి తెలిపారు. సర్వే జరుగుతున్న తీరును, నాణ్యతను, ప్రజల స్పందనను ఎప్పటికప్పుడు పరిశీలించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో తొలి దశలో 365 నక్షాలేని గ్రామాల్లో అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240 మొత్తం 2768 గ్రామాల్లో రీసర్వే ముమ్మరంగా సాగుతుందని ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ సర్వేను పర్యవేక్షించేందుకు 14 మంది అధికారులను పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందని తెలిపారు. మొదటి దశ సర్వేను నవంబర్ చివరినాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డు

రీ-సర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న సర్వే బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ డాష్‌బోర్డులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించారు.

తెలంగాణ టూరిజానికి ఐటీ చేయూత

- ఫ్యూచర్ సిటీకి పెట్టుబడుల ఆహ్వానం
- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09:

2047నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పారిశ్రామికీకరణ, పర్యాటకం, ఇంధన రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా పేర్కొన్నారు. శుక్రవారం నాడు ప్రజా భవన్‌లో ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడంలో భాగంగా మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో పలు ఐటీ సంస్థల సీఈఓల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రితో పాటుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వారాంతపు పర్యాటక అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచేందుకు సమావేశం నిర్వహించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఐటీ, పర్యాటక, నీటిపారుదల, అటవీ శాఖల అధికారులు, మంత్రులు, సాఫ్ట్‌వేర్ కంపెనీల సీఈవోలతో కలిసి పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలనే ఆలోచనతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రాష్ట్రంలో ప్రణహిత-చేవెళ్ల ప్రాంతం, కవ్వాల్ టైగర్ రిజర్వ్, నల్లమల అటవీ ప్రాంతం, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి అనేక ఎకో టూరిజం ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. ఐటీ కంపెనీల సీఈవోలు తమ కుటుంబాలతో కలిసి రాష్ట్రంలోని ఎకో టూరిజం ప్రాంతాలను సందర్శించి, అక్కడ ఒకటి రెండు రోజులు గడపాలని కోరారు. పర్యాటక ప్రాంతాల్లో తీసిన ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం ద్వారా తెలంగాణ టూరిజానికి విస్తృత ప్రచారం లభిస్తుందని అన్నారు.

మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీపై ప్రత్యేక దృష్టి :

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు హైదరాబాద్‌లో చేపట్టనున్న ప్రధాన అభివృద్ధి కార్యక్రమాల్లో ఒకటని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టు ఆలోచన ప్రారంభంలో విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం మొదటి విడత పనులు ప్రారంభమయ్యాయని, త్వరలోనే పనులు మరింత ముందుకు సాగనున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కృషి నిబద్ధతతో కృషి చేస్తోందని ఆయన వివరించారు. గతంలో హైటెక్ సిటీ నిర్మాణం చేపట్టినప్పుడు కూడా అది సాధ్యమవుతుందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయని, నేడు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నగరంలోకి ప్రవేశించే సమయంలో కనిపించే ఎత్తైన భవనాలు హైదరాబాద్ అభివృద్ధిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

అదే తరహాలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ కూడా అభివృద్ధి చెందడం ద్వారా నగర విస్తరణకు, ఆర్థిక ప్రగతికి మరింత ఊతం లభిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు.

ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు ఆహ్వానం..

హైదరాబాద్ దేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న వ్యూహాత్మక నగరమని ఆయన చెప్పారు. ఇక్కడ ప్రతిభావంతులైన మానవ వనరులు, అనుకూలమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

విద్యా, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

- పేదలకు అందించే ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ జిల్లా వెలుతురు అక్టోబర్ 09:

శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (IDOC) సమావేశ మందిరంలో ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ - DISHA) సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాదు మున్సిపల్ కమిషనర్ సృజన, అడిషనల్ కలెక్టర్, ఫైజాన్ అహ్మద్, జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ తో పాటు మున్సిపల్ ఛైర్మన్లు, అన్ని శాఖల కేంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ శాఖల వారీగా సమీక్ష జరుపుతూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మల్కాజిగిరి, సైబరాబాద్ కమీషనరేట్ ల పరిధులలో నీడలేని పేదవారికి ఆశ్రయం కల్పించే విధంగా హోమ్ లెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌళిక వసతులు కల్పిస్తూ పరిశుభ్రత పాటించాలని, గర్భిణీలు మరియు పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీ పడకూడదని సూచించారు. అంగన్ వాడీ కేంద్రాలలో టీచర్లు, ఆయాల కొరత భర్తీ చేసి పనితీరును మెరుగుపరచాలన్నారు. గృహ హింసకు గురవుతున్న మహిళలకు అండగా ఉండేందుకు సఖి కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలతో కూడిన లేబర్ రూం, నిరంతరాయం విద్యుత్తు సరఫరా ఉండేలా, మందుల కొరత లేకుండా, సరిపడ వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని భర్తీ చేసుకొని పేదలకు మెరుగైన వైద్య సహాయం 24 గంటలు అందించాలన్నారు. అందుకు అవసరమైన వైద్య పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన పేద కార్మికులకు (ధూూ) అత్యవసర చికిత్సను అందించడానికి అన్ని ఆసుపత్రులలో సేవలు కల్పించడానికి కృషి చేయాలనీ మెడికల్ అధికారులను ఆదేశించారు. నగర వనాల యోజన కింద పట్టణ పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలని, రోడ్ల విస్తరణకు సంబంధించి అటవీ శాఖ త్వరగా అనుమతులను అందించాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని పార్కులను అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు.

వెట్ ల్యాండ్ చెరువులను గుర్తించి కంచె ఏర్పాటు చేయాలన్నారు. యువతకు ఉపాధి కల్పించడానికి గాను స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇచ్చి, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభించేలా చూడాలని ఎంపీ అధికారులను కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ పారిశ్రామిక మరియు విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, బ్యాంకులు అందించే రుణాలపై అవగాహన కల్పిస్తూ, బలహీన వర్గాలకు, విద్యార్థులకు, స్వయం సహాయ సంఘాలకు, ఇతరులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేయాలని సూచించారు. పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పరిశ్రమలకు రుణాలను సకాలంలో అర్హులకు అందించాలన్నారు, CSR (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను వివిధ అభివృద్ధి పనులకు మౌలిక సదుపాయాలు కలిపించడానికి ఉపయోగించాలన్నారు. జిల్లా ఖనిజ నిధులను (ఐవీఖీ) ప్రధానంగా విద్య, వైద్యం మరియు అత్యవసర మౌలిక సదుపాయాల కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పిఆర్ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే అల్పాహారం, మధ్యాన్న భోజనం మెను ప్రకారం నాణ్యమైన ఆహారం అందించడమే కాకుండా, మెను బోర్డును ప్రదర్శించాలన్నారు. స్కూల్స్ లలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు డిఎంఅండ్ హెచ్ ఓ సహకారంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన న్నారు. పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బలోపేతం అవుతార న్నారు. డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులలో పారదర్శకంగా ఏంపిక చేస్తూ కడునిరుపేద ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ ఇళ్లు కేటాయించాలన్నారు. ఎలినినో ప్రభావం భారీన పడకుండా అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.వ్యవసాయ పరికరాలు, ఎరువులు,రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఆయుష్ మిషన్ కింద అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 09:

రంగారెడ్డి జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ (చీూవీ)-పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్ అమలులో భాగంగా వివిధ పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎంపిక కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

భర్తీ చేయనున్న పోస్టులు-వేతన వివరాలు

1. ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు: 3 పోస్టులు
   - నెలకు రూ.40,000.
2. ఫార్మసిస్ట్: 1 పోస్టు
   - వేతన వివరాలు నోటిఫికేషన్ ప్రకారం.
3. సైకోసోషియల్ కౌన్సిలర్: 1 పోస్టు
   - ఒక్కో సెషన్‌కు రూ.500.
   సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు, ఆన్-కాల్ ప్రాతిపదికన విధులు నిర్వహించాల్సి ఉంటుంది.
4. యోగ ప్రొఫెషనల్: 1 పోస్టు
   - నెలకు రూ.28,000.
5. మల్టీ పర్పస్ వర్కర్ (MPW): 2 పోస్టులు
   - నెలకు రూ.15,000.

వయోపరిమితి

2026 జూలై 1వ తేదీ నాటికి అభ్యర్థుల కనీస వయస్సు 18 సంవత్సరాలు, గరిష్ఠ వయస్సు 44 సంవత్సరాలు ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపులు, రిజర్వేషన్లు వర్తిస్తాయి.

దరఖాస్తుల స్వీకరణ

2026 అక్టోబర్ 12వ తేదీ నుంచి అక్టోబర్ 22వ తేదీ వరకు పని దినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు.

దరఖాస్తు సమర్పించే విధానం

అభ్యర్థులు సంబంధిత పోస్టుకు నిర్దేశించిన దరఖాస్తు ఫారాన్ని పూర్తిగా నింపి, అర్హతలకు సంబంధించిన విద్యార్హతల ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన ప్రతులను జతచేయాలి. దరఖాస్తులను స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా సమర్పించవచ్చు.

దరఖాస్తులు సమర్పించాల్సిన చిరునామా:

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కొంగరకలాన్ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా-501510, తెలంగాణ.

ముఖ్య గమనిక

2026 అక్టోబర్ 22వ తేదీ తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించరు. పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం, ఇతర నిబంధనల వివరాల కోసం అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించాలి.

అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎంపిక కమిటీ కోరింది.

ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి వెరీగుడ్డు

హైదరాబాద్, వెలుతురు:

- దాని పోషక విలువలపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- పౌల్ట్రీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- అంతర్జాతీయ ఎగ్ దినోత్సవంలో మంత్రి వాకిటి శ్రీహరి

ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని, అందులో గుడ్డు ఎంతో ముఖ్యమైనదని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువ జన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. అంతర్జాతీయ ఎగ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో గుడ్డు పోషక విలువలపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

గుడ్డు పోషకాహారానికి చక్కని మార్గం

గుడ్డు, పాలు, మాంసం వంటి పోషకాహార పదార్థాల వినియోగంపై సమాజంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, సమతుల ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో అవసరమని మంత్రి అన్నారు. ముఖ్యంగా పిల్లలు, యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదగడానికి పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరికీ గుడ్డు పోషక విలువల గురించి తెలియజేయాలని సూచించారు.

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా ఆరోగ్యం బాగాలేకపోతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి పేర్కొన్నారు. తాను కూడా ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని వ్యక్తిగత అనుభవాల ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు.

పౌల్ట్రీ రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గుడ్డు ఉత్పత్తి అనేది కేవలం కోళ్ల పెంపకానికే పరిమితం కాదని, దాని వెనుక రైతులు, పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు, పశువైద్యులు, శాస్త్రవేత్తలు, రవాణా, మార్కెటింగ్ రంగాలకు చెందిన అనేక మంది శ్రమ దాగి ఉందని మంత్రి అన్నారు. పౌల్ట్రీ రంగం అభివృద్ధి చెందితే రైతులకు ఉపాధి, ప్రజలకు పోషకాహారం అందుబాటులోకి రావడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లే పౌల్ట్రీ రంగంలోని సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పరిశ్రమ ప్రతినిధులు, పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

పాఠశాల స్థాయి నుంచే పోషకాహారం ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. పిల్లలకు గుడ్డు అందించే కార్యక్రమాల ప్రాముఖ్యతను గుర్తించి, పోషకాహారంపై అవగాహనను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గిరిజన తండాల వరకు గుడ్డు వినియోగం, పోషక విలువలపై ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన గుడ్లు అందించడం ఎంత ముఖ్యమో, వాటి ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా సంబంధిత వర్గాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

పౌల్ట్రీ రంగానికి పూర్తి సహకారం

పౌల్ట్రీ రంగ అభివృద్ధికి అవసరమైన అంశాలను పరిశ్రమ ప్రతినిధులతో చర్చించి, ప్రభుత్వ స్థాయిలో పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం, రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, వైద్య నిపుణులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గుడ్డు పోషక విలువలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు, పౌల్ట్రీ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు రవాణా అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, పౌల్ట్రీ రంగం యజమానులు, ముఖ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీలకు ఎంపికైన శివాంశిక

- మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09

జమ్మూలో నిర్వహించిన అండర్-17 జాతీయ స్థాయి చెస్ పోటీల్లో రజత పతకం సాధించి, వరల్డ్ యూత్ కామన్‌వెల్త్ పోటీలకు ఎంపికైన డబ్ల్యూసిఎం, డబ్ల్యుఎఫ్ఎం టైటిల్ హోల్డర్ శివాంశిక ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ అభినందించి సత్కరించారు. చిన్న వయసు లోనే చెస్‌లో ప్రతిభ చాటుతూ జాతీయ స్థాయిలో రజత పతకం సాధించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే వరల్డ్ యూత్ కామన్‌వెల్త్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. శివాంశిక తన ప్రతిభతో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలని అభిలషించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో శివాంశికను మంత్రి అభినందించి సత్కరించారు.

వికలాంగులు, వృద్ధులకు సహాయం

- హుస్నాబాద్ నియోజకవర్గంలో అర్హులకు ఉచిత పరికరాలు
- ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలి
- అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9:

హుస్నాబాద్ నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (ఏఎల్ఐఎంసిఓ) సహకారంతో ఏడిఐపి పథకం కింద ఉచితంగా సహాయ పరికరాలు అందించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ డా,, బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో సహాయ పరికరాలు అవసరమైన దివ్యాంగులు, వృద్ధులు ఒక్కరు కూడా మిగిలిపోకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదా రులకు వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్స్, కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలు తదితర సహాయ పరికరాలను ఉచితంగా అందించనున్నారు. 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న అర్హులకు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

ప్రతి గ్రామంలో అర్హులను గుర్తించాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని మూడు జిల్లాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారులను (డిడబ్ల్యుఓ) మంత్రి ఆదేశించారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్ వాడీ టీచర్, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో సహాయ పరికరాలు అవసరమైన వారిని గుర్తించి, ఎవరూ మిస్ కాకుండా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా కూడా విస్తృత ప్రచారం కల్పించి, అర్హులందరికీ ఈ పథకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు

అర్హత కలిగిన వారు యుడిఐడి కార్డు లేదా సదరం కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగుల పెన్షన్ కార్డు వంటి పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో సహాయ పరికరాలను పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు మూడు జిల్లాల పరిధిలో ఉన్నందున, లబ్ధిదా రులకు ఇబ్బందులు కలగకుండా వేర్వేరు ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి సూచించారు.

జిల్లాలవారీగా ఇలా..

సిద్ధిపేట జిల్లా: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల లబ్ధిదారులకు హుస్నాబాద్ పట్టణంలో.
హనుమకొండ జిల్లా: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల లబ్ధిదారులకు ముల్కనూరులో.
కరీంనగర్ జిల్లా: చిగురుమామిడి, సైదాపూర్ మండలాల లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి పరికరాలు పంపిణీ చేయనున్నారు.

ప్రత్యేక కేంద్రాల ద్వారా పంపిణీ కేంద్రానికి..

సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామం నుంచి దివ్యాంగులు, వృద్ధులను ప్రత్యేక బస్సుల ద్వారా పంపిణీ కేంద్రాలకు తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, మూడు జిల్లాల డీడబ్ల్యూఓలు, రాంగోపాల్ రెడ్డి (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డిజేబిలిటీ), రవిశంకర్ (జాయింట్ మేనేజర్, ఈడీపీ),రవికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాలకు 12 రోజుల సెలవులు

- బతుకమ్మ, దసరా సందర్భంగా..
- లబ్ధిదారులకు ముందస్తుగానే టేక్ హోమ్ రేషన్ పంపిణీకి అనుమతి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 9:

మంత్రి సీతక్క ఆదేశాల మేరకు బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు 12 రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలవుల కాలంలో లబ్ధిదారులకు సాధారణంగా అందించే వేడి భోజనం (హాట్ కుక్డ్ మీల్)కు బదులుగా టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేయడానికి అనుమతి ఇచ్చారు. అక్టోబర్ 22వ తేదీ నుంచి రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయి. ఈ మేరకు తమ పరిధిలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, హెల్పర్లకు అవసరమైన సూచనలు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారులు, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులును శాఖ ఆదేశించింది. ప్రభుత్వ స్కూల్ టీచర్ల మాదిరిగానే తమకు బతుకమ్మ, దసరా సెలవులు మంజూరు చేసినందుకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్వాడీ చరిత్రలోనే మొదటిసారిగా దసరా సెలవులు ఇచ్చి అంగన్వాడీ టీచర్స్‌ని హెల్పర్స్‌ని బతుకమ్మ సంబరాలు సంబరంగా చేసుకోమని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఇంద్ర ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐఎన్ టియుసి రాష్ట్ర అధ్యక్షురాలు డి అన్నపూర్ణ.

రాజు గారి ఫామ్‌హౌస్‌లో కేటీఆర్‌కు రహస్య వైద్యం

- లండన్ వైద్యుడితో చికిత్స కోసం 5 కోట్లు ఖర్చు
- ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ సంచలన ఆరోపణలు
- డ్రగ్స్ పరీక్షకు సిద్ధమని ప్రకటించాలని డిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09 :

ప్రెస్ మీట్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ కేటీఆర్‌పై పలు ఆరోపణలు చేశారు. రాజు గారి ఫామ్‌హౌస్‌లో కేటీఆర్‌కు లండన్ వైద్యుడితో రహస్యంగా వైద్యం చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇందుకోసం రూ.5 కోట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆధారాలు బయటపడకుండా ఉండేందుకే హెయిర్ ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్నారని ఆరోపించారు.

కేటీఆర్‌కు జ్వరం వచ్చిందని, తనను ఎవరూ కలవకూడదని సందేశం పెట్టారని బల్మూర్ వెంకట్ అన్నారు. నిజంగానే జ్వరం వస్తే సోషల్ మీడియాలో లైవ్‌లోకి వచ్చి కనిపించాలని వ్యాఖ్యానించారు. గతంలో ఈ వైద్యం కోసం లండన్‌కు వెళ్లారని, ప్రస్తుతం బయటకు వెళ్లకుండా ఫామ్‌హౌస్‌లోనే వైద్యం చేయించుకుంటున్నారని ఆరోపించారు.

కేటీఆర్‌పై ఇక నుంచి వారానికో సీరియల్‌లా అంశాలను బయటపెడతానని బల్మూర్ వెంకట్ ప్రకటించారు. కేటీఆర్ ఇంటితో పాటు పార్టీ కార్యాలయానికి కూడా గోకుడు మందు పంపిస్తున్నానని వ్యాఖ్యానించారు. గతంలో తమ ఆరోపణలకు ప్రతిస్పందనగా ముఖ్యమంత్రి గురించి సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టించారని ఆరోపించారు.

2019 నుంచి 2022 మధ్య ఓ సినీ నటితో సోషల్ మీడియాలో జరిగిన సంభాషణలను కేటీఆర్ ఎందుకు తొలగించారని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ హోటల్ వ్యాపారానికి సంబంధించిన రహస్యాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. 2015లో డెక్కన్ సెరాయ్ షేర్ విలువ రూ.5 కోట్లు మాత్రమే ఉండగా, పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందో సంబంధిత అధికారులు విచారణ జరపాలని కోరారు. ఈ అంశాలపై తాము ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆ హోటల్ నుంచి ఎక్కడెక్కడికి పార్సిళ్లు వెళుతున్నాయి, ఎవరెవరికి పంపుతున్నారనే విషయం తమకు తెలుసని బల్మూర్ వెంకట్ వ్యాఖ్యానించారు. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పే కేటీఆర్, తన పాస్‌పోర్టును సీజ్ చేయాలన్న అంశంపై పోలీసులపై కోర్టును ఎందుకు ఆశ్రయించారని ప్రశ్నించారు.

కేసీఆర్ కూడా కేటీఆర్‌తో మాట్లాడటం లేదని, వారిద్దరి మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు నవీన్ రావు తండ్రి కొండల్ రావు ప్రయత్నిస్తున్నారని బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. కేటీఆర్ చెప్పేవి నీతి మాటలని, చేసేవి అవినీతి పనులని విమర్శించారు.

చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణ

- ప్రకృతిని కాపాడడమే హైడ్రా లక్ష్యమన్న కమిషనర్
- సిఎస్ఐఆర్ - ఎన్ఈఈఆర్ఐ సదస్సులో ప్రసంగించిన హైడ్రా క్రమిషనర్

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 09:

సకల జీవకోటికీ ప్రాణాధారమైన జలవనరులను కాపాడుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు ఆరోగ్యమైన జీవనాన్ని అందించగలమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్నిహైడ్రా పెద్దయెత్తున చేపట్టిందన్నారు. ఇప్పటికే 6 చెరువుల పనులు పూర్తవ్వగా.. మరో 14 చెరువులను హైడ్రా రెండో దశలో చేపట్టామన్నారు. నగరంలో చెరువులు, కాలువలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు వరదలు లేని, పర్యావరణ హితమైన నగరాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో అనేక సవాళ్లు ఎదురైనా.. హైడ్రా ముందుకెళ్తోందన్నారు. పర్యావరణ పునరుద్ధరణ, పరిశ్రమలు- నిబంధనాధికారుల పాత్రపై సీఎస్ఐఆర్ - ఐఐసీటీలో జరిగిన జాతీయ సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. ఎన్ఆర్ఎస్సీ లెక్కల ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు కనుమరుగవ్వగా.. మిగతావి ఆక్రమణలకు గురై ఉనికిని కోల్పోయాని చెప్పారు. ఇలాంటి దశలో ఆక్రమణలు తొలగించడం ఒకెత్తయితే.. అందులో 5 నుంచి 6 మీటర్ల మేర పేరుకుపోయిన పూడికను తొలగించడం మరో సవాల్‌గా మారిందన్నారు. చెరువు ఆనవాళ్లు లేని బతుకమ్మకుంటను తవ్వి ఆ పరిసరాల్లో వరద లేకుండా చేశామన్నారు. మాధాపూర్‌లో తమ్మిడికుం ట, సున్నం చెరువు ఇలా నగరంలో ఏ చెరువును చూసినా దుర్గంధభరితంగా.. పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారాయని చెప్పారు. అలాంటి వాటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. పాతబస్తీలోని బమ్రుకున్ ఉద్ దౌలా చెరువు ఆక్రమణలకు గురై 4.5 ఎకరాలకు పరిమి తమవ్వగా.. ఇప్పుడా చెరువును 17.5 ఎకరాలకు విస్తరించామని చెప్పారు.

ప్రాక్టికల్‌గా చేసి చూపించిన హైడ్రా..

ప్రకృతి పరిరక్షణ ఎలానో చెరువుల పునరుద్ధరణతో పాటు.. పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో హైడ్రా ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తోందని సదస్సుకు హాజరైన పద్మశ్రీ పురస్కార గ్రహీత, వ్యూహాత్మక సలహాదారు, ది హిమాలయ ఇనిషియేటివ్, అశోకా ట్రస్ట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఎకాలజీ అండ్ ది ఎన్విరాన్‌మెంట్ (ఏటిఆర్ఈఈ) డైరెక్టర్ డా. ఎకలవ్య శర్మ, సీఎస్ఐఆర్ - ఐఐసీటీ డైరెక్టర్ డా. శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు. ఇన్‌లెట్లు,ఔట్‌లెట్లు..ఇలా ప్రతి చెరువుకు ఉండే సహజసిద్ధమైన లక్షణాలను కాపాడుతూ వాటిని పునరుద్ధరించడం ఆచరణీయంగా ఉందన్నారు. చెరువుల్లో నీళ్లు కలుషితం కాకుండా చూస్తే జీవవైవిద్యానికి పెద్దపీట వేసినట్టేనన్నారు. వాతావరణంలో వచ్చిన పెనుమార్పులతో హిమాలయాల మంచు కరగడం, నేపాల్‌లో వరదలు.. ఇలా ప్రకృతి వైపరీత్యాలకు గల కారణాలను డా. ఎకలవ్య శర్మ వివరించారు. సీఎస్ఐఆర్ - నీరి(ఎనఈఈ ఆర్ ఐ) నాగ్‌పూర్ డైరెక్టర్ డా.ఎస్ వెంకటమోహన్, నీరి హైదరాబాద్ శాస్త్రవేత్తలు డా.షేక్ బాషా,డా.టీవీబీపీఎస్ రామకృష్ణలు ఈ సదస్సులో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు.

గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పిన తర్వాతే దుబాయిలో అడుగుపెట్టాలి

- గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై బీఆర్ఎస్ స్పష్టమైన వైఖరి ప్రకటించాలి
- టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకుల డిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 09:

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీఆర్ఎస్ పార్టీ వారిని మోసం చేసిందని టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు విమర్శించారు. దుబాయిలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాలకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ముందుగా గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పిన తర్వాతే దుబాయిలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఎన్నారై సెల్ ఛైర్మన్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సుమారు రెండు వేల మంది గల్ఫ్ కార్మికులు మరణించారని, వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ఆ కుటుంబాలను మోసం చేసిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో 'బొగ్గుబాయి, బొంబాయి, దుబాయి' నినాదంతో గల్ఫ్ కార్మికులు కీలక పాత్ర పోషించారని టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి అన్నారు. రాష్ట్ర సాధన కోసం కష్టపడ్డ గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఇంటర్నేషనల్ కన్వీనర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యుడు నంగి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై బీఆర్ఎస్ పార్టీ తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పి, వారి సంక్షేమానికి సంబంధించి స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే బీఆర్ఎస్ నాయకులు దుబాయిలో నిర్వహించే 'గల్ఫ్ బతుకమ్మ' కార్యక్రమానికి హాజరుకావాలని అన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com